


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

సంపుటి 08, సంచిక: 330 | శనివారం | 01-11-2025 | కరీంనగర్ Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## కేరళ మరో చరిత్ర



తీవ్ర పేదరికం నుండి విముక్తి

- దేశంలోనే తొలి రాష్ట్రంగా రికార్డు
- ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ ఘనత
- నేడు సిఎం పినరయి విజయన్ అధికారిక ప్రకటన
- వామపక్ష ప్రత్యామ్నాయ ఆచరణాత్మక విజయమిది : సిపిఐ కేరళ కార్యదర్శి బినోయ్ విశ్వం

**తిరువనంతపురం :** భారతదేశానికే మార్గం చూపే కేరళ రాష్ట్రం మరో చరిత్రను సృష్టించింది. తీవ్ర పేదరికాన్ని సైతం నిర్మూలించిన ఏకైక రాష్ట్రంగా గణుతికెక్కింది. వామపక్ష ప్రజాతంత్ర సంఘటన(ఎల్‌డిఎఫ్) ప్రభుత్వ విశేష కృషితో కేరళను తీవ్ర పేదరిక రహితంగా ప్రకటించడానికి సన్నాహాలు పూర్తయ్యాయి. కేరళ ఆవిర్భావ దినోత్సవం నవంబర్ 1వ తేదీ(శనివారం) ఉదయం 9 గంటలకు శాసనసభలో జరిగే ప్రత్యేక సమావేశంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ 'తీవ్ర పేదరిక రహిత కేరళ'పై తీర్మానాన్ని ప్రవేశపెడతారు. సాయంత్రం 4 గంటలకు చంద్రశేఖరన్ నాయర్ స్టేడియంలో ప్రజల సమక్షంలో ఈ మేరకు ముఖ్యమంత్రి అధికారిక ప్రకటన కూడా చేస్తారు. తీవ్ర పేదరిక జాబితాలో 59,277 కుటుంబాలు ఉన్నాయి. వారందరినీ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీవ్ర పేదరికం నుంచి విముక్తి చేసింది.

**మార్గదర్శకంగా కేరళ : బినోయ్ విశ్వం**

భారతదేశంలోనే తొలి తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా శనివారం నాడు కేరళ ప్రకటించబడుతుందని, ఇది ఐక్య కేరళ ఆవిర్భావం చరిత్రలో ఒక ప్రకాశవంతమైన క్షణం అవుతుందని సిపిఐ కేరళ రాష్ట్ర కార్యదర్శి, మాజీ మంత్రి బినోయ్ విశ్వం అన్నారు. ఇది కేరళలోని తరువాయి 2లో

## వరద బాధితులకు తక్షణ సాయం



### ఇండ్లకు రూ.15వేలు, మృతుల కుటుంబాలకు రూ.5లక్షలు

- వరంగల్, హుస్నాబాద్ నియోజకవర్గాలలో సిఎం ఏరియల్ సర్వే
- హన్మకొండ కలెక్టరేట్‌లో మంత్రులు, 12 జిల్లాల కలెక్టర్లతో నష్టంపై సమీక్ష
- కబ్జాల విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఆదేశం

ప్రజాపక్షం/హనుమకొండ

వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు తక్షణమే సహాయం అందించడానికి ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్, హనుమకొండ, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో వరద బీభత్సంపై మంత్రులతో కలిసి హెలికాప్టర్‌లో శుక్రవారం ఆయన ఏరియల్ సర్వే నిర్వహించారు. అనంతరం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లతో కలసి రాష్ట్రస్థాయి అధికారులు, 12 జిల్లాల కలెక్టర్లు, జిల్లా అధికారులతో భారీ వర్షాలతో జరిగిన పంట, ఆస్తి, ప్రాణ నష్టాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అలాగే వరదలు, భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రాంతాల్లో తరువాయి 2లో

## మొంథా తుఫాన్ విధ్వంసం.. ఎపికి రూ. 5,265 కోట్ల ఆస్తి నష్టం

**అమరావతి:** మొంథా తుఫాన్ ఆంధ్రప్రదేశ్ (ఎపి)లో తీవ్ర విధ్వంసాన్ని సృష్టించింది. కనీసం రూ. 5,265 కోట్ల రూపాయల మేర ఆస్తి నష్టం జరిగినట్టు ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా 13,000లకుపైగా విద్యుత్ స్తంభాలు, 3,000లకుపైగా ట్రాన్స్‌ఫార్మర్లు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయని ఎపి విద్యుత్ శాఖ మంత్రి రవి కుమార్ తెలిపారు. తుఫాన్‌కు రెడు రోజుల ముందే విద్యుత్ శాఖ ఉద్యోగులందరినీ అందుబాటులో ఉంచడంతో, తరువాయి 12లో

## ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం



సుజాతనగర్ మండలంలో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, వరదలతో వేలాది ఎకరాలు పంటలు దెబ్బతిని రైతులు నష్టాల్లో కూరుకుపోయారని,పంటలు నష్టపోయి దిక్కు తోచని స్థితిలో ఉన్నరైతులను ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సుజాతనగర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన పర్యటించి క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. జరిగిన నష్టంపై రైతులతో ముచ్చటించారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ భారీ వర్షాలు, తరువాయి 2లో



## మొంథా తుఫాన్‌కి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

తెలంగాణ రాష్ట్ర రైతుసంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ 03

## మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణస్వీకారం



- ప్రమాణం చేయించిన రాష్ట్ర గవర్నర్
- హాజరైన సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రముఖులు

ప్రజాపక్షం/హైదరాబాద్

భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, కాంగ్రెస్ సీనియర్ నేత మహమ్మద్ అజారుద్దీన్ తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. అల్లా పేరు మీద అజారుద్దీన్ ప్రమాణం చేశారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సమక్షంలో ఈ కార్యక్రమం నిరాడంబరంగా జరిగింది. కార్యక్రమానికి సిఎం రేవంత్ రెడ్డితో పాటు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మంత్రులు ఎన్‌ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సి.దామోదర రాజనర్సింహ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, ఇతర మంత్రివర్గ సహచరులు, ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, డిజిపి డాక్టర్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రమాణస్వీకారం పూర్తయిన అనంతరం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇతర మంత్రులు, నేతలు అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలిపారు. సరిగ్గా మధ్యాహ్నం 12:25 గంటలకు ప్రారంభమైన అజారుద్దీన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం కేవలం 9 నిమిషాల్లోనే ముగియడం గమనార్హం. మరోవైపు, అజారుద్దీన్‌కు ఏ శాఖ కేటాయిస్తారనే విషయం ఆసక్తిని కలిగిస్తోంది.




## స్వేచ్ఛా వాణిజ్యానికి సాయం చేస్తాం

- ఎపెక్ సదస్సులో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్
- డుమ్మా కొట్టిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

**జీయెంగ్జు :** ప్రపంచ స్వేచ్ఛా వాణిజ్యాన్ని కాపాడుకోవడానికి తన దేశం సహాయం చేస్తుందని ఆసియా-పసిఫిక్ నేతలతో చైనా అధ్యక్షుడు జి జిన్‌పింగ్ అన్నారు. దక్షిణ కొరియా దేశంలోని జియోంగ్జు నగరంలో ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఎపెక్) సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సదస్సుకు హాజరయ్యేందుకు తిరస్కరించారు. ఈ సదస్సులో జిన్ పింగ్ పాల్గొని ప్రసంగించారు. దక్షిణ కొరియాలో ట్రంప్- జితో ఒప్పందాలు కుదుర్చుకుని ఒక రోజు ముందుగానే గురువారం దేశం నుంచి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ ఏడాది రెండు రోజుల ఎపెక్ శిఖరాగ్ర సదస్సులో భాగంగానే ట్రంప్-జి సమావేశం జరిగింది. అయితే, ట్రంప్ ఎపెక్ సదస్సుకు హాజరుకాకుండా దాటవేశారు. ప్రపంచ సమస్యలను పరిష్కరించడానికి సాంప్రదాయకంగా ఉపయోగించే పెద్ద, బహుళదేశాల వేదికల పట్ల ఆయన తిరస్కార భావనతో ప్రపంచ జనాభాలో దాదాపు 40 శాతం , ప్రపంచ వస్తువుల వాణిజ్యంలో సగానికి పైగా ప్రాతినిధ్యం వహిస్తున్న ఒక వేదికలో అమెరికా ఖ్యాతి మరింత దిగజారే ప్రమాదం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

**బహుళపాక్షికతను సమర్థించిన జిన్‌పింగ్**

'కాలాలు ఎంత అల్లకల్లోలంగా ఉంటే, మనం అంతగా కలిసి తరువాయి 2లో

## భారత్ – అమెరికా రక్షణ చట్రం ఒప్పందంపై సంతకం



**కౌలాలంపూర్ :** భారతదేశం, అమెరికా శుక్రవారం 10 సంవత్సరాల రక్షణ చట్రం ఒప్పందంపై సంతకం చేశాయి. కౌలాలంపూర్‌లో జరిగిన విస్తృత స్థాయి చర్చల తర్వాత భారత రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, అమెరికా యుద్ధ కార్యదర్శి పీట్ హెగ్సేత్ 'యుఎస్-ఇండియా ప్రధాన రక్షణ భాగస్వామ్యం' ఒప్పందం కోసం చట్రం ఒప్పందంపై సంతకాలు చేశారు. ద్వైపాక్షిక రక్షణ సహకారాన్ని మరింతగా పెంచడానికి విస్తృత దృష్టి, విధాన దిశను అందించడానికి ఈ ఫ్రేమ్‌వర్క్ ఒప్పందం ఉద్దేశించబడింది. 2015లో సంతకం చేసిన ఇలాంటి ఒప్పందం గడువు ముగియడంతో ఈ అవసరం ఏర్పడింది. కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియోతో ద్వైపాక్షిక సమావేశం నిర్వహించిన కొన్ని రోజుల తర్వాత రాజ్‌నాథ్‌సింగ్, హెగ్సేత్ మధ్య జరిగిన మొదటి సమావేశం ఇది. హెగ్సేత్ తో తన చర్చలు 'ఫలవంతమైనవి' అని అభివర్ణించిన సింగ్, ఈ ఫ్రేమ్ వర్క్ ఒప్పందం 'ఇప్పటికే బలంగా ఉన్న మన రక్షణ భాగస్వామ్యంలో కొత్త శకానికి' నాంది పలుకుతుందని అన్నారు. వారిరువురు ఆసియాన్ సమావేశాలలో పాల్గొనేందుకు కౌలాలంపూర్‌కు వెళ్ళారు. 'రక్షణ సహకారంలో అమెరికాకు భారతదేశం ప్రాధాన్యత గల దేశమని, స్వేచ్ఛాయుతమై, బహిరంగ ఇండో-పసిఫిక్‌ను నిర్ధారించడానికి భారతదేశంతో కలిసి పనిచేయడానికి వారు కట్టుబడి ఉన్నారని యుద్ధ కార్యదర్శి పునరుద్ఘాటించారని' అని రక్షణ మంత్రిత్వ శాఖ ప్రకటనలో తెలిపింది. భారతదేశంలో ఎఫ్-414 జెట్ ఇంజిన్ల ఉమ్మడి ఉత్పత్తి కోసం హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్), అమెరికా రక్షణ ప్రధాన సంస్థ జిఇ ఏరోస్పేస్ మధ్య ప్రతిపాదిత ఒప్పందం కూడా చర్చలలో ఉందని తెలిసింది. గత కొన్ని సంవత్సరాలుగా భారతదేశం-అమెరికా రక్షణ సహకారం ఊపందుకుంది. దాదాపు 10 సంవత్సరాల క్రితం, కీలకమైన సైనిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడానికి మార్గం సుగమం చేస్తూ, అమెరికా భారతదేశాన్ని 'ప్రధాన రక్షణ భాగస్వామి'గా హోదా కల్పించింది.

## ఎఐబిఇఎ, ఐప్సో నేత రామరాజు ఆకస్మిక మృతి



03

## ఇద్దరు ఎమ్మెల్యేలకు నామినేటెడ్ పదవులు



- ప్రభుత్వ సలహాదారునిగా పి.సుదర్శన్ రెడ్డి
- పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా ప్రేమ్ సాగర్ రావు

ప్రజాపక్షం/హైదరాబాద్:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారునిగా బోధన్ ఎంఎల్ఎ, మాజీ మంత్రి పి.సుదర్శన్ రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌గా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావును ప్రభుత్వం నియమించింది. మంత్రివర్గ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితుడిగా సలహాదారుడు పి.సుదర్శన్‌రెడ్డికి అవకాశం కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రులకు ఉండే అన్ని సదుపాయాలను సుదర్శన్ రెడ్డికి కల్పించనున్నట్లు ప్రభుత్వ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ మంత్రివర్గంలో స్థానాన్ని ఆశించిన ఇద్దరు ఎంఎల్‌ఎలకు క్యాబినెట్ హోదాతో పదవులు దక్కాయి. ప్రజలలో, రాజకీయాలలో తరువాయి 2లో



## ఉద్యోగులు, ఆర్&బి బకాయిల నిధులు విడుదల

అక్టోబర్ నెల రూ.1,031 కోట్లను విడుదల చేసిన ఆర్థిక శాఖ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు సంబంధించిన పెండింగ్ బిల్లులను అక్టోబర్ మాసానికి సంబంధించి సుమారు రూ 1,031 కోట్లను ఆర్థిక శాఖ ఒకేసారి విడుదల చేసింది. ఇందులో ఉద్యోగుల బకాయిలు రూ. 712 కోట్లు, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ పెండింగ్ బిల్లులు రూ.320 కోట్లు ఉన్నాయి. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఆర్థిక శాఖ అధికారులతో డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శుక్రవారం సమావేశమయ్యారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను దశల వారీగా తరువాయి 2లో

## సిపిఐ(ఎం) నాయకుడు సామినేని రామారావు హత్య



సిపిఐ(ఎం), సిపిఐ నేతలు సహా పలువురి నివాళి

ప్రజాపక్షం/ ఖమ్మం /చింతకాని

సిపిఎం సీనియర్ నాయకులు, రైతు సంఘం ఉమ్మడి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సామినేని రామారావు (75)ను శుక్రవారం ఉదయం ప్రత్యర్థులు దారుణంగా హత్య చేశారు. ఆయన స్వగ్రామం చింతకాని మండలం పాతర్లపాడులో ఉదయం ఐదు గంటలకు లేచి ఉదయపు నడక అనంతరం ఇంటికి చేరుకున్న రామారావు పక్కనే ఉన్న చావిడిలో పని చేస్తుండగా అప్పటికే అక్కడ మాటు వేసిన దుండగులు ఒక్కసారిగా రామారావుపై పడి కత్తితో పొట్ట, ఛాతీ భాగంలో పొడిచారు. తీవ్ర కత్తి పోట్లతో రక్తస్రావం కావడంతో రామారావు సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. రామారావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామారావు హత్య ఈ ప్రాంతంలో సంచలనం సృష్టించింది. మృతి వార్త తెలిసిన వెంటనే ఖమ్మం సిపి సునీల్ దత్ సంఘటన స్థలంకు చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్‌టీంను, ఫోరెన్సిక్ బృందాన్ని రంగంలోకి దించారు. ఈ బృందాలు రక్త నమూనాలు, వేలిముద్రలు సేకరించగా డాగ్ స్క్వాడ్‌ను సైతం రంగంలోకి తరువాయి 2లో

## 'ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాల్సిందే'

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కీలక వ్యాఖ్యలు
- సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీపై కాంగ్రెస్ చీఫ్ విమర్శల ఎదురుదాడి



**న్యూఢిల్లీ :** దేశంలో అత్యధికంగా శాంతిభద్రతల సమస్యలు తలెత్తడానికి బిజెపిఆర్‌ఎస్‌ఎస్ కారణమని, ఈ క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై చేసిన ఆరోపణలను మల్లికార్జున్ ఖర్గే తిప్పి కొట్టారు. ప్రభుత్వ ఉద్యోగులను సంఘ్‌తో అనుసంధానించడానికి అనుమతించడం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీ సర్దార్ వల్లభాయ్ పటేల్ వారసత్వాన్ని అవమానించారని ఖర్గే ఆరోపించారు. పటేల్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీపై విమర్శల దాడికి దిగిన తర్వాత మల్లికార్జున్ ఖర్గే ప్రధాని మోదీపై విమర్శల ఎదురుదాడి చేశారు. 1948లో మహాత్మాగాంధీ హత్య తర్వాత సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆర్‌ఎస్‌ఎస్‌ను విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలను తరువాయి 2లో



# ప్రపంచం
WORLD NEWS

## యువరాజు హోదా కోల్పోయిన ఆండ్రూ



**లండన్ :** కుంభకోణంలో చిక్కుకున్న బ్రిటన్ రాజు చార్లెస్–3 తమ్ముడు ఆండ్రూ తన యువరాజు హోదాను కోల్పోయాడని, త్వరలోనే విండ్సర్ క్యాజిల్ ఎస్టేట్‌లోని తన రాయల్ లాడ్జ్ భవనం నుండి బయటకు వెళ్తాడని బకింగ్‌హామ్ ప్యాలెస్ తెలిపింది. ఆయన అధికారిక 'రోల్ ఆఫ్ ది పీరేజ్' నుండి శుక్రవారం తొలగించబడ్డాడని వెల్లడించింది. అమెరికన్ లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో ఆండ్రూకు ఉన్న సంబంధం గురించి నిరంతర ఆరోపణల మధ్య, చక్రవర్తితో చర్చించిన అనంతరం ఆండ్రూ స్వచ్ఛందంగా 'డ్యూక్ ఆఫ్ యార్క్' బిరుదు సహా ఇతర రాజ గౌరవాలను వదులుకున్న కొన్ని రోజుల తర్వాత గురువారం సాయంత్రం రాజు నిర్ణయం వెలువడింది.

## హమాస్ – ఇజ్రాయెల్ మృతుల అవశేషాల పరస్పర అప్పగింత



**జెరూసలెం :** ఇజ్రాయెల్ శుక్రవారం 30 మంది పాలస్తీనీయుల మృతదేహాలను అప్పగించినట్లు గాజాలోని ఒక ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. హమాస్ ఇద్దరు ఇజ్రాయెల్ బందీల అవశేషాలను రెడ్ క్రాస్‌కు గురువారం నాడు అందజేసింది. అక్కడి నుంచి వాటిని ఇజ్రాయెల్ బలగాలకు అప్పగించగా, వారిని గుర్తించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసిన్‌కు తరలించినట్లు ఇజ్రాయెల్ మిలిటరీ తెలియజేసింది. ఆ అవశేషాలలో ఒకటి సహర్ బరూచ్ అనే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ డిగ్రీ చదివేందుకు సన్నద్ధమవుతున్న విద్యార్థిదిగా, మరొకటి అమీరామ్ కూపర్ అనే ఆర్థికవేత్తదిగా గుర్తించారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజామిన్ నెతన్యాహూ గురువారం రాత్రి నిర్ధారించారు. వారిరువురిని 2023 అక్టోబర్ 7న హమాస్ దాడి చేసి తీసుకెళ్ళారు. కాల్పుల విరమణ ప్రారంభమైనప్పటి నుంచి హమాస్ 17 మంది బందీల అవశేషాలను తిరిగి ఇచ్చేసింది. మరో 11 మంది అవశేషాలు గాజాలోనే ఉండగా, ఒప్పందంలో నిబంధనల ప్రకారం వాటిని కూడా వెనక్కి ఇస్తారు. ఇజ్రాయెల్ ఇప్పటి వరకు 195 మంది పాలస్తీనీయుల మృతదేహాలను గాజా అధికారిక వర్గాలకు అప్పగించింది. వారి గురించిన వివరాలు ఇప్పటి వరకు తెలియలేదు. వారిని అక్టోబర్ 7న చంపేశారా లేదా ఇజ్రాయెల్ కస్టడీలో బందీలుగా మరణించారా? లేదా యుద్ధ సమయంలో గాజా నుంచి వారిని తీసుకెళ్ళారా? అనేది స్పష్టం కాలేదు. డిఎన్ఎ కిట్లు లేకపోవడంతో మరణించిన వారిని గుర్తించడంతో గాజా వైద్యాధికారులు ఇబ్బందులు పడుతున్నారు.

## పాక్–అఫ్ఘాన్‌ల మధ్య చర్చల పునరుద్ధరణ

### సమ్మతించినట్లు తుర్కియే సంయుక్త ప్రకటన

**ఇస్లామాబాద్ :** గత వారం ప్రతిష్టంభన నెలకొన్న శాంతి చర్చల ప్రక్రియను పునరుద్ధరించేందుకు పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్ దేశాలు శుక్రవారం అంగీకరించాయి. ఇరు దేశాల సరిహద్దుల వెంబడి కాల్పుల విరమణను కొనసాగించాలని నిర్ణయించాయి. పాకిస్తాన్, అఫ్ఘానిస్తాన్‌కు చెందిన తాలిబాన్ ప్రతినిధులకు నడుమ ఇస్తాంబుల్‌లో గత శనివారం రెండవ విడత చర్చలు ప్రారంభమయ్యాయి. అయితే సరిహద్దు వెంబడి దాడులు నిలిపివేసేందుకు హామీ ఇవ్వడంలో తాలిబాన్ అయిష్టంగా ఉందనే పాకిస్తాన్ ఆరోపించడంతో చర్చలు విఫలమయ్యాయి. తాజా చర్చలకు ఆతిథ్యం ఇస్తున్న తుర్కియే శుక్రవారం విడుదల చేసిన సంయుక్త పత్రికా ప్రకటనలో నవంబర్ 6న ఇస్తాంబుల్‌లో ముఖ్యుల స్థాయి సమావేశం జరనున్నట్లు డాన్ పత్రిక పేర్కొంది. ఈ సమావేశంలో అమలు చేయాల్సిన విధివిధానాలపై చర్చించి, నిర్ణయిస్తారని ఆ పత్రిక వార్తలో వెల్లడించారు. అయితే, "ముఖ్యులు" ఎవరనే అంశంపై స్పష్టత లేదు. ఉభయ దేశాల రక్షణ శాఖల మంత్రుల మధ్య చర్చలు జరగవచ్చని ఊహిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. గతంలో దోహాలో జరిగిన మొదటి విడత చర్చలకు వారే నేతృత్వం వహించడంతో ఇస్తాంబుల్ సమావేశంలో సైతం వారే కొనసాగుతారని భావిస్తున్నారు. శాంతిని కొనసాగించేందుకు , ఉల్లంఘనలకు పాల్పడే వైపు జరిమానా విధించేందుకు "పర్యవేక్షణ, పునఃపరిశీలన యంత్రాంగం" ఏర్పాటుకు ఇరు దేశాలు సమ్మతించినట్లు తుర్కియే విదేశాంగ వ్యవహారాల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సంయుక్త ప్రకటనలో పేర్కొంది. మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న తుర్కియే, ఖతార్‌లు ఉభయ పక్షాల క్రియాశీలక భాగస్వామ్యం పట్ల అభినందించాయి. ఈ పరిణామాల పట్ల తాలిబాన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ వ్యాఖ్యానిస్తూ ఒక ఇస్లాం దేశం ఇతర పొరుగు దేశాల పట్ల మంచి సంబంధాలను కోరుకుంటుందని, పాకిస్తాన్‌తో సానుకూల సంబంధాలను ఆశిస్తున్నామన్నారు.



పరస్పర గౌరవం ఆధారంగా సంబంధాలు నిలబడతాయని, అంతర్గత వ్యవహారాలలో జోక్య రహితంగా ఉండటం, ఏ పక్షానికి ముప్పుగా పరిణమించబోదని అన్నారు. కాగా, తేహ్రీక్ ఎ తాలిబాన్‌ను ఉగ్రవాద సంస్థగా ప్రకటించాలని పాకిస్తాన్ డిమాండ్ చేస్తుంది. ఆ సంస్థ కార్యకలాపాలపై తమకు నియంత్రణ లేదని, తమ భూభాగంలో టిటిపి సభ్యులు ఎవరైనా కనిపిస్తే, వారిని ఖైదు చేసి, బహిష్కరిస్తామని తాలిబాన్ అధికారులు చెబుతున్నారు. వారు పాకిస్తాన్ జాతీయులేనని, పాకిస్తాన్ నుంచే కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని అన్నారు.

## 'మాదకద్రవ్యాల బోట్లు' పేరుతో అమెరికా దాడులు గర్హణీయం

### ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల చీఫ్ వొల్కర్ టర్క్

**జెనీవా :** దక్షిణ అమెరికా నుండి అక్రమ మాదకద్రవ్యాలు తీసుకెళ్తున్నాయన్న ఆరోపణలతో పలు బోట్లపై అమెరికా చేస్తున్న సైనిక దాడులు చేయడం గర్హణీయమని, వీటిని అంగీకరించలేమని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంస్థ చీఫ్ వొల్కర్ టర్క్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బోట్లపై దాడులను, అమెరికాలోకి మాదకద్రవ్యాల ప్రవాహాన్ని నిరోధించడానికి అవసరమైన చర్యగా పేర్కొంటున్నప్పటికీ, టర్క్ ఆయనతో విభేదిస్తున్నారు. ఈ దాడులపై విచారణ జరగాలని డిమాండ్ చేశారు.. సెప్టెంబర్ ప్రారంభం నుండి ఆ ప్రాంతంలోని బోట్లపై దాడుల్లో 60కు పైగా మంది చనిపోబడ్డారని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల కార్యాలయ అధికార ప్రతినిధి రవీనా షాందాసాని తెలిపారు. దాడులను, తద్వారా పెరుగుతున్న మరణాలను చూస్తూ ఊరుకోలేమని జెనీవాలో ఆమె మీడియాతో మాట్లాడుతూ అన్నారు. కరిబియన్, పసిఫిక్‌లో బోట్లపై అమెరికా ఎయిర్‌స్ట్రైక్స్ అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాన్ని ఉల్లంఘిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు. అమెరికా ఈ దాడులను ఆపి, ఈ బోట్లలోని వ్యక్తుల మరణాలను నివారించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులను మాదకద్రవ్యాలు వ్యతిరేక, ఉగ్రవాద వ్యతిరేక చర్యలుగా అమెరికా పేర్కొంటున్న విషయాన్ని ఆమె ప్రస్తావిస్తూ, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలే తప్ప, దాడులు చేసి మనుషులను హతమార్చడం అన్యాయమని అన్నారు. ఆమెరికా వెంటనే స్పందించి, దాడులకు నిలిపివేయాలని ఆమె కోరారు.

## శాఖాహార ప్రచారం కోసమే ప్రపంచ వేగన్ దినోత్సవం

**ఐక్యరాజ్యసమితి :** పండ్లు, కాయలు, ఆకుకూరలు, కూరగాయలు, ఆహార ధాన్యాలు, పప్పులు, నట్స్, గింజలు, సూపర్‌ఫుడ్స్ లాంటి వృక్ష సంబంధ ఆహార పదార్థాలను వేగన్ ఫుడ్‌గా వర్గీకరిస్తారు. వృక్ష లేదా మొక్కల నుంచి లభించే ఉత్పత్తులను మాత్రమే తమ ఆహారంగా తీసుకునే వ్యక్తులను వేగన్స్ అని, ఇలాంటి ఆహార పదార్థాలను తీసుకోవాలని ప్రచారం చేసే ఉద్యమాన్ని వేగనిజం అని పిలుస్తున్నాం. జంతు సంబంధ మాంసం, పాలు, పాల ఉత్పత్తులు, జంతు కొవ్వు, గుడ్లు, తేనె లాంటి ఆహార పదార్థాలకు దూరంగా కేవలం మొక్కలు లేదా వృక్షాల నుంచి లభించే ఉత్పత్తులను వినియోగించడం, వీటి ప్రాధాన్యాలను వివరించడం, వేగనివ్వండి పాటించడానికి ప్రజలను చైతన్య పరచడం లాంటి ఉన్నత లక్ష్యాలతో 1994 నుంచి ప్రతి ఏట 01 నవంబర్న ప్రపంచ వేగన్ దినోత్సవాన్ని పాటించుట ఆనవాయితీగా మారింది. లూయిస్ వాల్లిస్ చొరవతో యూకెలో ఏర్పడిన తొలి వేగన్ సొసైటీ 50వ వార్షికోత్సవం సందర్భంగా ప్రపంచ వేగన్ దినం పాటించుట జరుగుతున్నది. వేగన్ లేదా శాఖాహార ఉత్పత్తులను మాత్రమే తీసుకొనుట మన జీవనశైలిలో అలవాటు అయితే మన ఆరోగ్యంతో పాటు జంతు సంరక్షణ, భూగ్రహ పర్యావరణ పరిరక్షణ కూడా జరుగుతాయని తెలుసుకోవాలి. జంతు సంబంధ ఆహార పదార్థాలతో పాటు జంతు ఉత్పత్తుల నుంచి తయారైన వస్త్రాలు, ఎముకలతో తయారైన ఉత్పత్తులు, తోలు సంబంధ వస్తువులు మొదలగు వాటి వాడకాన్ని కూడా వేగన్స్ నిషేధిస్తారు. జంతు ఉత్పత్తులు తినడం లేదా వాడడంతో జీవ వైవిధ్యత దెబ్బ తినడం, జంతు హింస, సాదు జంతువుల వల్ల అడవుల్లో హరిత క్షేత్రాలు పలుచబడడం, పర్యావరణ కాలుష్యానికి ఆజ్యం పోయడం, భూతాపం పెరగడం లాంటి ప్రతికూల మార్పులకు దారి తీస్తుందని, కేవలం వృక్ష సంబంధ ఆహారం లేదా ఇతర ఉత్పత్తులు వాడడం వల్ల మానవాళి ఆరోగ్యంతో పాటు సుస్థిర పర్యావరణం, జీవ వైవిధ్యం ఫలిస్తాయని తెలుసుకోవాలి. వరల్డ్ వేగన్ డే సందర్భంగా శాఖాహారాన్ని ప్రోత్సహిస్తూ #గోవేగన్, #వేగన్లైఫ్ఫుల్, #ప్లాంట్బేస్డ్వాయిసెస్ లాంటి హాష్ట్యాగులతో సామాజిక మాద్యమాలు, వేగన్ డే వేదికలు, విద్యాలయాల్లో ముమ్మర ప్రచారం చేయడానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దాం, ఆరోగ్యకర పౌర సమాజాన్ని/పర్యావరణాన్ని/జంతుజాలాన్ని నిర్మిద్దాం.

## వియత్నాంలో వరద బీభత్సం : 13 మంది మృతి

**హనోయ్ :** వియత్నాంలో రోజుల తరబడి రికార్డు స్థాయిలో వర్షాలు, కొండచరియలు విరిగిపడటంతో కనీసం 13 మంది మరణించగా, 11 మంది గల్లంతవ్వగా,10వేల మంది నిరాశ్రయులయ్యారు. సహాయక బృందాలు సుమారు 26,000 మందిని వరదలు లేదా కొండచరియలు విరిగిపడే ప్రాంతాల నుండి తరలించారు. హనోయ్, హోచిమిన్ నగరాన్ని కలిపే కీలక రవాణా మార్గం అయిన దేశంలోని ఉత్తరదక్షిణ రైల్వే, మూడు రోజులుగా నిలిచిపోయిన తర్వాత శుక్రవారం తెల్లవారుజామున పునరుద్ధరించబడింది. ఈ వారం ప్రారంభంలో కేవలం 24 గంటల్లో హ్యూలో 1,085 మిల్లీమీటర్లు (42 అంగుళాలు) వర్షం నమోదైంది. ఇది వియత్నాంలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక రోజువారీ వర్షపాతం. ప్రధాన మంత్రి ఫామ్ మిన్ చిన్హ్ సహాయ చర్యలను వేగవంతం చేయాలని, ఎవరూ ఆకలితో లేదా ఆశ్రయం లేకుండా ఉండకుండా చూసుకోవడానికి అత్యవసర చర్యలను ఆదేశించారు. విపత్తు అధికారుల ప్రకారం, మధ్య వియత్నాం ప్రాంతం అంతటా దాదాపు 1.20 లక్షల ఇళ్లు వరదలతో మునిగిపోయాయి.నవంబర్ 4 వరకు మధ్య వియత్నాంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగవచ్చని, కొన్ని ప్రాంతాల్లో 700 మిల్లీమీటర్ల కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని అధికారుల హెచ్చరించారు.ఈ దేశం ప్రపంచంలోనే అత్యంత వరదలకు గురయ్యే దేశాలలో ఒకటి, దాని జనాభాలో దాదాపు సగం మంది అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలలో నివసిస్తున్నారు.



## తక్షణ సాయం

(మొదటి పేజీ తరువాయి)

స్థానికంగా పర్యటించి ప్రజలను నష్టము గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హనుమకొండ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని కలెక్టర్ లకు సూచించారు. ప్రాణ నష్టం, పంట నష్టం, పశు సంపద, అన్ని శాఖలకు సంబంధించి ఇన్ఫ్రాస్ట్రక్చర్ నష్టానికి సంబంధించి నివేదికలు తెప్పించుకోవాలన్నారు. ఇందుకు ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలన్నారు. తుఫాను ప్రభావంతో 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవాలని, కేంద్రం నుంచి రావాల్సిన నిధులను రాబట్టుకోవడంలో అలసత్వం వద్దు అని చెప్పారు. కేంద్రం నుంచి రాబట్టుకోవాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం రాబట్టుకుంటుందని అన్నారు. ముంపు ప్రాంతాల్లో తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అధికారులలో సమన్వయ లోపంతో సమస్యలు పెరుగుతున్నాయని, అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నాలాల కబ్జాలను తొలగించాల్సిందేనని, వాటి వెనుక ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేసారు. పది మంది కోసం పదివేలమందికి నష్టం జరుగుతుంటే ఉపేక్షించొద్దు అన్నారు. దీనిపై అధికారులు స్పష్టమైన నిర్ణయంతో ముందు కు వెళ్లాల్సిందేనని చెప్పారు. వరదలు తగ్గిన నేపథ్యంలో శానిటేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. వరదల్లో ప్రాణ నష్టం జరిగినచోట రూ.5 లక్షలు పరిహారం ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ఇందుకు సంబధించి వివరాలు సేకరించాలని, అలాగే పంటనష్టం, పశు సంపద నష్టపోయిన చోట వారికి పరిహారం అందించాలని, ఇసుక మేటలు పేరుకున్న రైతులను ఆదుకునేందుకు అంచనాలు వేయాలన్నారు.

ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఆదేశాలు ఇచ్చారు. మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు.స్మార్ట్ సిటీలో చేయాల్సిన పనులపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని, ఎక్కడా పనులు ఆపే ప్రసక్తి ఉండొద్దని,క్షేత్రస్థాయిలో ఒక కోఆర్డినేషన్ కమిటీ వేసుకుని పనిచేయాలన్నారు.

వాతావరణ మార్పులతో క్లౌడ్ బరస్ట్ అనేది నిత్యకృత్యమైందని,దీనికి శాశ్వత పరిష్కారం దిశగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.అధికారులు నిర్లక్ష్యం వదలండి క్షేత్రస్థాయికి వెళ్లండని, కలెక్టర్లు ఫీల్డ్ విజిట్స్ చేయాల్సిందేనని ఆదేశాలు ఇచ్చారు.

**హెలికాప్టర్ ద్వారా సీఎం రేవంత్ ఏరియల్ వ్యూ**

తుఫాన్ ఎఫెక్ట్ కురిసిన భారీ వర్షాలకు ట్రైసిటీస్ అయిన హనుమకొండ, కాజీపేట, వరంగల్లోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఈమేరకు శుక్రవారం వరద ప్రభావిత ప్రాంతాలను సీఎం రేవంత్ హెలికాప్టర్ ద్వారా ఏరియల్ వ్యూ చేశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు. అనంతరం హనుమకొండలోని వర్షానికి దెబ్బతిన్న వివిధ ప్రాంతాలలో సిఎం రేవంత్ రెడ్డి మంత్రులతో కలిసి పర్యటించారు. సిఎం వెంట రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు తదితరులు ఉన్నారు.

**ముంపు శాశ్వత పరిష్కారం చూపి నగరాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి**

**సీఎంకి వామపక్షాల నాయకుల వినతి**

ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా ఆర్ట్స్, సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో ముఖ్య మంత్రిని జిల్లా వామపక్ష పార్టీల జిల్లా ప్రతినిధి బృందం కలిసి, వరద ముంపు నుండి వరంగల్ మహా నగరానికి శాశ్వత పరిష్కారం చేపట్టాలని, హనుమకొండ నగరాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని వినతి పత్రాన్ని అందచేసి కోరారు. దీనికి స్పందిస్తూ ముఖ్యమంత్రి సమీక్ష సమావేశంలో మాట్లాడు తానని చెప్పారు. ముంథా తుఫాన్ కారణంగా వరంగల్ మహా నగరం తీవ్రంగా నష్టపోయిందని, ప్రధానంగా ముంపు ప్రాంతంలో మునిగిపోయిన ఇండ్లను అధికారులు సందర్శించి వారు కోలుకునే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు. అలాగే ప్రతికుటుంబానికి తగిన నష్టపరిహారాన్ని చెల్లించాలని, యుద్ధ ప్రాతిపదికన తెగిపోయిన రోడ్లను, డివైడర్లను పునర్నిర్మాణం చేయాలని,ఆరోగ్య సమస్యలు తలత్తెకుండా డ్రైనేజీ, పారిశుద్ధ్య, సానిటేషన్ పనులను నిరంతర ప్రక్రియగా చేపట్టాలి. నగరంలో అండర్గ్రైన్ సిస్టమ్ను ఏర్పాటు చేయాలని కోరారు. వరంగల్ మహానగరానికి ప్రత్యేకంగా వరద సహాయం కొరకు సియం సహాయనిధి నుండి విధులు కేటాయించాలని, అలాగే హైద్రాబాద్ తరువాత 2వ నగరంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ మహానగరానికి అభివృద్ధి నిధులు కేటాయించాలని కోరుతున్నామన్నారు. ఈ వినతి పత్రాన్ని అందచేసిన వామాపక్షాల ప్రతినిధి బృందంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సిరబోయిన కరుణాకర్,ఆదరి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం. చుక్కయ్య, బొట్ల చక్రపాణి, గౌడుగు వెంకట్, ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి కౌడగాని శివాజీలు ఉన్నారు.

## 'ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాల్సిందే'

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఉదహరించారు. ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాలని మరోసారి వ్యాఖ్యానించడాన్ని విలేకరులు ప్రశ్నించగా మల్లికార్జున్ ఖర్గే స్పందిస్తూ 'ఇది నా వ్యక్తిగత అభిప్రాయం. శాంతిభద్రతలకు సంబంధించిన చాలా సమస్యలు బిజెపిఆర్ఎస్ఎస్ వల్లే తలెత్తుతున్నాయి కాబట్టి నేను దీనిని బహిరంగంగానే చెబుతా' అని సమాధానమిచ్చారు. పటేల్ మనముందు ఉంచిన విషయాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోంమంత్రి అమిత్‌షా గమనించాలని కాంగ్రెస్ చీఫ్ కోరారు. ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్‌తో సహవాసం చేయడంపై నిషేధాన్ని ఎత్తివేయడం గురించి అడిగినప్పుడు, పటేల్ స్వయంగా ఆర్ఎస్ఎస్‌ను నిషేధించినప్పుడు 'అప్పుడు ఆయన సహజంగానే మన వల్లభాయ్ పటేల్ జీని అగౌరవపరుస్తున్నారు. పటేల్ జీ ఆర్ఎస్ఎస్‌ను నిషేధించడానికి అన్ని కారణాలను తెలియజేశారు. అక్కడ ఎలాంటి అస్పష్టత లేదు' అని ఖర్గే అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఐక్యత, శాంతిని తీసుకురావాలని కోరుకున్నారని, దాని కోసం నేను పోరాడుతున్నాను అని కాంగ్రెస్ చీఫ్ పేర్కొన్నారు. 'కానీ దేశంలో ఐక్యతను తీసుకువచ్చిన తర్వాత, ఆ ఐక్యతను విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నించే ఎవరికైనా గుణపాఠం నేర్పించాలి. ఆ ఐక్యతను విచ్ఛిన్నం చేసే వ్యక్తులు ఎవరో మీకు తెలుసు' అని ఖర్గే చెప్పారు. పటేల్‌ను నెహ్రూ భారతదేశ ఐక్యత నిర్మాణశిల్పి అని పిలిచారని మల్లి కార్జున్ ఖర్గే గుర్తుచేశారు.

**స్వాతంత్ర్యఉద్యమంలో పాత్రలేని భావజాలం దుర్వినియోగం:జైరాంరమేశ్**

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్‌పార్టీ బిజెపిఆర్ఎస్ఎస్‌పై విమర్శలదాడితో విరుచుకుపడింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేశ్ విమర్శలదాడితో విరుచుకుపడ్డారు.'పటేల్ మాటల్లోనే చెప్పాలంటే మహాత్మాగాంధీ హత్య అనే దారుణమైన వాతావరణాన్ని సృష్టించిన వారి దుర్వినియోగ భావజాలాన్ని చూసి నిస్వార్థపరులైన వ్యక్తులు భయపడి ఉండేవారు. ముఖ్యంగా 2014 నుంచి చరిత్ర 'G2, వారి పర్యావరణ వ్యవస్థ' ద్వారా స్పష్టమైన తప్పుడు ప్రాతినిథ్యంతో పాటు వక్రీకరణకు గురైంది' అని జైరాంరమేశ్ పేర్కొన్నారు. ఆయన ఈ విషయాన్ని తన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే (మొదటి పేజీ తరువాయి)

వరదల కారణంగా జరిగిన పంటల నష్టంపై యుద్ధ ప్రాతిపదికన సర్వే చేపట్టి పూర్తి చేయాలని ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలన్నారు. జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిహారం కోసం కృషి చేస్తానని చెప్పారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులకు తగిన ప్రతిఫలం దక్కకుండా ఆర్థికంగా దెబ్బతిన్నారని, రైతాంగ నష్టంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు, విద్యుత్ పునరుద్దరణ పనులు తక్షణమే పూర్తి చేయాలని, ఇండ్లు కోల్పోయిన నిరాశ్రయులైన పేదలకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, తహశిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడిఓ భారతి,వ్యవసాయాధికారిణి నర్మద, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు, వీర హనుమంతరావు, సిపిఐ నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యా ధ్రస్తు, కొమారి హన్మంతరావు, జక్కుల రాములు పాల్గొన్నారు.

## నామినేటెడ్ పదవులు

(మొదటి పేజీ తరువాయి)

మంచి పట్టు ఉన్న సీనియర్ నాయకులు సుదర్శన రెడ్డిని ప్రభుత్వ సలహాదారునిగా నియమించడం, ఎంఎల్ఎ ప్రేమ్ సాగర్ రావ్‌ను అత్యంత కీలకమైన పౌర సరఫరాల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించడం హర్షించదగ్గ విషయమని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుపై సలహాదారునిగా సుదర్శన్ రెడ్డిని నియమించడం వల్ల రాష్ట్రంలో పథకాల అమలు మరింత వేగంగా జరిగే అవకాశాలు ఉంటాయన్నారు. సుదర్శన్ రెడ్డి అనుభవం, చిత్తశుద్ధి రాష్ట్ర అభివృద్ధి కి మరింత తోడ్పడుతుందన్నారు. ప్రేమ్‌సాగర్ రావ్‌కు పౌరసరఫరాల శాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వడం వల్ల ప్రభుత్వం అమలు చేస్తున్న రేషన్ కార్డులు, సన్న బియ్యం పథకాలు, ధాన్యం కొనుగోలు లాంటి కీలకమైన పనులు మరింత వేగంగా జరుగుతాయన్నారు.

## రామారావు దారుణ హత్య

(మొదటి పేజీ తరువాయి)

దించారు. రామారావు శరీరంపై ఏడు కత్తి గాట్లు ఉన్నాయి. రామారావు సుదీర్ఘకాలం పాతర్లపాడు గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. సౌమ్యుడిగా పేరున్న రామారావు హత్య ఈ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారి తీసింది. గ్రామంలో పికెట్ ఏర్పా టు చేశారు. లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిసిపి ఆర్. ప్రసాద రావు, వైరా, మధిర సబ్ డివిజన్ పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**సిపిఎం నేతల నివాళి :**

రామారావు మృతిపట్ల సిపిఎం, జిల్లా రాష్ట్ర కమిటీలు తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశాయి. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వై. విక్రం, మడుపల్లి గోపాలరావు తదితరులు అరుణ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు.

**సిపిఐ నేతల నివాళి :**

రామారావు మృతిపట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సిపిఎం కార్యాలయంలో రామారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ రామారావు హత్యను సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. హత్య కారకులను కనుగొని కఠినంగా శిక్షించాలన్నారు. హత్యా రాజకీయాలతో ఎవరు మనుగడ సాగించలేరని ఆయన స్పష్టం చేశారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేశ్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , పావులూరి మల్లికార్జున్, చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, వివిధ సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, తాటి నిర్మల, ఆళ్ల రవీందర్, తాళ్లూరి యాదగిరి, కొత్తపల్లి రమేష్, చింతల రమేశ్, శివ తదితరులు ఉన్నారు.

## కేరళ మరో చరిత్ర

(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం పేదల పట్ల చూపే పక్షపాతాన్ని వెల్లడిస్తుంది. 'కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల, ధనిక పక్షపాత పాలనా విధానాలకు ఒక సవాలుగా ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీసుకున్న చర్య ఫలితంగా ఒక ప్రత్యామ్నాయంగా ముందుకు వచ్చింది. మనుషులకు ఆహారం, దుస్తులు, నివాసం వంటి ప్రాథమిక అవసరాలను నిర్ధారించడమే అభివృద్ధి ప్రాథమిక లక్ష్యం అని వామపక్షాలు విశ్వసిస్తాయి' అని బినోయ్ విశ్వం హర్షం వ్యక్తం చేశారు. 'ఐక్య కేరళ ఏర్పడినప్పటి నుంచి రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రగతిశీల వామపక్ష ప్రభుత్వాల దార్శనికత, విధానాలు ఈ దిశలోనే ఉన్నాయి. 1957లో మొదటి కేరళ ప్రభుత్వం ఆక్రమణలను నిషేధించింది. 1970లలో భూసంస్కరణలను అమలు చేసి, భూమిపై పని చేసే వారికి భూమిపై శాశ్వత హక్కులు కల్పించి, నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడానికి 'లక్ష్యం వీడు' పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం, నేడు మనం సాధించిన గర్వించదగ్గ స్థితికి పునాది రాయి వేసిందన్నారు. ఇటువంటి అనేక చర్యల ద్వారానే ఒకప్పుడు కులాల పిచ్చి, పేదరికం, కరువు విపరీతంగా ఉన్న కేరళను భారత దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా మార్చగలిగామని ఆయన గర్వంగా ప్రకటించారు. వాటి ఫలితం ఏమిటంటే అన్ని మానవ వనరుల సూచికలలో మనం నిరంతరం మొదటి స్థానాన్ని నిలబెట్టుకోగలిగాము. ఆహార లోటు రాష్ట్రంగా ఉన్నప్పటికీ , సమర్థవంతమైన ప్రజాపంపిణీ వ్యవస్థ, మార్కెట్ జోక్యం ద్వారా ధరల పెరుగుదలను ఆపగలిగాము. ఆహార భద్రతను నిర్ధారించగలిగాము. 2021లో నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం కేరళ రాష్ట్రంలో తీవ్ర పేదరిక సూచిక 0.7 శాతం మాత్రమే, ఇది దేశంలోనే అత్యల్పంగా ఉంది. గత నాలుగున్నర సంవత్సరాల కృషి ద్వారా కేరళలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం తీవ్ర పేదరికాన్ని నిర్మూలించడం ద్వారా మార్గదర్శకంగా ఉందని బినోయ్ విశ్వం తెలిపారు.

## నిధులు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినెలా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు విడుదల చేస్తున్నట్టు ఆర్థిక శాఖ అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇందులో భాగంగా అక్టోబర్ మాసానికి సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ 712 కోట్లను అలాగే 10 లక్షల లోపు పెండింగ్‌లో ఉన్న బిల్లులను కూడా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖకు చెందిన 46,956 బిల్లుల తాలూకు రూ 320 కోట్లను విడుదల చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. రోడ్లు,భవనాల శాఖకు చెందిన రూ.10 లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95 కోట్లను కూడా ఆర్థిక శాఖ విడుదల చేసింది. అలాగే పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ 225 కోట్ల రూపాయలను కూడా విడుదల చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.

## సాయం చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పనిచేయాలి' అని ఎపెక్ ప్రారంభ సమావేశంలో జి జిన్ పింగ్ అన్నారు. 'ప్రపంచం వేగవంతమైన మార్పుల కాలంలోకి వెళుతోంది, అంతర్జాతీయ పరిస్థితి మరింత సంక్లిష్టంగా, అస్థిరంగా మారుతోంది. చైనా నుండి సరఫరా గొలుసులను విడదీయడానికి అమెరికా చేసిన ప్రయత్నాలకు ప్రతీకారంగా, సరఫరా గొలుసు స్థిరత్వాన్ని కొనసాగించాలని' ఆయన పిలుపునిచ్చారు. హరిత పరిశ్రమలు, క్లీన్ ఎనర్జీలో సహకారాన్ని విస్తరించడానికి ఇతర దేశాలతో కలిసి పనిచేసేందుకు ఆశాభావం వ్యక్తం చేశారు.

పదకొండు సంవత్సరాలలో జిన్‌పింగ్ మొదటి సారి దక్షిణ కొరియాలో పర్యటించారు. శిఖరాగ్ర సమావేశంలో భాగంగా శుక్రవారం జపాన్ ప్రధాన మంత్రి సనే తకైచి, కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీ, థాయ్ ప్రధానమంత్రి అనుతిన్ చార్విరాకుల్‌లతో జిన్ పింగ్ ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఉత్తర కొరియా అణు కార్యక్రమం గురించి చర్చించే సమావేశం కోసం జిన్‌పింగ్ శనివారం దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యుంగ్‌తో సమావేశం కానున్నారు.

ట్రంప్ తరపున శిఖరాగ్ర సమావేశానికి హాజరైన అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ మాట్లాడుతూ, తన వాణిజ్య సంబంధాలను తిరిగి సమతుల్యం చేసుకునేందుకు అమెరికా తీసుకున్న చర్య 'ప్రతి దేశం న్యాయమైన, పరస్పర నిబంధనలపై పనిచేస్తుందని' నిర్ధారిస్తుందని అన్నారు. అమెరికా 'బలహీన రంగాలపై ఆధారపడటాన్ని తగ్గించే ప్రస్తుతం ఉన్న ఉత్పత్తి నెట్‌వర్క్‌లను నిర్మించడానికి తన వాణిజ్య భాగస్వాములతో పెట్టుబడి పెడుతోంది' అని ఆయన అన్నారు.

**సవాళ్ళు ఎదుర్కొంటున్న ఎపెక్**

1989లో పెరిగిన ప్రపంచీకరణ కాలంలో స్థాపించబడిన ఎపెక్, ప్రాంతీయ ఆర్థిక ఏకీకరణను వేగవంతం చేయడానికి స్వేచ్ఛా, బహిరంగ వాణిజ్యం, పెట్టుబడిని సమర్థిస్తుంది. కానీ, ఎపెక్ ప్రాంతం ప్రస్తుతం అమెరికా, చైనా మధ్య వ్యూహాత్మక పోటీలు, సరఫరా గొలుసు బలహీనతలు, వృద్ధాప్య జనాభా, ఉద్యోగాలపై ఎఐ ప్రభావం వంటి సవాళ్లను ఎదుర్కొంటోంది. ఆసియా–పసిఫిక్ రిమ్ దేశాలలోని 21 దేశాల ఆర్థిక వ్యవస్థల నాయకులు, ఇతర ప్రతినిధులు ఎపెక్ సమావేశంలో పాల్గొంటూ ఆర్థిక సహకారాన్ని ఎలా ప్రోత్సహించాలో, ఉమ్మడి సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో అనే అంశాలపై చర్చించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## తుపాను బాధిత కుటుంబాలను ఆదుకోండి

### కార్పొరేట్ సంస్థలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మొంథా తుపానుతో పాటు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా నష్టపోయిన ప్రజలను ఆదుకునేందుకు ఆపన్న హస్తం అందించాల్సిందిగా పారిశ్రామిక, వాణిజ్య సంస్థలకు ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ముఖ్యంగా భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాల్లోని పౌరులు, రైతుల కోసం సహాయ, పునరావాస శిబిరాలు నిర్వహించాలని పలు సంస్థలకు లేఖలు రాసారు. సామాజిక బాధ్యతగా నిత్యావసర వస్తువులు, ఔషధాలు, వైద్య సహాయం అందించాని శ్రీధర్ బాబు కోరారు. ఆపత్కాలంలో వారికి అండగా నిలిచి చితికిన కుటుంబాలను తిరిగి నిలబెట్టాలని ఆయన పేర్కొన్నారు. పొలాల్లోని పంటలు వరదలకు దెబ్బతిన్నాయని, మార్కెట్లకు తరలించిన ధాన్యం, మక్కలు వాన నీటిలో తడిసాయని ఆయన వెల్లడించారు.



## బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో అన్ని రంగాలలో విధ్వంసం సృష్టించింది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ తమ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని భవిష్యత్తులో కోలుకోలేనివిధంగా అన్ని రంగాలలో కూడా ఊహకు అందని రీతిలో విధ్వంసం సృష్టించిందని రాష్ట్ర రెవెన్యూ , గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. అయినప్పటికీ ప్రజలపై భారం మోపకుండా రాష్ట్ర ఆర్థిక స్థితిగతులను మెరుగుపరుచుకుంటూ, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో రెహమత్ నగర్ డివిజన్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులతో మంత్రి పొంగులేటి శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ ఎన్నికల్లో తాము ఇచ్చిన హామీలను తూ.చ. తప్పకుండా అమలు చేస్తున్నామని, గడచిన 22 నెలల్లో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే జుబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తాయన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని ఆరోపించారు. ఈ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ ప్రభుత్వం 14వేల కొత్త రేషన్ కార్డులు ఇచ్చిందని, 8వేల మంది పేర్లను రేషన్ కార్డులలో జతచేశామని వివరించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎలు వేముల వీరేశం, బీర్ల ఐలయ్య, ఎంఎల్‌సి శంకర్ నాయిక్, రోడ్ సేఫ్టీ అథారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంఎల్ఎ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను సాధనకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు బడి ఉన్నదని మంత్రి వాటికి శ్రీహరి తెలిపారు. రిజర్వేషన్ల సాధనకు అవసరమైతే ప్రజలతో కలిసి ఉద్యమానిన చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు 'ఒయుబిసి జెఎసి' ఆధ్వర్యంలో 'చట్టసభలలో బిసిల రిజర్వేషన్ల సాధన''కు హైదరాబాద్‌లోని ఒయులో శుక్రవారం ధర్మ దీక్షను నిర్వహించారు. ఈ దీక్షకు నిజ్జన రమేష్ ముదిరాజ్, దేశగాని సాంబశివ గౌడ్ అధ్యక్షత వహించారు. జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య దీక్ష శిబిరంలో ఉన్న వారికి పూల మాల వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లను సాధించే వరకు ఉద్యమం ఆగదన్నారు. విద్యార్థులతో కలిసి పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తామన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని శాసనసభ ఏక గ్రీవంగా బిల్లులను ఆమోదించినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ఆరోపించారు. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు చేసే పోరాటంలో న్యాయం ఉందన్నారు. టిజెఎస్ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల కోసం అందరూ కలిసి కట్టుగా పోరాటం చేయాలన్నారు. మాజీ ఎంపి వి.హనుమంతరావు మాట్లాడుతూ రిజర్వేషన్ల అమలు కోసం త్వరలోనే ఢిల్లీ ఉద్యమించాలని , అందరూ కలిసి ఢిల్లీకి వెళ్దామన్నారు. బిసి జాతీయ సంక్షేమ సంఘం అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసిల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రేమ ఉంటే వెంటనే రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని తాను మొదటి నుంచి కూడా చెబుతున్నానని గుర్తు చేశారు. ఈ దీక్షకు ప్రొఫెసర్ రామయ్య శాపర్డ్ మద్దతునివ్వగా, విద్యార్థి సంఘం నాయకులు వట్టి కూటి రామారావు గౌడ్, అల్లుడు జగన్ ముదిరాజ్, మాలిగ లింగ స్వామి,శివరాత్రి ప్రశాంత్,రెడ్డి శ్రీనివాస్ బొల్లెపల్లి స్వామి గౌడ్, మాసంపల్లి అరుణ్ కుమార్, నక్క శ్రీశైలం యాదవ్, బైరు నాగరాజు గౌడ్, అవార్‌వేణు, బొమ్మహన్మంత్‌రావు పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

### ఇంటర్మీడియట్ బోర్డ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఇంటర్ పరీక్షలను నిర్వహించనున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డ్ ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డ్ కార్యదర్శి ఎస్.కృష్ణ ఆదత్య శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమై, 21వ తేదీ నాటికి పూర్తవుతాయి. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డ్ తెలిపింది. ఇప్పటివరకు కేవలం సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు జరుగగా, ఈసారి ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు కూడా ల్యాబ్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. దీంతో జనవరి 21వ తేదీన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, జనవరి 23వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జనవరి 24వ తేదీన ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలను ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు నిర్వహించనున్నారు.

**ఇంటర్ మొదటి సంవత్సరం షెడ్యూల్..**

| తేదీ... | పరీక్ష |
|---|---|
| 25.02.2026 | సెకండ్ లాంగ్వేజ్. |
| 27.02.2026 | ఇంగ్లీష్ పేపర్ 1. |
| 02.03.2026 | మ్యాథ్స్ పేపర్ 1ఎ (బోటని పేపర్1, పొలిటికల్ సైన్స్ పేపర్ 1) |
| 05.03.2025 | మ్యాథ్స్ పేపర్ 1బి, (జువాలజీ పేపర్ 1,హిస్టరీ పేపర్1) |
| 09.03.2025 | ఫిజిక్స్ పేపర్1, ఎకనామిక్స్ పేపర్ 1 |
| 12.03.2025 | కెమెస్ట్రీ పేపర్1, కామర్స్ పేపర్1 |
| 14.03.2025 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్1,బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్ పేపర్1 |
| 17.03.2025 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్1, జియోగ్రఫి పేపర్ 1 |

**ఇంటర్ ద్వితీయ సంవత్సరం షెడ్యూల్..**

| తేదీ... | పరీక్ష |
|---|---|
| 26.02.2026 | సెకండ్ లాంగ్వేజ్ పేపర్ 2. |
| 28.02.2026 | ఇంగ్లీష్ పేపర్ 2. |
| 03.03.2026 | మ్యాథ్స్ పేపర్ 2ఎ(బోటని పేపర్2, పొలిటికల్ సైన్స్ పేపర్ 2) |
| 06.03.2025 | మ్యాథ్స్ పేపర్ 2బి, (జువాలజీ పేపర్ 2, హిస్టరీ పేపర్2) |
| 10.03.2025 | ఫిజిక్స్ పేపర్2, ఎకనామిక్స్ పేపర్ 2 |
| 13.03.2025 | కెమెస్ట్రీ పేపర్2, కామర్స్ పేపర్2 |
| 16.03.2025 | పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్2, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్స్ పేపర్2 |
| 18.03.2025 | మాడ్రన్ లాంగ్వేజ్ పేపర్2, జియోగ్రఫి పేపర్ 2 |

# మొంథా తుఫాన్‌కి నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

### తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ





**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** మొంథా తుఫాన్‌కి నష్టపోయిన రైతాంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో హుజూర్‌నగర్ పట్టణంలో తుఫాన్‌కి నేలకు పడ్డ వరి పంటను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నష్టపోయిన రైతాంగానికి మన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఎకరాకు రూ.10వేలు ఇస్తామని చెప్పడం మంచిదే కానీ, పెట్టుబడులు ఎక్కువ కావడంతో అవి సరిపోవన్నారు.
రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు. స్థానిక వ్యవసాయ అధికారులు ఈ ప్రాంతంలో కేవలం 2 శాతం మాత్రమే నష్టం జరిగిందని తెలుపుతున్నారని ఇది సరికాదన్నారు. ఇలా ప్రకటిస్తే నష్టపరిహారం రాదని రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. పంట పొలాలను పరిశీలించిన అనంతరం స్థానిక ఆర్‌డిఓకు వివిధ డిమాండ్లతో కూడిన మెమోరాండాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కంబాల శ్రీనివాస్, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, రైతు సంఘం పట్టణ అధ్యక్షులు జక్కుల రమేష్, మండల అధ్యక్షులు పొనుగుబాటి వాసుదేవరావు, సోమగాని కృష్ణ, చన్నగాని సైదులు, దేవరం శ్రీనివాస్‌రెడ్డి, గోసుల శ్రీనివాస్, కటారి వెంకన్న, కాకి అమృతారెడ్డి, లింగరాజు, జంగాల సైదులు, బొంబో సైదులు, తెల్లబోయిన సింహాద్రి, తెల్లబోయిన వెంకన్న, మైకు శ్రీను పాల్గొన్నారు.

**అంచనాలు కాదు పరిహారమివ్వండి : రైతు సంఘం సమావేశంలో బాగం**

**ఖమ్మం :** రైతాంగం దెబ్బతిన్న ప్రతిసారి పంటల నష్టపరిహారం అంచనా వేయడం వరకే పరిమితమవుతున్నారని పరిహారం పరిహాసంగా మారుతుందని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు ఆరోపించారు. ప్రకృతి విపత్తు ఏర్పడిన ప్రతిసారి పాలకులు పంటల అంచనాలంటూ ప్రకటనలకే పరిమితమవుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం ఖమ్మంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్ అధ్యక్షత వహించగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ ఈ ఏడాది అతివృష్టి రైతులను తీవ్రంగా నష్టపరిచిందన్నారు.
మొన్నటి వరకు అతివృష్టి కారణంగా మెట్ట పంటలైన పత్తి, అపరాలు, ఉద్యానవన పంటలు దెబ్బతినగా మొంథా తుఫాన్ కారణంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ఎకరాకు రూ. 30వేల పైబడి పెట్టుబడులు పెట్టారని తీరా కోతకు వచ్చే సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి పూర్తిగా నేలవాలిందన్నారు. భారీ వర్షాల కారణంగా నదులు, వాగుల పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు. పెట్టుబడులు పెరిగి దిగుబడులు తరిగి రైతులు నష్టపోతున్నారని ప్రకృతి సైతం రైతులపై పగబట్టినట్లుగా ఉందని హేమంతరావు తెలిపారు. ప్రకృతి విపత్తులు సంభవించగానే నష్టం అంచనాలను వేస్తున్నామంటూ పాలకులు ప్రకటనలను జారీ చేస్తున్నారని కాని పరిహారం మాత్రం అందించడం లేదన్నారు. గడిచిన రెండేళ్లలో పలుమార్లు ప్రకృతి విపత్తులు సంభవించాయని ఆయన తెలిపారు.
ఈ ఏడాది పత్తి రైతులను ఆదుకోవాలనే డిమాండ్ డిమాండ్‌గానే మిగిలిందని ఇప్పుడు వరి రైతులకు ఆ పరిస్థితి తీసుకు రాకుండా వెంటనే పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు జాగర్లమూడి రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎఐబిఇఎ, ఐప్సో నేత**

# రామరాజు ఆకస్మిక మృతి

### సిపిఐ నేతల తీవ్ర దిగ్భ్రాంతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఎఐబిఇఎ), అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఐప్సో) నేత ఎఆర్.రామరాజు (69) ఆకస్మికంగా మరణించారు. హైదరాబాద్ అశోక్‌నగర్‌లోని తన నివాసంలో గురువారం రాత్రి 9 గంటలకు ఆయనకు ఒక్కసారిగా గుండెపోటు రావడంతో, వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను హైదర్‌గూడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. రామరాజు రంగారెడ్డి జిల్లా సిపిఐ ఉద్యమ నిర్మాత ఎ.ఆర్.దేవరాజు ప్రథమ కుమారుడు. రామరాజుకు భార్య రాధ, కుమారులు ఉత్తమ్, ఉదయ్ ఉన్నారు. విద్యార్థి దశలోనే ఎఐఎస్‌ఎఫ్‌లో చేరిన రామరాజు ఆ తర్వాత బ్యాంకు ఉద్యోగంలో చేరి ఎఐబిఈఎ నాయకులుగా, ఐప్సో నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. రామరాజు తుది శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యులుగా కొనసాగారు. గురువారం సాయంత్రం 5 గంటలకు దోమలగూడలోని శ్మశాన వాటికలో రామరాజు భౌతికాకయానికి ఆయన పెద్ద కుమారుడు ఉత్తమ్ అంత్యక్రియలను నిర్వహించారు.

**నేతల ఘన నివాళి :** రామరాజు మరణం పట్ల పలువురు సిపిఐ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి, సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, ఆంధ్రాబ్యాంక్ అవార్డు ఎంప్లాయిస్ యూనియన్ మాజీ నేత, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డిలు రామరాజు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు .అంతకు ముందు రామరాజు భౌతికకాయంపై సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టినరసింహ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, కార్యవర్గ సభ్యులు, ఎస్.ఛాయాదేవి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ పార్టీ పతాకాన్ని కప్పి నివాళి అర్పించారు. రామరాజుకు ఐప్సో నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. రామరాజు భౌతికకాయంపై ఐప్సో రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్, సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వర రావు ఐప్సో పతాకాన్ని కప్పి నివాళులు అర్పించారు. ఐప్సో అధ్యక్షవర్గ సభ్యులు తిప్పర్తి యాదయ్య, ప్రధాన కార్యదర్శి కాచం సత్య నారాయణ, రాష్ట్ర కార్యదర్శి అనూష, హైదరాబాద్ జిల్లా కమిటీ అధ్యక్షుడు గురుబచ్చన్ సింగ్, ఉపాధ్యక్షులు బొమ్మగాని నాగభూషణం, కార్యదర్శులు సుధావన్ నివాళులు అర్పించారు. ఎఐబిఇఎ జాతీయ కార్యదర్శి బి.ఎస్.రాంబాబు, ఎఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు ఎన్.శ్రీకాంత్ నివాళి అర్పించారు.

**రామరాజు అకాల మరణం తీవ్ర విషాదం: కూనంనేని సాంబశివరావు**

ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎఆర్.రామరాజు ఆకస్మిక మరణం పట్ల సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. రామరాజు అకాల మరణం తీవ్ర విషాదాన్ని కలిగించిందని ఒక ప్రకటనలో తెలిపారు. రామరాజు మృతి పట్ల సంతాపాన్ని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. రామరాజు మరణం పట్ల అమెరికాలో ఉన్న సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, ఎఐటియుసి జాతీయ మాజీ నాయకురాలు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి సంతాపాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా సంతాపం**

ఎఐబిఇఎ నాయకులు ఎ.ఆర్.రామరాజు అకాల మరణం పట్ల సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. రామరాజుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు చిన్నతనం నుండి పార్టీ పట్ల నిబద్ధతతో, అంకితభావంతో పనిచేశారని సంతాప సందేశంలో ఆయన పేర్కొన్నారు.

# కార్మిక నాలుగు కోడ్‌లను వెంటనే రద్దు చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర 106వ ఆవిర్భావ దినోత్సవంలో అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలో బిజెపినేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంపెట్టుబడి వర్గాలకు ఊడిగం చేస్తూ కార్మికులకు తీవ్ర అన్యాయం చేస్తోందని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి.యూసుఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎఐటియూసి 106వ ఆవిర్భావదినోత్సవ సందర్భంగా జీడిమెట్ల లో ఎఐటియుసి పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూసుఫ్ మాట్లాడుతూ ఎఐటియూసి 1920వ సంవత్సరంలో ఆవిర్భావించిన తర్వాతనే కార్మిక చట్టాలు వచ్చాయన్నారు. 1921లో ఫ్యాక్టరీస్ యాక్ట్‌కు సవరణలు, 1923లో కార్మిక నష్టపరిహార చట్టం, 1926లో ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్, 1936లో వేతనాలచెల్లింపు చట్టం, 1946 ఇండస్ట్రియల్ ఎంప్లాయిమెంట్ యాక్ట్(స్టాండింగ్ ఆర్డర్స్) చట్టం, 1947లో పారిశ్రామిక వివాదాల చట్టాలను బ్రిటిష్ హయాంలోనే అనేక పోరాటాల ద్వారా ఎఐటియుసి ద్వారా సాధించుకున్నామని తెలిపారు. ఈ కార్మిక వ్యతిరేక కోడ్లను రద్దు చేసి, 44 కార్మిక చట్టాలను పునరుద్దరిచాలని ఆయన డిమాండ్ చేశారు. ఆర్‌టిసి డిపో వద్ద జిల్లా అధ్యక్షులు కె. స్వామి, గుట్ట యార్డ్ ఐడిపిఎల్ ఆటో అడ్డా వద్ద జిల్లా ఉపాధ్యక్షులుఇ. ఉమా మహేష్, జగద్ గిరి గుట్టలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఏసు రత్నం, రంగారెడ్డి నగర్ భవన నిర్మాణ అడ్డా మరియు గాంధీ నగర్ ఎఐటియూసి కార్యాలయం వద్ద జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, శ్రీనివాస్ నగర్, హమాలీ అడ్డా 3, మున్సిపల్ కార్యాలయం వద్ద నియోజకవర్గం అధ్యక్షులు వి. హరినాధ రావు, ప్రీమియర్ అలయిస్ కంపెనీ వద్ద దేవేందర్ ప్రసాద్, జి.ఆర్. పవర్ స్విచ్ గేర్ కంపెనీ వద్ద రమేష్ రెడ్డిలు పతాకవిష్కరణ చేసారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఎమ్. నర్సింహా రెడ్డి, హమాలీ యూనియన్ నాయకులు సుంకి రెడ్డి, సీ. నర్సింలు, కె. మహేష్, బి నాగయ్య, బి. కనకయ్య, భవన నిర్మాణ సంఘం నాయకులు సామ్యూయెల్, మున్సిపల్ యూనియన్ నాయకురాలు టీ. కమల పాల్గొన్నారు.

### కీలక పారిశ్రామిక కారిడార్‌గా

# ఒఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం

### మంత్రి శ్రీధర్ బాబు పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో కీలక పారిశ్రామిక కారిడార్‌గా ఒఆర్ఆర్ఆర్ఆర్ మధ్య ప్రాంతం మారబోతుందని.. కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టిలో 'జిడిపి' అంటే కేవలం 'గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్' కాదని, గ్రాస్ ఎంపవర్మెంట్ ఆఫ్ పీపుల్(జిఇపి) అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భారత్ '15' ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే ప్రయాణంలో 'తెలంగాణ'ను కీలక భాగస్వామిగా మార్చుతామన్నారు. బేగంపేట్‌లోని ఐటిసి శుక్రవారం నిర్వహించిన కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సదరన్ రీజినల్ కౌన్సిల్ సమావేశంలో 'డ్రైవింగ్ ఇండస్ట్రియల్ గ్రోత్ అండ ఇన్నోవేషన్, తెలంగాణ రోడ్ మ్యాప్ టూ త్రీ ట్రిలియన్ డాలర్స్ ఎకానమీ' అనే అంశంపై ఆయన కీలక ఉపన్యాసం చేశారు. 'అర్బన్ ఇంజిన్', 'ఇండస్ట్రియల్ హార్ట్ ల్యాండ', 'రూరల్ ట్రాన్స్ఫర్మేషన్ జోన్' అనే మూడు మూల స్థంభాలుగా తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ఆయన వివరించారు. కార్యక్రమంలో సిఐఐ సదరన్ రీజియన్ ఛైర్మన్ థామస్ జాన్ ముత్తూట్, డిప్యూటీ ఛైర్మన్ రవి చంద్రన్, సిఐఐ తెలంగాణ కౌన్సిల్ ఛైర్మన్ శివ ప్రసాద్ రెడ్డి, వైస్ ఛైర్మన్ గౌతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్** GHMC

NIT No. 33/EE/Circle-12/KZ/GHMC/2025-26 తేది: 30.10.2025

**పని పేరు:** బిటి రోడ్-2, జెన్ ఇంప్రూవ్‌మెంట్-1. **అంచనా విలువ / ఇసివి:** రూ.94.00లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** ప్రారంభ తేది: 31.10.2025న మ.3.30గం.ల నుండి, ఆఖరి తేది: 03.11.2025న మ.3.30గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-12, కెజెడ్, జిహెచ్ఎంసి, ఖైరతాబాద్. ఫోన్: 9492067578. కమిషనర్, జిహెచ్ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-12, (కెజెడ్), జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 9988-PP/CL/ADVT/1/2025-26, Date: 31-10-2025

**కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం**

ఇ-మెయిల్: knrcmnr@rediffmail.com

'ఇ'- ప్రొక్యూర్‌మెంట్ రీకాల్ టెండర్ నోటీసు

నెం. E1/DB/MCK/8201/234/MCK/2025-26, తేది: .10.2025

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కార్యాలయ భవనానికి చిన్న పనులు మరియు ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి ఎంజిఎఫ్ క్రింద **అంచనా వ్యయం:** రూ.49.96 లక్షలు. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది:** 31.10.2025న సా.04.00గం.ల నుండి, **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ఆఖరి తేది:** 11.11.2025న సా.04.00గం.ల వరకు. మరిన్ని వివరాలకు www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్, కరీంనగర్.

DIPR R.O. No. : 10001-PP/CL/ADVT/1/2025-26, Date: 31-10-2025

తెలంగాణ ప్రభుత్వం

**జిల్లా షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ - మంచిర్యాల జిల్లా**

ఫైల్ ఆర్.సి. సంఖ్య B3/122/2022-23 పత్రిక ప్రకటన (టెండర్లకు ఆహ్వానం) తేది: 31.10.2025

మంచిర్యాల జిల్లాలోని షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ (SCDD) ద్వారా నిర్వహించబడుతున్న (17) ప్రభుత్వ యస్.సి. ప్రీమెట్రిక్ మరియు (08) పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలకు 2025-26 ఆర్థిక సంవత్సరమునకు గాను క్రింద తెలుపబడిన సామాగ్రి సరఫరా చేయుట కొరకు గుర్తింపు పొందిన సంస్థల నుండి నాణ్యత గల సామాగ్రి సరఫరా చేయుటకు గాను జిల్లా షెడ్యూల్డు కులముల అభివృద్ధి అధికారి, మంచిర్యాల జిల్లా గారి ద్వారా టెండరుకై దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు మరియు సామాగ్రి యొక్క నమూనా (Samples) కచ్చితంగా తీసుకురాగలరు.

| వ. నం. | పంపిణీ చేయవలసిన సామాగ్రి | EMD మొత్తము | టెండర్ షెడ్యూల్ ఫామ్ యొక్క ధర |
|---|---|---|---|
| 1 | All in one Books | రూ. 1,00,000/- | రూ. 3,000/- |
| 2 | 10th Class Model Papers | | |
| 3 | Stationery Items: (SSC Boarders) Geometry Boxes, Exam Writing Pads, Ball Point Pens (Blue, Black & Red), Pencils, Sharpeners, Long Scales, Erasers & Water Bottles | | |
| 4 | Sweaters with Monkey Caps | | |
| 5 | Woolen Blankets | | |
| 6 | Slippers | | |
| 7 | Sports Shoes | | |
| 8 | Leather Shoes | | |
| 9 | 3 pairs shocks | | |
| 10 | College & School Bags | | |

| | |
|---|---|
| టెండర్ షెడ్యూలు అమ్మడానికి మరియు స్వీకరించే తేదీలు మరియు స్థలము | 01-11-2025 నుండి 06-11-2025 సాయంత్రం 5-00 గంటల వరకు (SC Development Department, IDOC., Room No. F-3, 1st Floor, Naspur, Mancherial మంచిర్యాల కార్యాలయము సమయంలో) |
| టెండర్ షెడ్యూలు తెరుచు తేది మరియు సమయము | 07-11-2025 రోజున సాయంత్రం 3-00 గంటలకు (జిల్లా అదనపు పాలనధికారి, మంచిర్యాల గారి చాంబరు నందు) |
| EMD, DD జారీ చేయవలసిన వివరాలు | Deputy Director, SC Development Department, Mancherial గారి పేరిట (SBI Branch Mancherial గారి బ్రాంచ్ చెల్లుబాటు అవునట్లు (DD రూపములో ) |

సం/- జిల్లా అదనపు పాలనధికారి / చైర్మన్ District Purchase Committee మంచిర్యాల

DIPR R.O. No. : 10031-PP/CL/ADVT/1/2025-26, Date: 31-10-2025

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సూర్యాపేట మున్సిపల్ కమీషనర్ హన్మంతరెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 25వ వార్డులో పర్యావరణ పరిశుభ్రత అందరి బాధ్యత అనే నినాదంతో శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ స్వయంగా పాల్గొని వీధి పక్కన పెరిగిన కలుపు మొక్కలను తొలగించారు. ప్రజల్లో పరిశుభ్రత పట్ల చైతన్యం కల్పించేందుకు అధికారులందరిని ప్రజలతో కలిసి పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ప్లానింగ్ అధికారి వి సోమయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ శివప్రసాద్ పాల్గొన్నారు.

## శత వసంతాల ముగింపు సభను జయప్రదం చేయాలి : బెజవాడ పిలుపు



ప్రజాపక్షం/చింతలపాలెం (మేళ్ళచెర్వు) : ఖమ్మంలో డిసెంబర్ 26న నిర్వహించే సిపిఐ శత వసంతాల ముగింపు సభకు పార్టీశ్రేణులు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో బహిరంగ సభ కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26న సిపిఐ భారత గడ్డపై పుట్టి వందేండ్లు అవుతుందన్నారు. ఈ ముగింపు మహాసభకు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలు, 40 దేశాల నుండి కమ్యూనిస్టు ప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉస్తెల నారాయణ రెడ్డి, మండల కార్యదర్శి గొంగరెడ్డి భద్రారెడ్డి, యలమందయ్య పాల్గొన్నారు.

## ఎస్ఐ వేధింపులు తాళలేక మహిళ ఆత్మహత్య



ప్రజాపక్షం/తుంగతుర్తి : తుంగతుర్తి ఎస్ఐ క్రాంతికుమార్ వేధింపులు తాళలేక ఓ మహిళ మృతి చెందిన సంఘటన సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం వెంపటి గ్రామంలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. మృతురాలి కుమార్తెలు సరిత, అనిత, కుమారుడు మహేష్‌లు తెలిపిన వివరాల ప్రకారం గత 15 రోజుల క్రితం తుంగతుర్తి మండలం వెంపటి గ్రామానికి చెందిన సోమనర్సమ్మ (50) బావ మల్లయ్య ఇంట్లో బంగారం పోయిందనే నెపంతో సోమ నర్సమ్మపై తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వెంపటి గ్రామానికి చెందిన కొంతమంది పెద్దమనుషులు, మల్లయ్య కలిసి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి పలుమార్లు ఫిర్యాదు చేయగా, గురువారం రాత్రి 8 గంటల వరకు తుంగతుర్తి పోలీస్ స్టేషన్‌లో సోమనర్సమ్మను ఉంచారు. తుంగతుర్తి ఎస్ఐ క్రాంతి కుమార్ కనీసం మహిళ అని కూడా చూడకుండా, వేధింపులకు గురిచేసి, నిన్ను జైలుకు పంపుతాం, నీవే దొంగతనం చేసినట్లు ఒప్పుకోవాలని నీ ఫింగర్ ప్రింట్స్ ఉన్నాయని కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురిచేశారన్నారు. దీంతో ఆవేదనకు గురైన సోమనర్సమ్మ రాత్రికి రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. జరిగిన సంఘటనపై ఎస్ఐని వివరణ అడగగా సమాధానం చెప్పకుండా దాటవేశారు. సోమనర్సమ్మ మృతిపై పూర్తిస్థాయి నిర్లక్ష్యం వహించిన ఎస్ఐ క్రాంతి కుమార్‌పై పోలీస్ ఉన్నత అధికారులు, జిల్లా పోలీస్ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## 17శాతం తేమ రాగానే కాంటాలు

### జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/చివ్వెంల : కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు వెంటనే తరలించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆయా ధాన్యపు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఐలాపురం, సూర్య తండలలో ఏర్పాటు చేసిన ఐకెపి కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా తడిచిన ధాన్యాన్ని రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రస్తుతం వర్షాలు ఆగినందున దానిని ఆరబెట్టుకొని అమ్మకానికి తేవాలన్నారు. 17 తేమ శాతం రాగానే నిర్వాహకులు కాంటాలు వేయాలని సూచించారు. ధాన్యం తడవకుండా టార్పాలు కప్పాలని చెప్పారు. సూర్య తండలోని ఐకెపి కేంద్రంలో ధాన్యం కొనుగోలు రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ సంతోష్‌కుమార్, ఎంపిఓ వెంకయ్య, మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## మద్యంపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదు



ప్రజాపక్షం/చింతపల్లి: పెండింగ్‌లో ఉన్న ఫీజ్ రియబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించకుండా మద్యంపై అమితాసక్తిని చూపడం సిగ్గుచేటని అఖిలభారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నల్లగొండ జిల్లా అధ్యక్షుడు వల్లమల్ల ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 22నెలల కాంగ్రెస్ పాలనలో విద్యా శాఖకు మంత్రిని కేటాయించకుండా, ప్రజల ఆరోగ్యానికి హానికరమైన మద్యానికి మంత్రిని కేటాయించడం సిగ్గుచేటని ఎద్దేవ చేశారు. విద్యారంగానికి మంత్రి లేకపోవడం వల్ల విద్యావ్యవస్థ సమస్యలకు నిలయంగా మారి విద్యార్థులకు శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజులను నియంత్రించకుండా విద్యాహక్కు చట్టం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తుందని విమర్శించారు. ఫీజ్ రియబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోతే ఉధృతంగా విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శంశొద్దీన్, మండల అధ్యక్షులు వలవోజు శివకుమార్, మహ్మద్ అర్షద్, అరవింద్, మనోజ్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళ మృతి

## డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని సిపిఐ ధర్నా

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో శుక్రవారం ఉదయం మహిళ మృతిచెందింది. చికిత్స కోసం మహిళ రావడంతో డ్యూటీలో ఉన్న ఉన్న డాక్టర్ పట్టించుకోకపోవడంతో మహిళ మృతిచెందిందని సీపీఐ నాయకులు ఆరోపిస్తూ ఏరియా ఆసుపత్రి ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మిర్యాలగూడ మండలం ములకలకాల్వకు చెందిన నాగిళ్లి ఎంకమ్మ దగ్గు, జ్వరం, ఆయాసంతో శుక్రవారం 8గంటల సమయంలో ఆమెను కొడుకు ప్రదీప్ ఏరియా ఆసుపత్రికి తీసుకురాగా ఆ సమయంలో డ్యూటీలోఉన్న డాక్టర్ డ్యూటీ నుంచి దిగిపోయేంతవరకు ఆ ఎంకమ్మకు ట్రీట్మెంట్ ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం వల్ల ఆమెకు ఆయాసం ఎక్కువై ఊపిరాడని సమయంలో ఎంకమ్మ 9.30గంటలకు డాక్టర్ ఫాతిమా వద్దకు నడుచుకుంటూ వెళ్లిందని ఆమెను చూసి వెంటనే ఆక్సిజన్ పెట్టాలని డాక్టర్ సిబ్బందికి చెప్పినా ఎవరూ ఆక్సిజన్ పెట్టకపోవడంతో సీరియస్ కావడంతో డాక్టర్ ఫాతిమా దగ్గరకు వెళ్లి చెప్పగా ఆమె దగ్గరుండి ఆక్సిజన్ పెట్టించింది. కాగా ఆక్సిజన్ పెట్టిన 15 నిమిషాల్లోనే ఊపిరాడక చనిపోయింది. ఆమె చనిపోవడానికి ముఖ్య కారణం డాక్టర్ అని డ్యూటీలో ఉండి కూడా ఎంకమ్మను నిర్లక్ష్యం చేయడం వల్ల ఆమె చనిపోయిందన్నారు. ఎంకమ్మ చావుకు కారణమైన డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తల్లిదండ్రులు లేని ప్రదీప్‌ను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, ప్రదీప్ ఉండడానికి ఇల్లు లేనందున ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ చేసి ఆదుకోవాలన్నారు. ధర్నాలో మహిళా సమాఖ్య నియోజకవర్గ అధ్యక్షురాలు దుర్గమ్మ, వెంకన్న, రాము, సోమయ్య, ఎల్లమ్మ, బుజ్జి, కవిత, ఏసు, కొండలు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# తేమశాతం, నాణ్యత తప్పనిసరి

ధాన్యం ఆరబెట్టుకుని సిద్ధంగా ఉంటే కాంటాలు వేసి మిల్లులకు పంపిస్తాం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/హాలియా: వర్షాలు తగ్గినందున కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టుకుని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు .రైతులు వారి ధాన్యాన్ని ఆరబెట్టుకుని సిద్ధంగా ఉన్నట్లయితే కాంటాలు వేసి మిల్లులు పంపిస్తామని చెప్పారు. శుక్రవారం ఆమె మండలంలోని రామడుగు లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం కుప్పలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షం తగ్గినందున ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, 17 తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు, మూడు రోజుల తర్వాత తిరిగి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున త్వరితగతిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించాలని, కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు.జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,డిఆర్‌డిఓ వై శేఖర్ రెడ్డి ఉన్నారు.

**సబ్జెక్టు విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉండాలి : కలెక్టర్**

బాగా చదువుకోవడం ద్వారా సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి విద్యార్థినిలకు సూచించారు. ఇందుకుగాను రెగ్యులర్ గా పాఠశాలకు హాజరు కావాలని అన్నారు.శుక్రవారం ఆమె మండలంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల హాజరు రిజిస్టర్ ను, అదేవిధంగా ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ ను పరిశీలించారు.ఫేస్ రికగ్నిషన్ ఆప్ (ఎఫ్ ఆర్ ఎస్) ద్వారా ఆన్లైన్లో అటెండెన్స్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ రెగ్యులర్‌గా పాఠశాలకు హాజరవుతూ సబ్జెక్టు విషయాల పట్ల ఎప్పటికప్పుడు అప్డేట్‌గా ఉండాలన్నారు. పాఠశాల నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పారిశుద్ధం ,విద్యార్థినిల ఆరోగ్యం, భోజనం, తదితర అంశాల పట్ల ఏలాంటి సమస్యలు రాకుండా చూడాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు . జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ ,జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, కేజీబీవీ ప్రిన్సిపల్ కవిత, తదితరులు ఉన్నారు.

# రైతులకు నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

వరి పంటకు రూ. 30,000, పత్తి పంటకు 50,000 నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ డిమాండ్



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: అక్టోబర్ 28 29 తేదీలలో రాష్ట్ర స్థాయిలో కురిసిన అకాల వర్షాలకు యాదాద్రి భువనగిరి జిల్లాలో పలు మండలాలలో తీవ్రంగా పంట నష్టం జరిగింది క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు రెవెన్యూ అధికారులు నష్టపరిహారాన్ని అంచనా వేసి నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలి, నష్టపోయిన రైతులకు వరి పంటకు ఎకరానికి 30000 పత్తి పంటకు ఎకరానికి 50,000 నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడారు. అట్లాగే ఐకెపి సెంటర్లలో పిఎసిఎస్‌లో మార్కెట్ యార్డుల్లో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. సిసిఐ ద్వారా ఎలాంటి షరతులు లేకుండా పత్తి కొనుగోలు వరి కొనుగోలును వెంటనే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అట్లాగే నష్టపోయిన రైతులు సంబంధిత అధికారులకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండి ఇమ్రాన్ భువనగిరి పట్టణ సిపిఐ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు శోభన్ బాబు, వసంత, ముంతాజ్, బీరకాయల గణేష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

### ప్రభుత్వం రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

ప్రజాపక్షం/డిండి; మొంథా తుఫాను కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు డిండి మండలంలోని పంటలు నష్టపోయిన రైతాంగానికి పంట నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందజేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) జిల్లా కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మైనోద్దీన్, సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారిలు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం వారు మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా మండలంలో పత్తి, వరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని నష్టపరిహారాన్ని అధికారులు అంచనా వేసి, నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోనేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని అధికారులను కోరారు.

## పెండింగ్ కేసుల దర్యాప్తులపై పురోగతి

ప్రజాపక్షం/గరిడేపల్లి : సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్‌పి కె నరసింహ శుక్రవారం సందర్శించారు. ముందుగా పోలీసులు ఇచ్చిన గౌరవ వందనం స్వీకరించిన ఆయన సిబ్బందితో సమావేశమై విధుల నిర్వహణ, పెండింగ్ కేసులు, ధర్యాప్తు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ పరిధిలోని నేర చరిత్ర, తరచుగా జరిగే నేరాల రకాలు, సమస్యలు, పరిష్కారాలపై ఎస్ఐ చలికంటి నరేష్ నుండి సమాచారం సేకరించారు. స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం ఎస్‌పి మాట్లాడుతూ బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించడం ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యత అన్నారు. ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా సిబ్బంది చురుకుగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా రిసెప్షన్, కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిఐ చరమందరాజు, ఎస్ఐ చలికంటి నరేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం





ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో చిల్లాపూర్, జనగాం గ్రామాలలో ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. అనంతరం మండల కేంద్రంలో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ( ఎఐటియుసి) 106 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఎఐటియుసి మండల ప్రధాన కార్యదర్శి చిలువేరు అంజయ్య జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు దుబ్బాక సంజీవ, ఉపాధ్యక్షుడు శంకరయ్య, మంచాల గాలయ్య,ట్రాక్టర్ డ్రైవర్ సంఘం నాయకుడు గిరి, ఆటో యూనియన్ సంఘం నాయకుడు జనగాం అంజయ్య, వీరయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి పల్లె మల్లారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ఆలేరు : శుక్రవారం రోజున సివిల్ సప్లై ఏఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆలేరు లో జెండా ఎగరెడవేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్ మాట్లాడుతూ 1920 లో ఏర్పడిన ఏఐటియుసి కార్మిక సంఘం ఇప్పటికి 106 సంవత్సరాలు పూర్తి అయ్యింది. ఈ కార్యక్రమంలో కొరుటూరు శీను, పల్లె వెంకటయ్య, ఉప్పలయ్య, బీరయ్య, జాంగిర్, చంద్రయ్య, వెంకటేష్, కుమార్, పల్లె వెంకటయ్య, చంద్రయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/చండూరు : అసంఘటిత కార్మికులకు సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి కార్మికులను ఆదుకోవాలని ఏఐటియూసి చండూరు మండల అధ్యక్షుడు దోటి వెంకన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో భూతరాజు శ్రీను, కావలి శ్రీను, కుక్కల నాగార్జున, మోగుదాల శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక హక్కులు కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం



ఎఐటియుసి జెండా ఆవిష్కరణలో వక్తల పిలుపు

ప్రజాపక్షం/యాదగిరిగుట్ట: కార్మికుల హక్కులను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుదాం అని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు అన్నారు.అఖిల భారత ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రోజున యాదగిరిగుట్ట పట్టణంలో ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గోద శ్రీరాములు పాల్గొని ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఉద్యమించి కార్మికులకు అనేక చట్టాలు తీసుకువచ్చి,కార్మికులకు అండగా నిలిచిన జెండా ఏఐటియుసి అని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం సుదీర్ఘ పోరాటాలు చేసి సాధించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్మిక చట్టాలను హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని, ప్రభుత్వ రంగ సమస్యలను నిర్వీర్యం చేసి ప్రైవేట్ పరం చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జై హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అనాధాశ్రమంలో పండ్ల పంపిణీ చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ,పేరబోయిన మహేందర్, సిపిఐ మండల కార్యదర్శి కల్లేపల్లి మహేందర్.మున్సిపల్ శాఖ కార్యదర్శి బబ్బురి శ్రీధర్, మాజీ మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య ఏఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాల సవరణను వెంటనే ఆపి నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద ఏఐటీయూసీ జెండాను కార్మికులతో కలిసి ఎగురవేశారు. అనంతరం రామస్వామి మాట్లాడుతూ 106 సంవత్సరాల సుధీర్ఘ పోరాట చరిత్ర కలిగిన ఏకైక కార్మిక సంఘం ఏఐటీయూసీ అని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకటరాములు, ఏఐటీయూసీ నాయకులు మల్లయ్య, మండల కార్యదర్శి వెంకటయ్య, కల్లు చరణ్‌రెడ్డి, సోమ్లనాయక్, బాలు, లచ్చయ్య పాల్గొన్నారు.



ప్రజాపక్షం/డిండి: ఏఐటీయూసీ 106 ఏళ్ల ఆవిర్భావ వేడుకలు డిండిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏఐటీయూసీ జెండాను జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి, ఏఐటీయూసీ మండల అధ్యక్షులు లింగమయ్య, జవహర్‌లాల్, దేవయ్య, రమేష్, కృష్ణయ్య, ఇద్దమ్మ, కళ్యాణ్, లక్ష్మమ్మ, బాలమ్మ, భాగ్యమ్మ, భారతి, సుజాత, సునిత, లక్ష్మమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.



ప్రజాపక్షం/దేవరకొండ: ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం పల్లా పర్వత్‌రెడ్డి భవన్ దేవరకొండలో ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి మాట్లాడుతూ ప్రతి కార్మికునికి ఈఎస్ఐ, పిఎఫ్ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, జిల్లా కౌన్సిల్ సభ్యులు నీల వెంకటయ్య, మండల కార్యదర్శి మల్లయ్య, బుచ్చయ్య, కృష్ణయ్య, రామేశ్వరయ్య, వెంకటయ్య, అయోధ్య, వెంకటమ్మ, దేవరాజ్, లక్ష్మ , జంగయ్య, అలివేలు తదితరులు పాల్గొన్నారు.






ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : కార్మికులకు అండ ఏఐటియుసి జెండా అని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ ధర్మభిక్షం భవన్ ఎదుట ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధనే లక్ష్యమని ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు దంతాల రాంబాబు, సిపిఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, ఏఐటియుసి ప్రాంతీయ గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్, టైలరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు దీకొండ శ్రీనివాస్, నాయకులు ఎండి పాషా, దేశగాని హేమలత పాల్గొన్నారు.

ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : ఏఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు జడల శ్రీనివాస్ ఏఐటియుసి జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుండు వెంకటేశ్వర్లు, ఏఐటియుసి నాయకులు ఇందిరాల వెంకటేశ్వర్లు, మామిడాల వెంకటయ్య, జట్టి ప్రసాద్, ముడుసు పాపారావు, దగ్గుపాటి సత్యానందం, రాంమ్మూర్తి, గోపి, జక్కుల మల్లయ్య పాల్గొన్నారు.

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కార్పోరేట్ శక్తులకు పాలక ప్రభుత్వాలు దాసోహమై కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్‌లు అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకోని శుక్రవారం సయీద్ జెండాను ఆవిష్కరించగా వారు మాట్లాడుతూ వెట్టిచాకిరి విముక్తి, కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేసిన ఘనత ఏఐటీయూసీదేనన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వల్లంపట్ల వెంకన్న, యూనియన్ నాయకులు ఖయ్యూం, అష్ఫర్‌అలీ, పి.వెంకన్న, రసూల్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.





# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## రాజస్థాన్‌లో ఎంబిబిఎస్ విద్యార్థి ఆత్మహత్య

**జైపూర్:** రాజస్థాన్‌లో ఎంబిబిఎస్ మూడో సంవత్సరం చదువుతున్న 23 ఏళ్ల అవిరల్ సైనీ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శుక్రవారం అతను పరీక్షకు హాజరు కావాల్సి ఉంది. హాస్టల్ రెండో అంతస్థులో ఉన్న అతనిని నిద్రలేపేందు వెళ్లిన మిత్రులు ఎంత ప్రయత్నించినా సమాధానం రాలేదు. దీనితో వారు కిటికీ నుంచి చూడగా, సైనీ ఫ్యాన్‌కు ఉరివేసుకోవడాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సైనీను స్తానిక ఆర్‌బిఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికీ అతను మృతి చెందినట్టు వైద్యులు ప్రకటించారు. కాగా ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు మొదలు పెట్టారు.

## బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు
# భారీ హామీలతో ఎన్‌డిఎ మేనిఫెస్టో

కోటి ఉద్యోగాలు.. కోటి మంది 'లక్‌పతి దీదీ'లు

కెజి నుంచి పిజి వరకు నాణ్యమైన ఉచిత విద్య..10పారిశ్రామిక పార్కులు



**పట్నా:** బిహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ఎన్‌డిఎ శుక్రవారం తన మేనిఫెస్టోను విడుదల చేసింది. ఇందులో ఒక కోటి యువతకు ఉద్యోగాలు, ఒక కోటి 'లక్షపతి దీదీ'లను తయారుచేయడం, నాలుగు నగరాల్లో మెట్రో రైలు సేవలు, రాష్ట్రంలో ఏడు అంతర్జాతీయ విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ మేనిఫెస్టోలో ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, 10 పారిశ్రామిక పార్కులు, కెజి నుండి పిజి వరకు నాణ్యమైన ఉచిత విద్య, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు ఉన్నత విద్యలో నెలకి రూ. 2,000 ఆర్థిక సహాయం వంటి ఇతర ముఖ్య అంశాలు ఉన్నాయి. ఎన్‌డిఎ అధికారం చేపడితే, ప్రపంచస్థాయి మెడిసిటీ ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాల నిర్మించడం, ఉచిత రేషన్, రూ. 5 లక్షల వరకు ఉచిత చికిత్స , 50 లక్షల పక్కా ఇళ్లు నిర్మించడం వంటి సంకల్పాలు మేనిఫెస్టోలో ఉన్నాయి. సీతామరిలోని 'పునౌర ధామ్ జాన్కీ మందిరం', గోమాత సీతమ్మ పుట్టిన స్థలంగా పేర్కొంటున్న ఈ హిందూ తీరయాత్ర కేంద్రాన్ని 'సీతాపురం'గా మారుస్తామని కూడా ఎన్‌డిఎ తన మేనిఫెస్టోలో పేర్కొంది. ఈ మేనిఫెస్టోను బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరీ, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రధాన్, జితన్ రామ్ మంజీ, చిరాగ్ పస్వాన్, మిత్రపక్షాల నేతలు హాజరైన మీడియా సమావేశంలో విడుదల చేశారు. ఎన్‌డిఎ అధికారం చేపట్టినట్లయితే, ప్రభుత్వం ఒక కోటి ప్రభుత్వ ఉద్యోగాలు, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తామని, స్కిల్ ఆధారిత ఉద్యోగాల ప్రోత్సాహానికి స్కిల్ సెన్సస్ నిర్వహిస్తామని చౌదరీ చెప్పారు. ప్రతి జిల్లాలో మెగా స్కిల్ సెంటర్లు ఏర్పాటు చేసి, వాటిని అంతర్జాతీయ స్థాయి స్కిలింగ్ సదుపాయాలుగా అభివృద్ధి చేస్తామని ఎన్‌డిఎ ప్రకటించింది. ముఖ్యమంత్రి మహిళా ఉపాధి పథకం ద్వారా మహిళలకు స్వయం ఉపాధి, రూ. 2 లక్షల వరకు ఆర్థిక సహాయం అందిస్తామని పేర్కొంది. 'ఎన్‌డిఎ ద్వారా ఒక కోటి 'లక్షపతి దీదీ'లు తయారవుతారు. 'మిషన్ కోట్లపతి' ప్రారంభం ద్వారా, గుర్తించినమహిళా వ్యాపారస్తులను లక్షలపతులుగా మార్చడమే మా లక్ష్యం,' అని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. లక్షపతి దీదీ పథకం, మహిళలకు సొంత గ్రూప్‌లలో శిక్షణ ఇచ్చి, ప్రతి కుటుంబం నుంచి కనీసం రూ. 1 లక్ష సంవత్సరానికి ఆదాయం ఆర్జించేలా చేయడం 2023లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఇబిఎస్) అభ్యున్నతికి రూ. 10 లక్షల ఆర్థిక సహాయాన్ని వివిధ వృత్తి సమూహాలకు అందిస్తామని ఎన్‌డిఎ హామీ ఇచ్చింది. ఉచిత రేషన్, రూ. 5 లక్షల వరకు ఉచిత చికిత్స, పేదలకు 50 లక్షల కొత్త పక్కా ఇళ్ల నిర్మాణం మొదలయినవి 'పంచామృత' హామీల్లో ప్రకటించింది. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ఆర్థిక సహాయం రూ. 6,000 నుండి రూ. 9,000 వరకు, అదే విధంగా మత్స్యకారులకు రూ. 4,500 నుండి రూ. 9,000 వరకు పెంచుతామని, ఆహార పంటలకు కనీస మద్దతు ధర ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. బిహార్ స్పోర్ట్స్ సిటీ, రాష్ట్రంలోని ప్రతి విభాగంలో క్రీడా కేంద్రాలు ఏర్పాటు చేయడం, ప్రతి జిల్లాలో ఒక పరిశ్రమ మరియు 10 కొత్త పారిశ్రామిక పార్కులు ఏర్పాటు చేస్తామని కూడా హామీ ఇచ్చింది. పాట్నా మినహా బిహార్‌లోని నాలుగు ఇతర ప్రధాన నగరాల్లో మెట్రో రైలు సేవలు ప్రారంభిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. పేద విద్యార్థులకు కెజి నుండి పిజి వరకు ఉచిత నాణ్యమైన విద్యను అందించడం, పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రముఖ పాఠశాలలను అప్‌గ్రేడ్ చేయడానికి రూ. 5,000 కోట్లను ఖర్చు చేయడం వంటి అనేక హామీలు కూడా ఎన్‌డిఎ మేనిఫెస్టోలో ఉన్నాయి. ఏడు ఎక్స్‌ప్రెస్‌వేలు, 3,600 కిలోమీటర్ల రైల్వే ట్రాక్స్ ఆధునీకరించడం వంటి అంశాలను సైతం ఎన్‌డిఎ తన మేనిఫెస్టోలో చేర్చింది. కాగా, ఇది రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి, మహిళా సాధికారత, మౌలిక వసతుల అభివృద్ధి, కొత్త వ్యాపారాల స్థాపన, ఒక అభివృద్ధి చెందిన, స్వయం ఆధారిత బిహార్ నిర్మాణానికి ఎన్‌టిఎ నిబద్ధతను చాటుతున్నదని కేంద్ర మంత్రి జెపి నడ్డా 'ఎక్స్' పోస్టులో పేర్కొన్నారు.

### అబద్ధాల సమాహారం

ఎన్‌డిఎ మేనిఫెస్టోపై కాంగ్రెస్ విమర్శ

నితీశ్‌ను మాట్లాడనివ్వకపోవడం బిహార్‌కు అవమానమని ఆగ్రహం

**పట్నా:** రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం అధికార కూటమి విడుదల చేసిన మేనిఫెస్టోను అబద్ధాల సమాహారంగా కాంగ్రెస్ అభివర్ణించింది. ప్రజా సభల్లో ఈ విషయాన్ని ప్రస్తావిస్తామని పేర్కొంది. అదే విధంగా 20 ఏళ్ల ఎన్‌డిఎ పాలనకు లెక్కచెప్పాలని డిమాండ్ చేయనున్నట్టు వెల్లడించింది. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను మాట్లాడనివ్వకపోవడం బిహార్‌కి, బిహారీలకు అవమానం అని విమర్శించింది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అశోక్ గెహ్లోత్ ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఎన్‌డిఎ మేనిఫెస్టో విడుదల కార్యక్రమం కేవలం 26 సెకన్ల పాటు మాత్రమే కొనసాగిందని, ఎందుకంటే నాయకులు తమ 20 ఏళ్ల పాలనపై పాత్రికేయులు అడగవచ్చిన ప్రశ్నలకు భయపడ్డారని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నుంచి బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా వరకూ పలువురు నాయకులు హాజరైన ఈ మేనిఫెస్టో విడుదల కార్యక్రమం కేవలం ఒక నిమిషంలోపే ముగియడం విచిత్రంగా ఉందని వ్యాఖ్యానించారు. తరువాత అందరూ వేదికను విడిచిపెట్టగా, ఉప ముఖ్యమంత్రి మాత్రమే అక్కడ ఉండి పాత్రికేయుల కొన్ని ప్రశ్నలకు సమాధానమిచ్చిన విషయాన్ని ప్రస్తావించారు. 'ఎన్‌డిఎ నాయకులు కేవలం 26 సెకన్లపాటు మాత్రమే ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఉన్నారు. వారు పాత్రికేయుల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి భయపడ్డారు' అని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌ను మాట్లాడనివ్వలేదు అని గెహ్లోత్ ఆరోపించారు.

## రాష్ట్ర హోదా అంశం
# పనులకు అడ్డంకి కాదు

జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా

ఇంతకెంతకాలం నిరీక్షించాలి ఒమర్ అబ్దుల్లా





**శ్రీనగర్:** రాష్ట్ర హోదా అనే అంశం పనులకు ఎంత మాత్రం అడ్డంకి కాదని జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా వ్యాఖ్యానించారు. అయితే, హోదా కోసం ఎంతకాలం ఎదురు చూడాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. కేంద్రం సృష్టించిన అడ్డంకులు ఉన్నప్పటికీ తన పని చేస్తున్నానని అన్నారు. ఎస్‌కెఐసిసి వద్ద జెకెయుటి ఫౌండేషన్ డే వేడుకల్లో పాల్గొన్న సిన్హా ప్రసంగిస్తూ, రాష్ట్రంలో పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయని అన్నారు. ప్రభుత్వ పనితీరు నిర్లప్తతంగా ఉందని ఆరోపించారు. ప్రజల ద్వారా ఎన్నికైన ప్రభుత్వానికి అన్ని అధికారాలు ఉంటాయని, రాష్ట్ర హోదాతో ఏ మాత్రం సంబంధం లేకుండా పనులు చేయవచ్చని సూచించారు. కేంద్ర గృహ మంత్రి అమిత్ షా పార్లమెంట్‌లో ప్రకటించినట్లు, జమ్మూకశ్మీర్‌లో ముందుగా డెలిమిటేషన్, ఆపై అసెంబ్లీ ఎన్నికలు, తర్వాత సరైన సమయంలో రాష్ట్ర హోదా లభిస్తుందని వివరించారు. 'కానీ, కొంత మంది వ్యక్తులకు కొన్ని సమస్యలు ఉన్నట్టుగా తోస్తున్నది. ఎన్నికలు కేంద్రపాలిత ప్రాంతానికి జరుగుతున్నాయని వారికి స్పష్టంగా తెలుసు. కాబట్టి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, రాష్ట్ర హోదాతో పనులను నిర్లక్ష్యం చేయడం తగదు' అన్నారు.

అయితే, సిన్హా వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి అబ్దుల్లా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ పనితీరును తప్పుపట్టం సరికాదని అన్నారు. రాష్ట్ర హోదాకోసం ఇంకెంత కాలం వేచి చూడాలని ప్రశ్నించారు. అయినప్పటికీ, ఆ విషయాన్ని పక్కకుపెట్టి, ప్రభుత్వం విధి నిర్వహణను కొనసాగిస్తున్నదని, ఏవేవో ఊహించుకొని, తమకు సలహాలు ఇవ్వడం మానుకోవాలని ఈద్‌గాహ్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న అబ్దుల్లా అన్నారు. 'ఈరోజు మనం చూస్తున్న ధ్వంసం, నిరుద్యోగం, జిఎస్‌టి ఆదాయంలో తగ్గింపు, ఖాళీ హోటళ్లు, రెస్టారెంట్లు, టాక్సీలు, హౌస్‌బోట్లు, మన హస్తకళ ఉత్పత్తుల అమ్మకాల తగ్గుదల ఎందుకు? పహల్గామ్‌లో ఒక దాడి జరిగినందుకే కదా? ఇక్కడ భద్రతకు బాధ్యత ఎవరిది? అది నా నియంత్రణలో లేదు. ఉంటే, జమ్మూకశ్మీర్‌లో పరిస్థితి ఇలాగా మారకుండా చూసేవాళ్లం' అని అన్నారు. తాను జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రిగా ఉన్న ఆరు సంవత్సరాల్లో (2009–2014) ఒక్కసారైనా పర్యాటకుల మీద దాడి జరగలేదని అన్నారు. 'మా అతిథులు 26 మంది పహల్గామ్‌లో మృతి చెందారు. మేము ఎలా పని చేయాలో మీరు చెప్తున్నారు. మా పని మాకు తెలుసు. మేము మా పని చేస్తాం. మీరు మీనపి చేయండి' అంటూ సిన్హాపై ఎదురు దాడి చేశారు.

## దేశ ఆత్మగౌరవం కంటే' మరేదీ ముఖ్యం కాదని...
# ఇందిరాగాంధీ మాకు అదే నేర్పించారు

మాజీ ప్రధానికి కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ నివాళి

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, మాజీ చీఫ్ సోనియాగాంధీ ఘననివాళులు



న్యూఢిల్లీ : దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆమెకు ఘనంగా నివాళులు అర్పించింది. కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత రాహుల్‌గాంధీ మాట్లాడుతూ శక్తివంతులను ఎదుర్కొనేటప్పుడు ఇందిరాగాంధీ నిర్భయంగా, స్థిరంగా ఉండేవారని పేర్కొన్నారు. 'భారతదేశ ఆత్మగౌరవం కంటే మరేదీ ముఖ్యం కాదని ఆమె మాకు నేర్పించారు' అని రాహుల్ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీ, ఇతర సీనియర్ నాయకులు ఇక్కడి శక్తిస్థల్ వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఇందిరాగాంధీకి నివాళులు అర్పించారు. సఫ్దర్ గంజ్ రోడ్ నెంబర్ 1లో ఉన్న ప్రధానమంత్రి స్మారకాన్ని కూడా వారు సందర్శించారు. మల్లికార్జున్ ఖర్గే తన హిందీ 'ఎక్స్' పోస్ట్‌లో మాట్లాడుతూ ధైర్యసాహసాలకు ప్రతిరూపమైన మన రోల్ మోడల్ భారతదేశపు తొలి ప్రధాని ఇందిరాగాంధీ అన్నారు. ఆమె బలిదానం రోజున ఆమెకు వినయపూర్వకమైన నివాళి అని ఖర్గే పేర్కొన్నారు.' ఆమె తన దృఢ సంకల్పం, నైపుణ్యం కలిగిన నాయకత్వం, దార్శనికత ద్వారా భారతదేశం ఐక్యత, సమగ్రతను కాపాడటంలో, బలమైన ప్రగతిశీల భారతదేశాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు' అని మల్లికార్జున్ ఖర్గే అన్నారు. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన రాహుల్‌గాంధీ మాట్లాడుతూ 'భారత్ కీ ఇందిర' నిర్భయంగా, దృఢ సంకల్పంతో, శక్తివంతులను ఎదుర్కొనే శక్తిని కలిగి ఉండేది. భారతదేశం గుర్తింపు, ఆత్మగౌరవం కంటే మరేదీ ముఖ్యం కాదని మీరు మాకు నేర్పించారు. మీ ధైర్యం, కరుణ, దేశభక్తి నేను వేసే ప్రతీ అడుగులోనూ నన్ను ప్రేరేపిస్తునే ఉన్నాయి అని పేర్కొన్నారు. తన నానమ్మ ఇందిరాగాంధీకి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, వాయనాడ్ ఎంపి ప్రియాంక గాంధీ కూడా ఘన నివాళులు అర్పించారు. 'నేను మీ నుండి నిర్భయతను నేర్చుకున్నాను. మీ నుండి దేశభక్తిని తెలుసుకున్నాను. మీ నుండి సేవా స్ఫూర్తిని అర్థం చేసుకున్నాను. మీ నుండి నేను ఒక స్త్రీ శక్తి అనుభవించాను. మీరు లక్షలాది మంది హృదయాలలో ఎప్పటికీ జీవిస్తారు. నా హృదయం కూడా వారి మధ్యే ఉంది' అని ఆమె తన హిందీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేశ్ 1977, ఆగష్టు 13న వర్షాకాలంలో బిహార్‌లోని బెల్చ్చిలో దివంగత ఇందిరా గాంధీ తొలుత కారులో, ఆ తర్వాత జీపులో, ట్రాక్టర్‌లో, ఏనుగు మీద ప్రయాణించి కులపరమైన దురాగతాలతో నాశనమైన కుటుంబాల కోసం అసాధారణమైన రీతిలో ఆకస్మింగా ప్రయాణించి పరామర్శించిన స్మృతులను గుర్తు చేసుకున్నారు.ఇందిరాగాంధీ అసాధారణ ధైర్యసాహసాలు, ధైర్యం, పట్టుదల, స్థితిస్థాపకత కలిగిన వ్యక్తి అని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరాం రమేశ్ కొనియాడారు. జైరాం రమేశ్ ఇందిరాగాంధీ బెల్చ్చి గ్రామాన్ని ఏనుగుపై సందర్శించిన ఫోటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు. 1984లో అక్టోబరు 31న అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీని ఆమె ఇంటి ముందే ఆమె అంగరక్షకులు కాల్చిచంపారు. ఇందిరాగాంధీ భారతదేశపు తొలి మహిళా ప్రధానమంత్రి. ఆమె 1917సంవత్సరం నవంబరు 19న జన్మించారు. కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి ఆర్గనైజేషన్ కె.సి.వేణుగోపాల్ మాట్లాడుతూ '1984లో ఇదే రోజున భారతదేశపు గొప్ప లీడర్లలో ఒకరైన ఇందిరాగాంధీ అమరులయ్యారు' అని ఆయన తన 'కోసం మా జీవితాలను అంకితం చేస్తామని ప్రతిజ్ఞ చేస్తున్నాం అని వేణుగోపాల్ తన 'ఎక్స్' పోస్ట్‌లో తెలిపారు.

## యావత్ కశ్మీర్‌ను భారతదేశంలో ఏకంచేయాలన్న
# పటేల్ ఆకాంక్షను నెహ్రూ నెరవేర్చలేదు

ప్రధానమంత్రి మోదీ ధ్వజం

గుజరాత్‌లో సర్దార్ పటేల్ 150వ జయంతి సభలో

కాంగ్రెస్‌పై విమర్శనాస్త్రాలు




**ఏక్తానగర్ (గుజరాత్) :** సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి సందర్భంగా ప్రధానమంత్రి మోదీ కాంగ్రెస్‌పై విమర్శల దాడికి దిగారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ ఇతర సంస్థానాలతో చేసినట్లుగానే యావత్ కశ్మీర్‌ను భారతదేశంలో ఏకం చేయాలని కోరుకున్నారు కానీ, అప్పటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ దానిని అనుమతించలేదని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోపించారు. సర్దార్ వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి సందర్భంగా ఇక్కడ జరిగిన రాష్ట్రీయ ఏక్తా దివస్ పరేడ్ తర్వాత జరిగిన బహిరంగసభను ఉద్దేశించి ప్రధాని మోదీ ప్రసంగించారు. చొరబాటుదారులు భారతదేశ సమతుల్యతను దెబ్బతీస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా నిర్ణయాత్మక పోరాటం చేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. 'చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, చరిత్రను సృష్టించడానికి మనం కష్టపడి పనిచేయాలని సర్దార్ వల్లభాయ్ పటేల్ నమ్మాడు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పటేల్ రూపొందించిన విధానాలు, ఆయన తీసుకున్న నిర్ణయాలు కొత్త చరిత్రను సృష్టించాయి అని ప్రధానమంత్రి అన్నారు. 'వన్ ఇండియా, ఎక్సలెంట్ ఇండియా' అనే ఆలోచన ఆయనకు అత్యంత ప్రధానమైనది అని మోదీ చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ సమస్యను పరిష్కరించడంలో పార్టీ చేసిన తప్పులకు కశ్మీర్ మరియు భారతదేశం మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందని వివరించారు. 'సర్దార్ పటేల్ ఇతర సంస్థానాలను విలీనం చేసినట్లే, మొత్తం కశ్మీర్ ప్రాంతాన్ని భారతదేశంలో విలీనం చేయాలని కోరుకున్నారు, కానీ నెహ్రూ తన కోరికను నెరవేర్చడానికి అనుమతించలేదు. కశ్మీర్ విభజించబడింది. ఒక రాజ్యాంగం, ప్రత్యేక జెండా ఇవ్వబడింది. కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పు కారణంగా దేశం దశాబ్దాలుగా బాధపడింది' అని ప్రధాని చెప్పారు. సర్దార్ పటేల్‌కు దేశ సార్వభౌమాధికారం అన్నింటికన్నా గొప్పదని, కానీ ఆయన మరణం తర్వాత వచ్చిన సంవత్సరాలలో వరుసగా వచ్చిన ప్రభుత్వాలు దేశ సార్వభౌమాధికారం పట్ల అదే గంభీరతను చూపించలేదని మోదీ తెలియజేశారు.కశ్మీర్‌లో జరిగిన తప్పులు, ఈశాన్యంలో తలెత్తిన సమస్యలు, దేశవ్యాప్తంగా వ్యాపించిన నక్సలైట్‌మావోయిస్ట్ ఉగ్రవాదం అన్నీ దేశ సార్వభౌమత్వానికి తీవ్రమైన సవాళ్లు అని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ భారతదేశాన్ని పాలించిన బ్రిటిష్ వారి నుంచి కాంగ్రెస్ పార్టీ విదేశీ మనస్తత్వాన్ని, వారసత్వంగా పొందిందని విమర్శించారు. 'ఈ వ్యక్తులు బాబా సాహెబ్ అంబేద్కర్ జీవించిన కాలంలో, ఆయన మరణించిన తర్వాత ఆయన కోసం ఏమిచేశారు? నేతాజీ సుభాష్ చంద్రబోస్ కోసం, డాక్టర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్ కోసం ఏమిచేశారు' అని మోదీ నిప్పులుచెరిగారు.

**బలమైన, సామరస్యపూర్వకమైన, అద్భుతమైన భారతదేశాన్ని నిర్మిద్దాం : రాష్ట్రపతి ముర్ము**

సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బలమైన, సామరస్యపూర్వకమైన, అద్భుతమైన భారతదేశాన్ని నిర్మించడానికి అందరూ సంకల్పించుకోవాలని ముర్ము పిలుపునిచ్చారు. రాష్ట్రపతి మాట్లాడుతూ సర్దార్ పటేల్ గొప్ప దేశభక్తుడు, దార్శనిక నాయకుడు, జాతి నిర్మాత అని శ్లాఘించారు. తన అచంచల సంకల్పం, అద్వితీయ ధైర్యం, ప్రవీణ నాయకత్వం ద్వారా దేశాన్ని ఏకం చేసే చరిత్రాత్మక పనిని పటేల్ సాధించారన్నారు. 'జాతీయ ఐక్యతా దినోత్సవం సందర్భంగా మనందరం కలిసి బలమైన, సామరస్యకపూర్వకమైన, అద్భుతమైన భారతదేశాన్ని నిర్మించడానికి సంకల్పించుకుందాం' అని రాష్ట్రపతి ముర్ము 'ఎక్స్' హిందీ పోస్ట్‌లో పిలుపునిచ్చారు.

# 10 రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేయండి

పంజాబ్, హర్యానా బార్ కౌన్సిల్ ఎన్నికలపై సుప్రీం కోర్టు ఆదేశం



**న్యూఢిల్లీ:** పంజాబ్, హర్యానా బార్ కౌన్సిల్‌ల ఎన్నికలను డిసెంబర్ 31, 2025లోపు నిర్వహించాలని, దానికి సంబంధించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను 10 రోజుల్లో విడుదల చేయాలని భారత బార్ కౌన్సిల్ (బిసిఐ)కు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీలతో కూడిన సుప్రీం కోర్టు బెంచ్ శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. అదే విధంగా ఉత్తరప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలను జనవరి 31, 2026లోపు పూర్తి చేయాలని, ఓటర్ల చట్టబద్ధమైన సమస్యలను పరిష్కరించాలని కూడా ఆదేశించింది. కోర్టు దృష్టికి వచ్చిన అంశాల ప్రకారం, పంజాబ్, హర్యానా బార్ కౌన్సిల్ ఎన్నికలు ఇంకా నోటిఫై కాలేదు, ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదని తేలింది. బిసిఐ చైర్మన్, సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ మిశ్రా ఈ విషయాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నియమాల ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల మధ్య కనీసం 180 రోజుల వ్యవధి ఉండాలని, పంజాబ్, హర్యానా ఎన్నికల విషయంలో కొంత సాంకేతిక ఇబ్బంది తలెత్తవచ్చనని అన్నారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ స్పందిస్తూ, బార్ కౌన్సిల్ ఎన్నికల పర్యవేక్షణ కోసం హైకోర్టు రిటైర్డ్ జడ్జి ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. దానికి మిశ్రా సమాధానమిస్తూ, ఇప్పటికే అలాంటి కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అయితే, కోర్టు పంజాబ్, హర్యానా ఎన్నికల కోసం మరో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని ప్రత్యేక ప్యానెల్‌ను నియమించాలని ధర్మాసనం సూచించింది. డిసెంబర్ 31, 2025 నాటికి ఎన్నికలు నిర్వహించేలా ప్రయత్నించాలని, ఏవైనా ఇబ్బందులు వస్తే కోర్టు ఆ విషయాన్ని పరిశీలిస్తుందని పేర్కొంది. 'బార్ కౌన్సిల్ ఎన్నికలు చాలాకాలంగా జరగలేదు. ఇప్పుడు ఎన్నికలు నిర్వహించడానికి బిసిఐ అంగీకరించింది. మనం ప్రజాస్వామ్య సంస్థలపై విశ్వాసం ఉంచి, సహకరించి, న్యాయసమ్మతమైన ఎన్నికలు జరగడానికి సహకరించాలి' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. బిసిఐ పాలక వర్గం గరిష్టంగా ఏడు సంవత్సరాల మాత్రమే కొనసాగవచ్చని నిబంధనల్లో ఉందని సీనియర్ న్యాయవాది నరేందర్ హూడా కోర్టుకు తెలిపారు. దీనికి కోర్టు స్పందిస్తూ, ఎన్నికలకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

### ఎస్పీ స్థాయి అధికారుల అనుమతి లేనిదే


న్యాయవాదులను విచారణకు పిలవకూడదు

'సుప్రీం' స్పష్టీకరణ

**న్యూ ఢిల్లీ:** ఎస్పీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) స్థాయి అధికారుల అనుమతి లేకుండా న్యాయవాదులను విచారణకు పిలవకూడదని విచారణ సంస్థలకు సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. మనీలాండరింగ్ కేసులో న్యాయవాదులు అర్వింద్ దాతర్, ప్రతాప్ వేణుగోపాల్‌లకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) జారీ చేసిన సమన్లను రద్దు చేసింది. నిందితుల ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఆ సమన్లు జారీ చేసినట్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్, న్యాయమూర్తులు జస్టిస్ కె. వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్‌వి అంజారియాలతో కూడిన బెంచ్ వ్యాఖ్యానించింది. ఎస్పీ అనుమతి లేనిదే విచారణకు పిలవరాదని తీర్పునిచ్చింది. విచారణాధికారులు లేదా పోలీసు అధికారులు, నిందితుడి తరఫున ఉన్న న్యాయవాదిని విచారణకు పిలవాలంటే, భారతీయ సాక్ష్యాధినియమం (బిఎస్‌ఎ) సెక్షన్ 132లో పేర్కొన్న మినహాయింపులకే పరిమితం కావాలని ధర్మాసనం తెలిపింది. అటువంటి సమన్లు జారీ చేసే ముందు, ఎస్పీ లేదా అంతకన్నా ఉన్నత స్థాయి అధికారి లిఖిత పూర్వక అనుమతి పొందాల్సి ఉంటుందని తెలిపింది. న్యాయవాదులు లేదా క్లయింట్లు భారతీయ నాగరిక భద్రతా సంహిత 2023 ప్రకారం కోర్టులో సమన్లపై పునఃసమీక్ష కోరవచ్చని తెలిపింది. ఈ తీర్పును అనుసరించి న్యాయవాది–కస్టమర్ మధ్య గోప్యతా సంబంధాన్ని పరిరక్షించాలి. అయితే, క్లయింట్ పత్రాలను సమర్పించాల్సి వస్తే ఆ పత్రాలు గోప్యతా పరిరక్షణ పరిధిలోకి రావు. డిజిటల్ పరికరాలను సమర్పించే సందర్భంలో, సంబంధిత కోర్టు మాత్రమే వాటి పరిశీలన ఆదేశించగలదు. అయితే, కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయని ఇన్‌హౌస్ కౌన్సిల్స్ ఈ రక్షణ పరిధిలోకి రావని స్పష్టం చేసింది.

## తమిళనాడులో
# చట్టవిరుద్ధ ఇసుక తవ్వకాలు!

ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశాలివ్వాలని హైకోర్టును ఆశ్రయించిన ఇడి



**చెన్నై:** తమిళనాడు రాష్ట్రంలో చట్టవిరుద్ధ ఇసుక తవ్వకానికి సంబంధించిన సుమారు రూ. 130 కోట్ల రెవెన్యూ నష్టం కలిగిందని తెలిపే సమాచారం ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించాలని కోరుతూ ఎన్‌ఫోర్స్‌మెట్ డైరెక్టరేట్ (ఇడి) మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. ప్రమాదాన్ని సమర్థవంతంగా పరిశీలించేందుకు, ఇడి వాటర్ రిసోర్సెస్ తదితర శాఖల సహకారం అందించాలని కోరుతూ అన్ని అవసరమైన డాక్యుమెంట్లు, సమాచారం, మద్దతును అందించమని కోరింది. సుప్రీం కోర్టు న్యాయమూర్తి ఎంఎం శ్రీవాత్సవ, న్యాయమూర్తి జి. అరుల్ మురుగన్‌తో కూడిన ఫస్ట్ బెంచ్ ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)కు నోటీసులు జారీ చేయాలని ఆదేశిస్తూ, కేసును మూడు వారాలకు వాయిదా వేసింది. ఇడి చెన్నై జోనల్ ఆఫీస్, ఆర్థిక మంత్రిత్వ శాఖ, రెవెన్యూ విభాగం అసిస్టెంట్ డైరెక్టర్ ఎం. కాంతి కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌లో, 987 హెక్టార్ల విస్తీర్ణంలో చట్ట విరుద్ధంగా ఇసుక తవ్వకం జరుగుతున్నదని ఆరోపించారు. అనుమతించిన క్వారీ ప్రాంతం కంటే ఎక్కువ ప్రాంతాన్ని ఇసుకు తవ్వకాలకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. అందులో సుమారు 23,64,871.96 యూనిట్ల ఇసుక, అంటే 66,21,641.5 క్యూబిక్ మీటర్ల అదనపు తవ్వకాన్ని గుర్తించామని, ఇది ప్రభుత్వ అధికారిక రికార్డులో నమోదు కాలేదని తెలిపారు. చట్టవిరుద్ధంగా తవ్విన ఇసుక విలువ సుమారు రూ. 4,730 కోట్లు ఉండగా, అదే కాలంలో వాటర్ రిసోర్సెస్ డిపార్ట్‌మెంట్ ఖాతాల్లో చూపిన ఆదాయం కేవలం రూ. 36.45 కోట్లు మాత్రమేనని వివరించారు. ఇప్పటి వరకు జరిపిన దర్యాప్తును అనుసరించి, అనేక ప్రైవేట్ కాంట్రాక్టర్లు, వారి సంబంధిత వ్యక్తులు పరిమితులకు మించి ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారని, అంతేగాక, అనుమతించని ప్రాంతాల్లోనూ తవ్వకం కొనసాగుతున్నదని వివరించారు. దీనివల్ల ప్రభుత్వానికి భారీ నష్టం కలుకుతున్నదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోకపోవడంతో, పలు ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు కొనసాగుతున్నాయని ఇడి తరఫున దాఖలైన పిటిషన్ కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. పరిస్థితిని గమనించి, వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుకు మార్గనిర్దేశనం చేయాలని కోరింది. కాగా, పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం, సమాధానం కోసం తమిళనాడు ప్రభుత్వానికి, డిజిపికి నోటీసులు జారీ చేయాల్సిందిగా ఆదేశాలిచ్చింది.

ప్రజాపక్షం
శనివారం, 01 నవంబరు

## కేరళ ఎల్.డి.ఎఫ్. మరో సాఫల్యం

వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) పరిపాలనలో ఉన్న కేరళ రాష్ట్రం తన ధగద్ధాయమాన కిరీటంలో మరో ఆణిముత్యం చేర్చుకుంటున్నది. అక్షరాస్యత, వైద్యం, గృహవసతి, పేదరికం నిర్మూలన, ప్రజా పంపిణీ వ్యవస్థ వంటి సూచికల్లో దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న కేరళ అత్యంత దారిద్ర్యం నుంచి విముక్తి పొందిన తొలి రాష్ట్రంగా రికార్డులకు ఎక్కుతున్నది. 'భగవంతుని స్వదేశం'గా పిలవబడే ఈ రాష్ట్రం సాధించిన ఈ విజయాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ ఈరోజు (నవంబర్ 1) తిరువనంతపురంలో సెంట్రల్ స్టేడియంలో జరిగే ఉత్సవంలో అధికారికంగా ప్రకటించనున్నారు. 2021లో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ తొలి మంత్రివర్గ సమావేశ నిర్ణయాల్లో ఒకటిగా అత్యంత దారిద్ర్య నిర్మూలన కార్యక్రమం ఆరంభమైంది. దేశంలో అతి తక్కువ దారిద్ర్యం రేటు–రాష్ట్ర జనాభాలో 0.7శాతం ఉన్న రాష్ట్రం కేరళ అని నీతి ఆయోగ్ అధ్యయనం ప్రకటించింది. ఈ అతి తక్కువ జనాభాను కూడా చేరుకోవడానికి, వారి అవసరాలు తీర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు స్థానిక స్వపరిపాలన ప్రభుత్వాల మంత్రి ఎం.బి రాజేష్ చెప్పారు.

ఆహారం, ఆరోగ్యం, జీవనోపాధి, తలదాచుకునే ఇల్లు లేకపోవడం వంటి అంశాలు ప్రాతిపదికగా క్షేత్రస్థాయి సర్వే చేయగా 64,006 కుటుంబాలు అత్యంత దారిద్ర్యంలో ఉన్నట్లు నిర్ధారణ జరిగింది. వారిలో చాలామంది పేర్లు ఓటర్ల జాబితాలో లేవు, రేషన్ కార్డు లేదా ఆధార్ కార్డు లేవు. ఒక్కొక్క కుటుంబం తక్షణ, దీర్ఘకాలిక అవసరాలు తీర్చేందుకు సూక్ష్మ ప్రణాళికలు రూపొందించబడినాయి. అవసరమైన పత్రాలు లేని 21,263 మందికి వాటిని సమకూర్చడం జరిగింది. 3,913 కుటుంబాలకు గృహాలు, 1,338 కుటుంబాలకు భూమి ఇవ్వగా, 5,651 కుటుంబాలకు ఒక్కొక్కదానికి రూ.2 లక్షల చొప్పున గృహ మరమ్మతు పనులకు ఇవ్వడం జరిగింది. 2021 సర్వేలో గుర్తించబడిన 64,006 కుటుంబాల్లో, 4,421 మంది వ్యక్తులు (ఏక వ్యక్తి కుటుంబాలు) అనంతర కాలంలో మరణించారు. 261 సంచారజాతుల కుటుంబాలను గుర్తించేందుకు సకల ప్రయత్నాలు చేసినప్పటికీ వారి జాడ దొరకలేదు. వారు ఇతర రాష్ట్రాలకు వలసపోయారు. ఈ 4,729 కుటుంబాలు పోను మిగతా 59,277 కుటుంబాలను దుర్భర దారిద్ర్యం నుంచి బయటకు తెచ్చినట్లు మంత్రి చెప్పారు. ఐక్యరాజ్యసమితి శాశ్వత అభివృద్ధి లక్ష్యాలైన ఆహారం, ఆరోగ్యం, ఆదాయం, గృహవసతి కొలబద్దలుగా దుర్భర దారిద్ర్యంలో ఉన్న కుటుంబాలను గుర్తించడం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వ దృఢ సంకల్పం, అధికార వికేంద్రీకరణ, స్థానిక స్వపరిపాలన వ్యవస్థ స్వరూపం కారణంగా ఈ ప్రాజెక్టు విజయవంతమైంది. ప్రాథమిక సర్వే, సూక్ష్మ ప్రణాళికల తయారీ, వాటి అమలులో స్థానిక సంస్థలు పెద్దపాత్ర వహించాయి. 72,73 రాజ్యాంగ సవరణ చట్టాల ప్రకారం 29 అధికారాలను స్థానిక సంస్థలకు బదలాయించిన ఆదర్శ రాష్ట్రం కేరళ. పౌర సరఫరాల శాఖ ప్రాధాన్యతతో రేషన్‌కార్డులిచ్చింది. రెవెన్యూ శాఖ ఇళ్ల నిర్మాణానికి స్థలాలు గుర్తించింది. ఆరోగ్యశాఖ వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు ఇస్తున్నది. సాధారణ, ఉన్నత విద్యాశాఖలు ఆ కుటుంబాల పిల్లలకు ఉచిత విద్య అందిస్తుండగా, రవాణా శాఖ ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించింది.

కాలనిర్ణయ, నిర్మాణాత్మక కృషి వల్ల ఈ కార్యక్రమం విజయవంతమైంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం చేసిన మంచి పనులను సైతం మెచ్చుకోగల సంస్కారం కొరవడిన ప్రతిపక్షాలున్న రాజకీయ వ్యవస్థ మనది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ ఘనత ఏమీ లేదని, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజక పథకాల వల్లనే సాఫల్యం సాధ్యమైందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ కుళ్లుబోతుతనం వెళ్లగక్కారు. ప్రతిపక్ష యుడిఎఫ్ నాయకుడు వి.డి.సతీశన్ (కాంగ్రెస్) కూడా అటువంటి సన్నాయి నొక్కులే నొక్కారు. అయితే ఏ కేంద్ర పథకాలను ఈ కార్యక్రమానికి వినియోగించామో చెప్పాలని ముఖ్యమంత్రి విజయన్ వారికి సవాలు విసిరారు.

ఇదిలా వుండగా, కార్మికవర్గ విభాగాల సంక్షేమానికి మరో రూ.10 వేల కోట్లు వెచ్చించే అనేక సంక్షేమ చర్యలను ముఖ్యమంత్రి విజయన్ ప్రకటించారు. వరుసగా రెండో సారి అధికారంలోకి వచ్చి చరిత్ర సృష్టించిన ఎల్‌డిఎఫ్ వచ్చే సంవత్సరం జరిగే ఎన్నికల్లో హ్యాట్రిక్ సాధనకు కృషి చేస్తున్నది.

# ఇసి నియామకాలపై కోర్టు జాప్యం ప్రభుత్వానికి వరం

**అఖిల్ యాదవ్, ఆదిత్య ప్రతాప్ సింగ్**

ఎన్నికల కమిషనర్‌లను నియమించే కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తి(సిజెఐ)ని పక్కనబెట్టిన ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్‌ల చట్టం– 2023ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లను నవంబర్ 11న సుప్రీంకోర్టు విచారించనుంది. ఈ రిట్‌లు దాఖలు అయ్యాయి, వాయిదాలు వేయబడ్డాయి, తరువాత ఒక సంవత్సరంపాటు పదే పదే విచారణ జాబితాలో చోటు కల్పించబడ్డాయి. ఈలోగా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నియామకంతో సహా మూడు నియామకాలు జరిగిపోయాయి. అదే సమయంలో చట్టం కోర్టులో ఇంకా సవాలు చేయబడిన స్థితిలోనే కొనసాగుతుంది.

విచారణకు షెడ్యూలు చేయడం కంటే మించిన అంశం అందులో ఉంది. వాయిదాలు ఎన్నికల తటస్థత మూలాలను అతిక్రమించింది. 2023 చట్టం అమలులో ఉంటూ, నెలలు నెలలు గడుస్తున్నకొద్దీ, దానిని పర్యవేక్షించే బాధ్యత కలిగిన సంస్థపై కార్యనిర్వాహక అధికారాన్ని చెలాయించే ప్రక్రియ బలపడుతుంది. అనిశ్చితి స్థితి ఎంత ఎక్కువ కాలం కొనసాగితే, ప్రజాస్వామ్యంపై ప్రతికూల ప్రభావాన్ని సరిదిద్దడం అంత కష్టతరమవుతుంది. 2023 మార్చిలో అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీం కోర్టు ఒక మధ్యంతర ముందు జాగ్రత్త చర్యను నిర్దేశించింది. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం అమలులోకి వచ్చే వరకు, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నియామకాలను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సిజెఐలతో కూడిన త్రిసభ్య కమిటీ చేపట్టాలి. ఈ ఆలోచన ప్రతీకవాదం లేదా మెజారిటీ వాదం కాదు, నిర్మాణాత్మక సమతుల్యత. ఈ ప్రక్రియలో ప్రభుత్వంలోని ఏ ఒక్క అంగం కూడా ఆధిపత్యం చెలాయించకుండా నివారించడం.

> *2023 మార్చిలో అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఒక మధ్యంతర ముందు జాగ్రత్త చర్యను నిర్దేశించింది. దీనికి సంబంధించి పార్లమెంటు చట్టం అమలులోకి వచ్చే వరకు, భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ) నియామకాలను ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సిజెఐలతో కూడిన త్రిసభ్య కమిటీ చేపట్టాలి. ఈ ఆలోచన ప్రతీకవాదం లేదా మెజారిటీవాదం కాదు, నిర్మాణాత్మక సమతుల్యత. ఈ ప్రక్రియలో ప్రభుత్వంలోని ఏ ఒక్క అంగం కూడా ఆధిపత్యం చెలాయించకుండా నివారించడం.*

చింది. ఈ చట్టం ప్రకారం అనుసరించే ప్రతి కొత్త నియామకం యథాతథ స్థితిని మరింత స్థిరపరుస్తుంది. స్థిరపడిన ఏర్పాట్లను ఇబ్బంది పెట్టకుండా కోర్టు విజయవంతంగా జోక్యం చేసుకోవడం చాలా కష్టతరం చేస్తుంది. ప్రభావం బహుళమైంది. కోర్టు పేర్కొన్న అనూప్ బరన్వాల్ తీర్పు తటస్థ, రాజ్యాం




నెలల తర్వాత సిజెఐ స్థానంలో కేంద్ర క్యాబినెట్ మంత్రిని నియమించే 2023 బిల్లు, కాగితంపై నుంచి పార్లమెంటు శాసన అధికారం ఉపయోగించబడి చట్ట రూపం తీసుకుంది. అయితే, ఆచరణలో నిస్సందేహంగా త్రాసును కార్యనిర్వాహక వర్గం వైపు తిప్పారు. కార్యనిర్వాహక వర్గం ప్రభావం లేకుండా ఉండాల్సిన సంస్థకు నియామకాలను నిర్ణయించడంలో అదే కార్యనిర్వాహక సంస్థ మూడు ఓట్లలో రెండు ఓట్లను కలిగి ఉంది. దీనిని సాంకేతిక పరివర్తన అని పిలుస్తారు, కానీ ఇది రాజ్యాంగపరమైన నష్టాన్ని కలిగిస్తుంది. మోహిందర్ సింగ్ గిల్ వర్సెస్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (1977)కేసులో సుప్రీంకోర్టు ప్రముఖంగా పేర్కొన్నట్లు "స్వేచ్ఛాయుత, న్యాయబద్ధమైన ఎన్నికలు ప్రజాస్వామ్యానికి జీవనాడి". ఆ సూత్రం ప్రస్తుతం ఒత్తిడిలో ఉంది.

న్యాయపరమైన నియంత్రణ అనేది ప్రశంసనీయమైన ధర్మం. న్యాయపరమైన ఆలస్యం మాత్రం కాదు. ఈ కేసును సుప్రీంకోర్టు పదే పదే వాయిదా వేయడం ద్వారా 2023 చట్టాన్ని పర్యవేక్షణ లేకుండా అమలు చేయడానికి అనుమతించింది... గపరంగా విశ్వసనీయమైన ప్రక్రియను ఆశించింది. ఈ వ్యాజ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా కొనసాగినంత కాలం, ఆ దృష్టి ఆచరణాత్మక ప్రాసంగికత మసకబారుతుంది. విధానపరమైన జాప్యాలు రాజ్యాంగ రక్షణను తిరిగి రాస్తాయా అని పౌరులు ఆశ్చర్యపోతారు.

న్యాయవ్యవస్థ పరిధి మించిపోతుందనే ప్రశ్నతో ఈ చర్చకు సంబంధం లేదు; ఇది న్యాయ కార్యకలాపాల వేగానికి సంబంధించినది. వినీత్ నారాయణ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1997)లో సంస్థల స్వతంత్రత చట్ట పాలన హృదయం వద్ద ఉందని కోర్టు సరిగ్గానే వ్యాఖ్యానించింది. అటువంటి స్వతంత్రతను పరిరక్షించడం క్రియాశీలతగా చూడలేము, కానీ రాజ్యాంగ విశ్వసనీయతకు హామీగా చూస్తాము.

ఈ సంక్షోభం తప్పనిసరిగా న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య ఘర్షణగా ఉండవలసిన అవసరం లేదు. మరింత సమతుల్య నమూనా సాధ్యమే, సముచితం కూడా. పార్లమెంటు 2023 చట్టాన్ని సమీక్షించి, ఎంపిక ప్యానెల్‌లో తటస్థ సభ్యుడిగా సిజెఐ, రిటైర్డ్ న్యాయమూర్తి లేదా కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ వంటి రాజ్యాంగ అధికారులను చేర్చవచ్చు. అదనంగా, ఎంపిక ప్రమాణాలను పారదర్శకం చేయడం, స్పష్టమైన ఎంపిక హేతుబద్ధతను ప్రచురించడం నియామకాల ఉద్దేశ్యాల విశ్వసనీయతను పెంచుతుంది. ఎన్నికల కమిషన్ అనేది స్వతంత్రతకు ఆటంకం కలిగించే అడ్డంకి కాదు, ప్రజాస్వామ్య చట్టబద్ధతకు హామీ. ఎన్నికల సంస్కరణలపై దినేష్ గోస్వామి కమిటీ (1990) కూడా నొక్కిచెప్పినట్లుగా, కమిషన్‌ను కార్యనిర్వాహక ప్రభావం నుండి దూరంగా ఉంచటం ప్రజల విశ్వాసం పెంపొందించేందుకు ఎంతో అవసరం. నిష్పాక్షికత సంపూర్ణంగా ఉండే సంస్థ ద్వారా ఎన్నికలు నిర్వహించినప్పుడు ప్రభుత్వాలు కూడా మెరుగ్గా ఉంటాయి. భారతదేశ ప్రజాస్వామ్య చట్రం సంకీర్ణ అస్థిరత నుండి ప్రజాదరణ వరకు అనేక పరీక్షలను తట్టుకుంది. కానీ అది అపనమ్మకం కంటే గౌరవాన్ని రేకెత్తించే సంస్థలపై ఆధారపడి ఉంటుంది. ఈ విషయాన్ని విచారించడానికి ధర్మాసనం కూర్చున్నప్పుడు, అది ఒక చట్టాన్ని మించి న్యాయ నిర్ణయాన్ని వెలువరిస్తుంది. శాసన సౌలభ్యం నుండి పర్యవేక్షణ, సమతుల్యత (చెక్స్ అండ్ బ్యాలెన్సెస్) సూత్రం బయటపడగలదా లేదా అని ఇది నిర్ణయిస్తుంది. సుప్రీంకోర్టు విధి కేవలం ఒక చట్టాన్ని కొట్టివేయడం లేదా సమర్థించడం కాదు, ఆలస్యం ద్వారా స్వతంత్రత పలుచబారదని సంకేతమివ్వాలి.

ఈ కేసుపై నిర్ణయం వెలువడటంలో జాప్యం జరిగే ఒక్కో రోజూ ప్రభుత్వానికి, రిఫరీకి మధ్య రేఖ అస్పష్టంగా మారే మరో రోజుగా మారుతుంది. జస్టిస్ కృష్ణ అయ్యర్ 'మొహిందర్ సింగ్ గిల్ తీర్పులో రాసినట్లుగా, 'కమిషన్ ప్రజాస్వామ్యానికి కాపలాదారు'. ఆ కాపలాదారు న్యాయంగా ఉండటమే కాకుండా న్యాయంగా ఉన్నట్లుగా కనిపించాలి. కాబట్టి కోర్టు తుది తీర్పు నియామక ప్రక్రియను మించి నిర్వచించాలి. భారత ప్రజాస్వామ్యం దాని సంస్థల బలంపై మరింత మనుగడ సాగిస్తుందా లేదా దాని పాలకుల సౌలభ్యం మేరకా అనేది నిర్ణయించబడాలి. విచారణ తుది దశకు సమీపిస్తున్న కొద్దీ, తదుపరి ఎన్నికల చక్రభ్రమణం ప్రారంభమయ్యే ముందు విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి కోర్టు సకాలంలో చర్య తీసుకుంటుందా? అనే ప్రశ్న తలెత్తుతుంది. ప్రశ్న సరళమైనదే అయినప్పటికీ లోతైనది. ఎందుకంటే న్యాయం కోసం ఎదురుచూస్తున్నప్పుడు, ప్రజాస్వామ్యం ఊగిసలాడుతుంది. రెండింటి మూల్యాన్ని ఓటరే భరించాలి.

> *న్యాయవ్యవస్థ పరిధి మించిపోతుందనే ప్రశ్నతో ఈ చర్చకు సంబంధం లేదు; ఇది న్యాయ కార్యకలాపాల వేగానికి సంబంధించినది. వినీత్ నారాయణ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1997)లో సంస్థల స్వతంత్రత చట్ట పాలన హృదయం వద్ద ఉందని కోర్టు సరిగ్గానే వ్యాఖ్యానించింది. అటువంటి స్వతంత్రతను పరిరక్షించడం క్రియాశీలతగా చూడలేము, కానీ రాజ్యాంగ విశ్వసనీయతకు హామీగా చూస్తాము.*

**(ఐపిఎ సర్వీస్)**

# అన్నదాత గుండె మంట.. క్రాప్ హాలీడే ఇస్తే?

**కార్పొరేట్‌లకు రూ.వేలకోట్లు మాఫీ.. రైతన్నకు రూపాయి రాలదు**



భారతదేశ ఆర్థిక వ్యవస్థలో అట్టడుగున ఉన్న అన్నదాత మరియు అత్యున్నత స్థాయిలో ఉన్న కార్పొరేట్ శక్తుల మధ్య నెలకొన్న వైరుధ్యాన్ని దేశ పౌరులు తీవ్రంగా ప్రశ్నిస్తున్నారు. ఒకవైపు విజయ్ మాల్యా (రూ.9,000 కోట్లు), నీరవ్ మోదీ (రూ.13,000 కోట్లు), సందేశార సోదరులు (రూ.14,500 కోట్లు), రామచంద్రన్ విశ్వనాథన్ (రూ.22,842 కోట్లు) మరియు అనిల్ అంబానీ గ్రూప్ (రూ.28,874 కోట్ల వరకు) వంటి ప్రముఖులు బ్యాంకులను మోసం చేసి, వేల కోట్ల రూపాయల రుణాలను ఎగవేసి, విదేశాల్లో స్వేచ్ఛగా బతుకుతుంటే, వారిని దేశానికి రప్పించడంలో ప్రభుత్వాల అలసత్వం స్పష్టంగా కనిపిస్తోంది. మరోవైపు, అకాల వర్షాలు, తుపాన్లు మరియు వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయి, క్రాప్ హాలీడే తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న రైతన్నకు మాత్రం కనీసం ఒక్క రూపాయి నష్టపరిహారం కూడా దక్కడం లేదు. ఒకవేళ దేశవ్యాప్తంగా రైతులు క్రాప్ హాలీడే ఇస్తే పరిస్థితి ఏంటి? దేశంలో ఆకలి చావులు పుట్టవా? ఈ దారుణమైన అసమానత దేశ ప్రగతికి అతిపెద్ద ఆటంకంగా నిలుస్తోంది. కార్పొరేట్ శక్తులకు ఎలాంటి హామీలు లేకుండా, సులభంగా, కోట్లాది రూపాయల రుణాలు ఇచ్చే బ్యాంకులు అన్నం పెట్టే రైతులకు అప్పు ఇవ్వడానికి మాత్రం పది నిబంధనలు విధిస్తున్నాయి. ఒక రైతు తన పాస్‌బుక్‌తో బ్యాంకుకు వెళితే, అతన్ని కుక్కల కంటే హీనంగా చూసే పరిస్థితులు ఉన్నాయని, చిన్న రుణం కోసం కూడా తీవ్ర అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేట్ మొసళ్లకు దండాలు పెడుతూ ఏసీ గదుల్లో స్వాగతం పలికే బ్యాంక్ అధికారులు, రైతును మాత్రం బడ్డీ కొట్టు యజమాని కంటే హీనంగా చూస్తున్నారు. ఈ సిగ్గుమాలిన పరిస్థితి దేశ చట్టాలు పనిచేస్తున్నాయా అనే ప్రశ్నను లేవనెత్తుతోంది. మరోవైపు, లక్ష రూపాయల రుణం కోసం రైతు పడే కష్టం అంతా ఇంతా కాదు. బ్యాంకులు మొహం చాటేస్తే, అతను 12% నుండి 30% వరకు అనధికార వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తులపై ఆధారపడాల్సి వస్తుంది. ఒకవేళ పంట నష్టపోతే, ప్రభుత్వం నుండి సాయం అందదు, బ్యాంకు వడ్డీ లు భరించలేక చివరికి ఆత్మహత్యలకు పాల్పడే దయనీయ పరిస్థితి నెలకొంది. ఈ విధంగా రైతును అప్పుల ఊబిలోకి నెట్టడంలో బ్యాంకులు మరియు ప్రభుత్వాల పర్యవేక్షణ వైఫల్యం ప్రధాన పాత్ర పోషిస్తోంది. రైతంటే ఎందుకంత చులకన భావం? పెద్ద కార్పొరేట్ సంస్థలకు వేల కోట్లలో రుణాలు ఇచ్చేటప్పుడు పాటించాల్సిన నిబంధనలను బ్యాంకులు ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించాయనేది దర్యాప్తు సంస్థల ప్రధాన ఆరోపణ. కేవలం కాగితాలపై చూపించిన ఆస్తుల ఆధారంగా, రుణాలను చెల్లించే సామర్థ్యం ఉందో లేదో సరిగ్గా పరిశీలించకుండా కోట్ల రూపాయలు అప్పగించారు. పైగా, ఈ కార్పొరేట్ రుణ ఎగవేతదారులు తమ కంపెనీల నిధులను విదేశాలకు తరలించినా, వాటిని పట్టుకోవడంలో మన దేశ దర్యాప్తు సంస్థలు మరియు బ్యాంకింగ్ చట్టాలు తీవ్ర జాప్యాన్ని ఎదుర్కొంటున్నాయి. అదే రైతు రుణం కట్టకపోతే, వెంటనే అతని ఆస్తులను జప్తు చేసే కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. ఒకరికి ఒక న్యాయం, మరొకరికి మరొక న్యాయం అనే ఈ ద్వంద్వ ప్రమాణం భారతీయ న్యాయ వ్యవస్థపై ప్రజల్లో అనుమానాలను పెంచుతోంది. ప్రభుత్వాలు, ఉచిత పథకాలు, రాయితీల పేరుతో దేశ ప్రజలను సోమరిపోతులుగా తయారుచేస్తున్నాయనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ పథకాలపై ఖర్చు చేసే వేలాది కోట్ల రూపాయలతో, కార్పొరేట్ శక్తులు ఎగవేసిన డబ్బుతో కలిపి, దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ వడ్డీ లేని రుణాలు అందించవచ్చు. రైతు తనకు నష్టం కలిగినప్పుడు లేదా పంట పండనప్పుడు చెల్లింపుల విషయంలో మినహాయింపునిస్తూ, స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే వాతావరణాన్ని సృష్టిస్తే, దేశం ఆర్థికంగా అద్భుతాలు సృష్టించగలుగుతుంది. వీరు ఎగవేసిన డబ్బులతో (సుమారుగా రూ.78,000 కోట్లకు పైగా), భారతదేశంలోని రైతులందరూ స్వేచ్ఛగా వ్యవసాయం చేసుకునే విధంగా వడ్డీ లేని రుణాలు ఇస్తే, రైతులు మరింత పంటలు పండించి దేశాన్ని ఆర్థికంగా అన్నపూర్ణగా తీర్చిదిద్దకపోలేరా? తుపాను కారణాల వల్ల దేశంలో రైతులు ఎంతో పంటలు నష్టపోతున్న కనీసం ప్రభుత్వాలు రూపాయి కూడా మాఫీ చేయని పరిస్థితి నెలకొంది. ఇంత ఆర్థికంగా వెనుకబడి పెట్టుబడి పెట్టి నష్టపోతున్న కనీసం రూపాయి రైతులకు ఇవ్వలేని పరిస్థితి ప్రభుత్వం ఉందంటే, ఈ పాలకులు రైతుల పట్ల ఏమాలోచిస్తున్నారో చెప్పాల్సిన పరిస్థితి లేదా? రైతు పడుతున్న కష్టం, నష్టాన్ని చూసి కూడా ప్రభుత్వాలు కనువిప్పు పొందకపోవడం అత్యంత విచారకరం. 'జై కిసాన్, జై జవాన్' అనే నినాదం పలికే ముందు, రైతుకు మనం ఏమి చేశామనేది ప్రతి పాలకుడు చెప్పాల్సిన సమయం ఇది. రైతుకు గౌరవం ఇవ్వని, భరోసా ఇవ్వని ఈ వ్యవస్థపై అన్నదాతల గుండె పగిలింది. రైతులు తలుచుకుంటే, దేశంలో ఆకలి కేకలు పుట్టడానికి ఎక్కువ సమయం పట్టదు. ఈ విపత్తు సమయంలో తమ భూముల్లో పంటలు పండించడం మానేసి, 'క్రాప్ హాలిడే' ప్రకటిస్తే, ఆహార భద్రత ప్రమాదంలో పడుతుంది. అప్పుడు కార్పొరేట్ సంస్థల లాభాలు కూడా వారికి ఉపయోగపడవు. ఏ కార్పొరేట్ శక్తులకు ఏ ఆధారంతో కోట్లాది రూపాయలు ఇచ్చారో తెలియదు కానీ, కనీసం అన్నం పెడుతున్న రైతన్నకు మాత్రం ఒక్క రూపా యి కూడా ఇవ్వలేని పరిస్థితి ఈ బ్యాంకుల్లో నెలకొని ఉంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారి రైతులకు వడ్డీ లేని రుణాలు ఇస్తూ, రైతు చెల్లించినప్పుడే తీసుకునే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. కార్పొరేట్ శక్తులకు తలొగ్గి రైతులను దోపిడీ చేయడం కాదు. కనీసం ఎరువులు కూడా సప్లై చేయలేని పరిస్థితి భారతదేశంలో నెలకొంది అంటే, సిగ్గుపడాల్సింది ప్రభుత్వమే. అప్పుడే దేశం ప్రపంచానికి ఆదర్శంగా నిలిచి, ప్రపంచం మొత్తానికి అన్నం పెట్టే విధంగా భారత్ ఎదగగలుగుతుంది. రైతులు వారి పాస్ బుక్కులు ఇచ్చి కూడా రుణం తీసుకునేందుకు వచ్చిన గౌరవం ఉండదు. ఇంకా ఎదురు తిడుతూ రైతును ఏదైనా చేస్తారు. ఇది భారతదేశంలో రైతుకున్న విలువ. ఈ విలువను మార్చాల్సిన బాధ్యత నేటి పాలకుల చేతుల్లో ఉంది.

లేఖ

**– వెంకగారి భూమయ్య**

# ఆర్థిక 'అక్షరాస్యత'ను పాఠ్యాంశంగా చేర్చలేమా!

రెక్కాడితేనే డొక్క నిండని అత్యాధునిక అకాలాలు. నిరుద్యోగుల బతుకు బహు వెతలు. నిరుపేదల అనంత ఆకలి పోరాటాలు. నైపుణ్య చేతులకే పరిమితమైన పనులు, ఆదాయాలు. దినసరి కూలీ రేట్ల పతనాలు. ఆదాయం బహు పలుచన, కోరికలు ఆకాశాన. చుట్టూ సమస్యల విష వలయాలు. రేపటికి లేదు భరోసా. నేడు పని దొరుకుతుందన్న ఆశలు కరువు. ఇన్ని సంక్షోభాల నడుమ డిజిటల్ యువత తమ కుటుంబ స్థాయిని మరిచి, విచ్చలవిడిగా, అనాలోచితంగా, విచక్షణారహితంగా ధనాన్ని నీళ్ల వలె ఖర్చు చేయడం చూస్తున్నాం. ఆదాయానికి, ఖర్చుకు సంబంధం లేకుండా పోతున్నది. నేటి ఆదాయం రేపటి విపత్తుల్లో ఆదుకుంటుందన్న ఇంగితం మరిచారు యువజనులు. ఆర్థిక క్రమశిక్షణ లోపించి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతూ, అశాంతి నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. రాబడి కన్న ఖర్చులు అధికం అవుతున్నాయి. ఎంత సంపాదిస్తున్నామనేది ముఖ్యం కాదని, ఎంత ఆదా లేదా పొదుపు చేస్తున్నామనేది ప్రధానమని తెలుసుకోని యువత నేడు ఆర్థిక నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. రేపటి ఆపదలు చెప్పి రావు. ఆపద వచ్చినపుడు బ్యాంకు బ్యాలెన్స్ ఖాళీగా ఉంటుంది. ఇలాంటి ఆర్థిక సంకట స్థితికి కారణం నేటి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పొదుపు ప్రాధాన్యం తెలియకపోవడమే అని నిర్ధారించాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి విద్యా వ్యవస్థలో ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు పాఠాలు చెప్పడానికి అవకాశం లేకుండా పోయింది. ఎంత ఖర్చు పెడితే అంత గౌరవం పెరుగుతుందనే దురభిప్రాయంలో యువత కొట్టుమిట్టాడుతోంది. చిన్నపాటి నుంచే పిల్లల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించాలి. పొదుపునకు, పిసినారితనానికి వ్యత్యాసం నేర్పాలి. సంపాదించిన నెలసరి వేతనంతో కొంత మేరకు పొదుపు చేయడం కనీస కర్తవ్యమని నేర్పుకోవాలి. మొక్కై వంగనిదే, మానై వంగదు కదా. లేత మనసుల్లో ఆర్థిక అక్షరాస్యత బీజాలు నాటాలి. చిన్నతనంలో పొదుపు పాఠాలు నేర్పిన పిల్లలు రేపటి కుంబానికి సుఖ సంతోషాలను అందించగలడని తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా పొదుపు ప్రాధాన్యాన్ని అవగాహన కల్పించటానికి ప్రతి ఏట 31 అక్టోబర్ రోజున ప్రపంచ పొదుపు దినోత్సవం (వరల్ థ్రిఫ్ట్ లేదా సేవింగ్స్ డే) పాటించడం 1925 నుంచి ఆనవాయితీగా వస్తున్నది. భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 31 అక్టోబర్ 1984 రోజు మరణించడంతో, 1985 నుంచి ప్రపంచ పొదుపు దినాన్ని భారత ప్రభుత్వం 30 అక్టోబర్ రోజున నిర్వహించడం కొనసాగుతున్నది. నేటి డిజిటల్ యువత ఉద్యోగాలు చేస్తూ పరిమిత వేతనాలను పొందుతున్నారు. తాము పొందిన వేతనాలతో కుటుంబాలను సజావుగా నడపడం లేదు. ప్రాధాన్యాలు మరిచి పోతున్నారు. విలాసాలు కూడా కనీస అవసరాలు అనుకుంటున్నారు. డబ్బు చేతిలో ఉన్నపుడు చేతులకు ఎముకలు లేవన్నట్లు అనాలోచితంగా ఖర్చు చేస్తున్నారు. ధనం ఉన్నపుడు ఎగిరిపడడంతో పాటు లేనపుడు అప్పులు చేయడానికి కూడా వెనకాడడం లేదు. విలాసాలకు, కనీస అవసరాలకు వ్యత్యాసాలు మరిచి పోతున్నారు. ఎంత సంపాదించిన నెలలోని తొలి వారంలోనే ఖర్చు పెడుతున్నారు. రేపటి అనుకోని ఆపదలను తట్టుకోవడానికి పొదుపు ధనం వినియోగపడుతుందనే కనీస అవగాహన కోల్పోతున్నారు. నేటి విద్యాలయాలు మార్కులు, ర్యాంకుల పాఠాలు నేర్పుతున్నారు. ఉద్యోగాలు పొందడానికి అవసర విద్యను బోధిస్తున్నారు. సంపాదించిన ధనాన్ని పొదుపుగా వాడుకోవడాన్ని నేర్పే విద్య కరువైయ్యింది. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకోవడం నేర్పాలి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దు కోవడం బోధించాలి. ప్రమాదాలు తెప్పి రావని, అనారోగ్యాలు అడిగి రావని తెలుసుకోవాలి. అనుకోని విపత్తుల్లో ఆదా చేసిన డబ్బు ఆదుకుంటుందనే ఇంగితం మరిచాం. చిన్నతనం నుంచే పాకెట్ మనీని దాచుకోవడం నేర్పించాలి. తొలి దశలో గల్ల గురిగిలో చిల్లర డబ్బుల్ని దాచుకోవడం నేర్పాలి. పిల్లలతో పాటు యువతకు డబ్బు ప్రాధాన్యాన్ని, ఖర్చు చేసే పద్ధతులను, పొదుపు చేయవలసిన అవసరాన్ని బోధించాలి. తమ బ్యాంక్‌లో పొదుపు ధనాన్ని దాచుకోవడం బోధించాలి. ప్రతి నెల వేతనంలో కొంత శాతాన్ని విధిగా పొదుపు చేయడం నేర్చుకోవాలి. మన అలవాట్లకు, వ్యయానికి సమీప సంబంధం ఉందని తెలపాలి. నేటి పొదుపు రేపటి భరోసా కావాలి. వృత్తిలో ఎదగడం, కుటుంబంలో శాంతి నెలకొనడం, పిల్లల చదువులు, గృహ నిర్మాణం, వాహనాల నిర్వహణ, పిల్లల పెళ్లిళ్లు, అనుకోని ఖర్చులు లాంటివని మన ఆర్థిక క్రమశిక్షణతో ప్రత్యక్ష సంబంధాలను కలిగి ఉంటాయని మరువరాదు. తెలియక పోవడం పొరపాటు కాకపోవచ్చని, తెలుసుకోకపోవడం నేర సమానమని తెలుసుకోవాలి. ఆర్థిక క్రమశిక్షణ లోపించిన కుటుంబాల్లో మానసిన ఒత్తిడి, అనారోగ్యాలు, అశాంతి, గొడవలు, పిల్లల పెంపకంలో ఇబ్బందులు, భవిష్యత్తు పట్ల అనిశ్చితి లాంటివని వెంటాడుతుంటాయి. నేటి విద్యావిధానంలో పాఠ్యాంశాలు, నైపుణ్యాలు, మానవీయ విలువలు, మంచి అలవాట్లు, కంప్యూటర్ అక్షరాస్యత లాంటి అంశాలతో పాటు ఆర్థిక అక్షరాస్యతను చిన్నతనం నుంచే కూడా విధిగా బోధించాలి. సకల విలువలను నేర్పే కేంద్రాలుగా తరగతి గదులు మారాలి. నేటి బాలలే రేపటి పౌరులని, నేటి ఆదాయమే రేపటి ప్రమాదాలకు చికిత్స అని, నేటి పొదుపు చేసిన ధనమేరా రేపటి కుటుంబ సంతోషాలకు పునాది అని తెలుసుకుందాం. పొదుపు మంత్ర మహత్యాన్ని చిన్నారుల మనస్సుల్లో ముద్రిద్దాం.



**– మధుసూదన్ రెడ్డి**

# విపత్తులతో కకావికలమవుతున్న జన జీవితాలు

ఇటీవల కాలంలో సంభవిస్తున్న పెను తుఫానులు పెను విధ్వంసం సృష్టిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌ను దాటిన మొంథా తుఫాను తీవ్ర విధ్వంసం సృష్టిస్తుందనే భయంకరమైన పరిస్థితుల నుండి ప్రజలు బయటపడి ఊపిరి పీల్చుకున్నారు.అయితే తుఫాను తీరం దాటిన తర్వాత ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వలన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇలాంటి పరిస్థితులు ఎందుకు ఏర్పడుతున్నాయి? ప్రకృతిలో ఎందుకు అవాంఛనీయ పరిణామాలు సంభవిస్తున్నాయి? ఆకస్మిక వాతావరణ మార్పులకు కారణమేమిటి? ఇలాంటి కీలకమైన అంశాలపై తీవ్రమైన పరిశీలన,మేథో మధనం జరగాలి. మానవ చర్యల వలన ప్రకృతిలో సంభవించే విపత్తులనుండి ప్రజలను కాపాడుకోవాలి. ప్రకృతి విధ్వంస దుష్ఫలితాలను కనీస స్థాయికి తగ్గించాలి. ప్రకృతి భూమికి రక్షణ కవచం వంటిది. అలాంటి ప్రకృతిని విధ్వంసం చేయడం మనల్ని మనం ప్రమాదంలో పడేసుకోవడమే. మన చుట్టూ ఆవరించి ఉన్న ప్రకృతిని నిర్లక్ష్యం చేసి, పర్యావరణానికి ముప్పు కలగచేయడం క్షమార్హం కాదు. పర్యావరణ విధ్వంసంతో మానవ ప్రపంచం విలపిస్తున్నది. ప్రపంచాన్ని పచ్చదనంతో నింపితేనే భూగ్రహాన్ని కాపాడగలం. స్వీడన్, ఫిన్లాండ్, న్యూజిలాండ్, ఐస్‌లాండ్, డెన్మార్క్, యు.కె, స్విట్జర్లాండ్, ఫ్రాన్స్ వంటి దేశాలు హరిత దేశాలుగా పేర్కొనబడుతున్నాయి. సహజ వనరులను పరిరక్షించి, కర్బన ఉద్గారాలను తగ్గించడం ద్వారా డెన్మార్క్ గ్రీనెస్ట్ కంట్రీ దిశగా పయనిస్తున్నది. ఖతార్,నైజర్, గ్రీన్ లాండ్ వంటి దేశాల్లో పచ్చదనం తక్కువగా ఉంది. ప్రస్తుత కలుషితభరితమైన ప్రపంచంలో ప్రతీ చోట వినిపించే మాట 'పర్యావరణం'. పర్యావరణాన్ని పరిరక్షించి, భూతలాన్ని కాపాడేందుకు 'రాచెల్ లూయిస్ కార్సన్' వంటి పర్యావరణ వేత్తల ఆలోచనలు స్ఫూర్తి కావాలి. గేలార్డ్ నెల్సన్ లాంటి దూరదృష్టి గల పర్యావరణ ప్రేమికులను వర్తమాన ప్రపంచం తయారు చేయాలి. జాదవ్ పాయెంగ్, వనజీవి రామయ్య వంటి ప్రకృతి, పర్యావరణ సేవకులు సమాజం నుండి ఉద్భవించాలి. ప్రపంచ స్థాయి సంస్థలు, ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు పర్యావరణ పునరుద్ధరణ కు నడుంబిగించి, మానవాళిని పెను సంక్షోభం నుండి బయటకు తీసుకురావడానికి వడివడి అడుగులు వేయాలి. సహజసిద్ధమైన, కలుషిత రహితమైన గత కాలం నాటి, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పునర్జీవింపచేయాలి. మానవ చర్యల వలన ఏర్పడుతున్న వాతావరణ మార్పులకు అడ్డుకట్ట వేయాలి. ప్రకృతి వైపరీత్యాలనుండి ప్రజలను కాపాడాలి.

**– సుంకవల్లి సత్తిరాజు**

# గ్రామ గ్రామాన ఎఐయుటిసి జెండా ఆవిష్కరణ

ప్రజాపక్షం/లింగాలఘణపురం: ఎఐటియుసి ఆవిర్భవ పురస్కరించుకొని మండలంలోని, లింగాల ఘ ణపురం, కొత్తపెల్లి, నవాబుపేట, పటేల్ గూడెం, జీడికల్, వడిచర్ల, పలు గ్రామాలలో ఎఐటియుసి, జనగామ జిల్లా ఉపాధ్యక్షులు రావుల సదానందం ఆధ్వర్యంలో, జెండా ఆవిష్కరణ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ 1920 అక్టోబర్ 31 తేదీన ఏర్పడిననాటికి 106 సంవత్సరాలు కావస్తుందని ఎన్నో పోరాటాలతాగాల ఫలితమే, 44 కార్మిక చట్టాలు ఇప్పటివరకు కాపాడుకునే ప్రయత్నం కొనసాగుతుందని ఏఐటియుసి ప్రతిఫలంతోనే కార్మికులకు, అండర్ దండలుగా అండదండలుగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పక్కిరయ్య, వీరస్వామి, అంజయ్య, వెంకటేష్, రవి, కనుక రాజు, కుమార్, వెంకటేష్, చంద్రయ్య, యాదగిరి, మల్లేశం, వీరస్వామి, ఉపేందర్, రవి, రాములు, యాదగిరి, నాగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

# సేవా స్ఫూర్తికి రక్తదానం నిదర్శనం

పోలీస్‌ల రక్తదాన కార్యక్రమంలో కలెక్టర్



ప్రజాపక్షం/జనగామ :రక్తదానం గొప్ప సేవాగుణంతో కూడిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. ప్రతి ఒక్కరు కర్తదానం చేసి ఇతరులకు ప్రాణదానం చేయాలన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జనగామలోని నెహ్రూ పార్కు సమీపంలో గల కామాక్షి పంక్షన్ హాల్‌లో పోలీసుల రక్తదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. డిసిపి రాజమహేంద్రనాయక్, ఎసిపి పందరి చేతన్ నితిన్, సిఐ సత్యనారాయణరెడ్డితో పాటు జిల్లాలోని పలువురు సిఐలు, ఎస్ఐ, సామాజిక కార్యకర్తలు, రాజకీయ పార్టీల నాయకులు, రక్తదానం చేశారు.

## జూబ్లీహిల్స్ అబ్జర్వర్‌గా జమాల్ షరీఫ్‌కు బాధ్యతలు

ప్రజాపక్షం / జనగామ: జనగామ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాదికి జూబ్లీహిల్స్ అబ్జర్వర్ బాధ్యతలను కాంగ్రెస్ పార్టీ అప్పగించింది. జూబ్లీహిల్స్‌లోని బోరబండ డివిజన్‌లో జమాల్ షరీఫ్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తరుపున ప్రచారం చేయనున్నారు. జమాల్ షరీఫ్ మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో నవీన్ యాదవ్ గెలుపొందనున్నారన్నారు. ఆయనతరుపున తనను బోరబండ అబ్జర్వర్‌గా నియమించడం అభినందనీయమని, తన శక్తివంచన లేకుండా పనిచేస్తానన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపుకోసం కృషి చేస్తానన్నారు.

## సర్దార్ స్ఫూర్తిని కొనసాగించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ




ప్రజాపక్షం/భూపాలపల్లి :సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమగ్రతను కాపాడుతూ, భిన్నత్వంలో ఐక్యతకు ప్రతీకగా నిలవడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ” కార్యక్రమానికి ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక అంబేద్కర్ స్టేడియం నుండి జయశంకర్ విగ్రహం మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు రన్‌ను నిర్వహించారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ, దేశ సార్వభౌమత్వాన్ని, ఐక్యతను కాపాడటానికి రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం మంచి సందేశాన్ని ప్రజలకు చేరవేస్తుందని పేర్కొన్నారు. మన దేశంలో భిన్న మతాలు, జాతులు, భాషలు ఉన్నప్పటికీ పరస్పరం గౌరవం, సహకారంతో అన్ని వర్గాలు ఐక్యంగా జీవిస్తున్నాయని తెలిపారు. ఎస్‌పి కిరణ్ ఖరే మాట్లాడుతూ, సర్దార్ పటేల్ దేశ ఐక్యత కోసం అఖండ కృషి చేసి ఉక్కు మనిషిగా పేరుగాంచారని తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, అదనపు ఎస్‌పి నరేష్,డిఎస్‌పి సంపత్ రావు, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రఘు, పోలీసు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ బాధిత రైతాంగా-నికి పంట నష్టపరిహారం చెల్లించాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ‘ఆత్మ’ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబాబాద్:మెంథా తుఫాన్ బీభత్సం వల్ల పంట నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం సర్వే నిర్వహించి వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆత్మ కమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి కోరారు. కురవి మండల పరిధిలో మెంథా తుఫాన్ వలన నష్టపోయిన పత్తి,వరి పంటలను సిపిఐ బృందం పరిశీలించి, రైతాంగాన్ని ఓదార్చింది. సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పత్తి రంగు మారిపోయి తీవ్రంగా రైతాంగం నష్టపోయారని, వరి చేతికొచ్చే దశలో తుఫాను తాకిడితో పంట నేలకొరిగి పడిపోయి రైతాంగం దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికార యంత్రాంగం సమగ్ర సర్వే నిర్వహించి పంట నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకొని రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, కురవి పట్టణ కార్యదర్శి తురక రమేష్, బుర్ర సమ్మయ్య, కలగూర నాగరాజు, అప్పాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి బి. విజయ్ సారథి



ప్రజాపక్షం/కేసముద్రం: మెంతా తు ఫాన్ వల్లన ష్టపోయినటువంటి రైతంగానికి శాస్త్రీయంగా సర్వే నిర్వహించి సరైన పద్ధతిలో నష్టపరిహారాన్ని చెల్లించి ఆదుకోవాలసి సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి డిమాండ్ చేశా రు. సిపిఐ సర్వే బృందం శుక్రవారం కేసముద్రం మండల కేంద్రంలోని దనసరి, ఉప్పరపల్లి గ్రామాలలో తుఫాను వల్ల నష్టపోయిన పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న పంటలన్నీ నీట మునిగి మెంథా తుఫాన్ వల్ల తీవ్ర నష్టం జరిగిందని, చేతికి వచ్చిన పంట నీటిపాలైందని రైతులు తీవ్రమైన ఆవేదనతో ఉన్నారని వారిని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశా రు. కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటిం చి తక్షణమే నిధులు విడుదల చేయాలని ఆ నిధులతో రైతాంగాన్ని ఆ దుకోవాలన్నారు. విజయసారథికి పంట నష్టపోయిన ఉప్పరపల్లి గ్రామ రైతులు నాగర బోయిన కోటయ్య, జీదుల శ్రీనివాస్, చాగంటి గంగయ్య వారి గోడును బోరున విలపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బృందం నాయకులు చొప్పరిశేఖర్, సామ సార య్య, సింగర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## వట్టెవాగు ఉద్ధృతికి కొట్టుకపోయిన రోడ్డు



ప్రజాపక్షం/నెక్కొండ: నెక్కొండ నుంచి చంద్రుగొండ వెళ్లే ప్రధాన రహదారి వరద ఉధృతికి కొట్టుకపోవడంతో గిరిజన గ్రామాల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నెక్కొండ చంద్రుగొండ మధ్యలో వట్టె వాగు ఉధృతికి రోడ్డు కొట్టుకపోవడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గం ద్వారా ప్రయానించే చంద్రుగొండ, బంజరుపల్లి, గొల్లపల్లి, గేట్‌పల్లి గిరిజన గ్రామాల ప్రజలు పూర్తిగా బయటి ప్రపంచంతో వేరు పడ్డారు. వాగు మీదుగా రహదారి పూర్తిగా తెగిపోవడంతో చిన్న పిల్లలు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేక పోతున్నారు. ప్రతీ వర్షకాలంలో ఇదే పరిస్థితి. వాగుపై వెంటనే వంతెనతోపాటు పక్కా రహదారి నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వం వెంటనే రోడ్డు పునరుద్ధరణ చేపట్టకపోతే రానున్న రోజుల్లో ఆహారం, వైద్య, విద్యకు చంద్రుగొండ ప్రాంత ప్రజలు దూరమవుతారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


# ఇందిరమ్మ జీవితం అందరికీ ఆదర్శప్రాయం

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వెల్లడి



ప్రజాపక్షం/ వరంగల్ : ఇందిరమ్మ జీవితం యావత్ భారతీయులందరికీ ఆదర్శప్రాయమని దేశ ఐక్యత కోసం ప్రాణాలర్పించిన ధీరవనిత అని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం భారతదేశ తొలి మహిళా ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా వరంగల్ కాశిబుగ్గ సెంటర్ లోని ఇందిరా గాంధీ విగ్రహానికి రాష్ట్ర శాఖ మంత్రి కొండా సురేఖ పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దేశ ప్రధానిగా ఇందిరాగాంధీ అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మంత్రి సురేఖ మీడియా మాట్లాడుతూ గరిబీ హఠావో అనే నినాదంతో దేశంలోని ప్రతి పేద వాడి కడుపు నింపి ఆకలి తీర్చిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని అన్నారు. భారతదేశపు కీర్తిని ప్రపంచం నలుమూలలా చాటిచెప్పిన ఉక్కు మహిళ ఇందిరమ్మ అని, ఆ మహనీయురాలు రాజకీయ, వ్యక్తిగత జీవితంలో ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని శక్తిమంతమైన నాయకురాలిగా భారతదేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచే స్థాయికి ఆమె ఎదిగిన తీరు మనకి ఎంతగానో స్ఫూర్తిదాయకమన్నారు. ఇందిరమ్మ ఈ దేశానికి అందించిన సేవలు నాటి తరం నాయకులకే కాదు నేటితరం నాయకులకు సైతం ఆచరణీయమన్నారు. తాను తన రాజకీయ జీవితంలో ప్రతి సందర్భంలోనూ ఇందిరమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్ళినట్టు వివరించారు. 1964లో ఆమె తండ్రి, భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ మరణం అనంతరం ఇందిరా గాంధీ రాజ్యసభకు ఎన్నికై... లాల్ బహదూర్ శాస్త్రి మంత్రిమండలిలో ప్రసారశాఖ మంత్రిగా ఆమె విశిష్ట సేవలు అందించారన్నారు. అనంతరం దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో 1966లో మొదటిసారి ప్రధాన మంత్రి పదవీ బాధ్యతలు స్వీకరించి దేశ మొదటి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ చరిత్ర సృష్టించారన్నారు. ఇందిరాగాంధీ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎన్నో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టి మన భారత దేశ స్థితిని గతిని మార్చివేశారని కొనియాడారు. బ్యాంకుల జాతీయకరణ, జమీందారీ వ్యవస్థ రద్దు, రాజ భరణాల తొలగింపు వంటి గొప్ప విప్లవాత్మక పథకాలతో భారతదేశ అత్యున్నత ప్రధానమంత్రిగా నిరూపించుకున్నారన్నారు. ఈ దేశ ప్రజలు బాగుపడాలని పడాలని ఎన్నో మంచి పనులు చేయడంతో ఆమెను ఆనాడు దేశ ప్రజలంతా ఇందిరానే ఇందిరా ఇందిరానే ఇండియా అం టూ కీర్తించారని తెలిపారు. అయితే, దేశంలో అంతర్గత తీవ్రవాదాన్ని రూపుమాపే చర్యల్లో భాగంగా ఆపరేషన్ బ్లూ స్టార్‌లో అమృత్ సర్‌లోని గోల్డెన్ టెంపుల్ వద్ద చేపట్టిన సైనిక చర్య తర్వాత 1984 అక్టోబర్ 31న తన ఇద్దరు అంగరక్షకుల చేతిలో దా రుణంగా హత్యకు గురయ్యారని వాపోయారు. ఆమె దేశభక్తి, ధైర్య సాహసాలు, దేశాభివృద్ధికి ఆమె చూపిన మార్గం ఇప్పటికీ దేశ ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలకు స్ఫూర్తినిచ్చే నాయకురాలిగా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు మన ఇందిరమ్మ అని చెప్పారు. భారతదేశ సమగ్ర అభివృద్ధికి తీసుకున్న కీలకమైన నిర్ణయాలు, సేవలను ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా మననం చేసుకుని ఉక్కు మహిళకు ఘనంగా నివాళి అర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందిరా గాంధీకి మన తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక అనుబంధం ఉందని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఇండ్లు అనే బృహత్తరమైన కార్యక్రమం మన ప్రజా ప్రభుత్వం సమర్థవంతంగా చేపడుతుందని అన్నారు. అయితే, ఈ ఒక్క రోజే కాకుండా రానున్న రోజుల్లోనూ ఇందిరమ్మ సేవలను పార్టీలకతీతంగా మనమంతా మననం చేసుకోవాల్సిన అనివార్యత ఎంతైనా ఉందని మంత్రి సురేఖ గుర్తు చేశారు.

## సిఎంకి ఘన స్వాగతం పలికిన మంత్రి కొండా సురేఖ



ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర రెవెన్యూ, హౌ సింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సిఎం సలహాదారు శ్రీ వేం నరేందర్ రెడ్డి లకు రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర ఫైనాన్స్ కమిషనర్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, డిప్యూటీ స్పీకర్ రామచంద్రనాయక్, వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి,నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు తదితరులు ఘన స్వాగతం పలికారు. ఆర్ట్స్ కళాశాల మైదానానికి చేరుకున్న ముఖ్యమంత్రి మంత్రులకు స్వాగతం పలికిన వారిలో హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు స్నేహ శబరీష్, డాక్టర్ సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. హెలికాప్టర్ ద్వారా వరంగల్, హన్మకొండ జిల్లాల్లోని పలు ప్రాంతాలను ఏరియల్ సర్వే చేశారు. ఆర్ట్స్ కళాశాల మైదానం నుంచి ప్రత్యేక వాహనంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, ఎంపి ఎమ్మెల్యేలు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు బయలుదేరారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

14ఏళ్ల బాలికతో పాటు మరో ఇద్దరు మృతి

క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ సిపి సన్‌ప్రీత్ సింగ్



ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపెల్లి గ్రామ శివారులో గురువారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న బొలెరో పెళ్లి వాహనాన్ని వెనుకనుంచి వేగంగా వచ్చిన బోర్వెల్ లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో 14 ఏళ్ల బాలిక అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన పలువురిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. వారిలో ఇద్దరు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతులు మహబూబాబాద్ జిల్లా కురవి మండలం సూదన్ పల్లి గ్రామానికి చెందినవారని గుర్తించారు. పెళ్లి కార్యక్రమం ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ దుర్ఘటన సంభవించింది. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్రైత్ సింగ్ ఎంజీఎంహాస్పిటల్లో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రమాదం జరిగిన తీరుపై సంబంధిత అధికారుల నుండి వివరాలు సేకరించారు. గాయపడిన వారికి అందుతున్న వైద్యసేవలపై ఎంజీఎం వైద్యులను ప్రశ్నించారు. ప్రమాద స్థలాన్ని పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈ ఘోరమైన ప్రమాదంతో మృతుల కుటుంబాలలో విషాదం నెలకొంది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ సిపి సన్రైత్ సింగ్ హనుమకొండ జిల్లా ముల్కనూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినా రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ యం. జి. ఎం హాస్పటల్లో పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరుపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులతో పాటు క్షతగాత్రులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గాయపడిన క్షతగాత్రులకు అందిస్తున్న చికిత్స వివరాలను కూడా పోలీస్ కమిషనర్ సంబంధిత వైద్యులను అడిగి తెలుసుకున్నారు

## నష్టపోయిన ప్రతీ కుటుంబానికి పరిహారం ఇవ్వాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




ప్రజాపక్షం/ వరంగల్ : భారీ వర్షాల కారణంగా ఏర్పడిన వరదముంపుతో నష్టపోయిన ప్రతి కుటుంబానికి లక్ష రూపాయలు పరిహారం ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం శివనగర్ తమ్మెర భవన్ లో జరిగిన సిపిఐ వరంగల్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి కందిక చెన్నకేశవులు అధ్యక్షత వహించగా రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లో వేలాది మంది నిరాశ్రయులు అయ్యారని, లోతట్టు కాలనీల ప్రజలను ఆదుకునేందుకు తక్షణం ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. అలాగే జిల్లాలో వర్షాలు, వరదలతో వేల ఎకరాలలో పంటలు దెబ్బ తిన్నాయని, పంటలు నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేతికొచ్చే సమయంలో పత్తి, మొక్కజొన్న, వరి పంటలు తీవ్రంగా దెబ్బ తిన్నాయని, తక్షణమే రైతులను ఆదుకోవాలని కోరారు. వరంగల్ ముంపుకు శాశ్వత పరిష్కారంకై కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నా రు. స్మార్ట్ సిటి, హెరిటేజ్ సిటీగా ప్రకటించిన కేంద్రం ప్రకటనలకే పరిమితం అయిందే తప్ప నిధుల కేటాయింపులో సవతి తల్లి ప్రేమను కనబరుస్తూ వస్తున్నదని విమర్శించారు. గతంలో వరంగల్ ను రెండవ రాజధానిగా చేస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు నగరాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రతీ ఏటా కాలనీలు నీట మునుగుతున్నా గత ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం కోసం నిధులను కేటాయించలేదని, దాంతో అదే పరిస్థితి ప్రతి ఏటా పునరావృతం అవుతున్నదన్నారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, జిల్లా నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మ ణ్, బుస్సా రవీందర్, అక్కపెల్లి రమేష్, తోట చంద్రకళ, మునీశ్వరుడు, గుండె బద్రి, సంగి ఎలేందర్, రహేలా, జన్ను రవి, విజయ, రమేష్, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

## డిఇఓ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా



ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ : మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర పిలుపులో భాగంగా హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో హనుమకొండ డిఇఓ ఆఫీస్ ముందు ధర్నా చేసి సూపరిండెంట్ ప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రం అందించారు. అనంతరం ఎఐటియుసి హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ధర్ముల రామూర్తి మాట్లాడుతూ వంట కార్మికులకు సరైన సమయానికి బిల్లులు జీతాలు రాక నానా ఇబ్బందులు పడుతుంటే కార్మికులకు బిల్లులు చెల్లించకుండా మంచి భోజనాలు అందించాలని అధికారులు ఉపాధ్యాయులు ఒత్తిడి చేస్తూ వంటలు చేస్తే చేయండి లేకుంటే లెటర్ రాసివ్వండి వేరే వాళ్లని రిక్రూట్ చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. 23 సంవత్సరాలుగా ఎలాంటి లాభం లేకుండా పిల్లలు తమ పిల్లలే అని మంచి భోజనాలు చేస్తున్న తమపై సరైన సమయం బిల్లులు ఇవ్వకుండా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని, అప్పుల పాలవుతున్న తమకు కనీసం కనికరించకుండా ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని, కార్మికులకు కనీస భద్రత కాలి గాయాలపాలైన పట్టించుకునే నాధుడే కరువయ్యారని అన్నారు. కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యము, పిఎఫ్,ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ప్రతి నెల ఐదో తేదీ లోపల బిల్లులు ఇవ్వాలని, కాంగ్రెస్ ప్రభుత్వము మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పదివేల వేతనము చెల్లించాలన్నారు. మధ్యా హ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గడ్డం లలిత ప్రధాన కార్యదర్శి ధర్ముల రామ్మూర్తి, శారద ,మేకల అమృత ,ఎస్ రమాదేవి మధ్యల ఎల్లేష్, శంకర్ నాయక్ , మద్దేల శ్రీనివాస్,పాల్గొన్నారు.

## డిఇఓ కార్యాలయాన్ని వంట కార్మికులు ముట్టడి

మెనూ చార్జీలు పెంచకుండా నాణ్యమైన భోజనాలు అందించడం సాధ్యం కాదు



ప్రజాపక్షం/ములుగు: మెనూ చార్జీలు పెంచకుండా నాణ్యమైన భోజనాలు అందించడం సాధ్యం కాదని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. ఎఐటియుసి అనుబంధ, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా ములుగు జిల్లాలోని మధ్యాహ్న భోజన వంట కార్మికులు, జిల్లా విద్యా శాఖ అధికారి కార్యాలయం ముట్టడించి ధర్నా నిర్వహించి ఇన్‌చార్జి డిఈఓ సిద్దార్థరెడ్డికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ మాట్లాడుతూ 24 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో వంట కార్మికులుగా పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తూ ఆ వంట బిల్లులు వేతనాలు 9నెలల పెండింగ్ లో ఉంటే కార్మికులు ఎలా పనిచేస్తారన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క నెల వేతనం కొంచెం ఆలస్యం అయినా ఎన్నో ఇబ్బందులు పడే పరిస్థితులలో వంట కార్మిలు ఎలా వంటలు చేస్తారన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులు ఈ విషయాన్ని చాలా ఈజీగా తీసుకోవడం, ఎంత వరకు సమంజసం అన్నారు.సమస్యలన్ని ప్రభుత్వం వెంటనే పరిష్కరిచాలని, లేదంటే ఈ నెల 12వ తేదీన ఛలో హైదరాబాద్ కమిషరన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ముత్యాల రాజు, బోడ రమేష్, శ్యామ్‌సుందర్, పెద్దకాసు వినోద్, కొత్తూరు శ్రీనివాస్, సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సామల రామ, గుణాల రాజకుమారి, తదితరులు పాల్గొన్నారు.

# కన్నీరు మిగిల్చిన మొంథా తుపాన్

భారీ ఎత్తున నష్టపోయిన రైతున్న



ప్రజాపక్షం/గూడూరు :మోంత తుఫాన్ మానుకోట జిల్లా రైతన్నకు కన్నీరు మిగిల్చింది,బుధవారం కురిసిన భారీ వర్షానికి మహబూబాబాద్ జిల్లా తో పాటు గూడూరు మండలం భారీ ఎత్తున వరి పత్తి పంట పూర్తిగా భారీ నష్టం వాటిల్లింది. నాలుగైదు రోజులుగా కురిసిన భారీ వర్షం రైతులకు తీవ్ర నష్టం మిఆగాల్చింది. చేతికి వచ్చిన పంట చేతికోచ్చె సమయంలో తడిసి ముద్దయింది. ఈదురు గాలులకు వరి పైరు నేలవాలగా పెట్టిన పెట్టుబడులు వచ్చేలా లేవని తమకు తృహత్య శరణ్యమని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని రైతన్నలు కోరుతున్నారు.ఆరుకాలం కష్టపడి పంటలు పండించిన రైతన్నలకు ఈ తుఫాన్ భారీ నష్టం తెచ్చింది.తుఫాన్ ప్రభావంతో గూడూరు మండల వ్యాప్తంగా అధిక వర్షం పడడంతో రైతన్నలకు సంబంధించిన వరి పత్తి మిరుప పంటలు పూర్తిగా నీటి మునిగి చేతికందే తెల్లబంగారం నీటిపాలైందని రైతులు కన్నీరు అవుతున్నారు. ప్రభుత్వం పంటలు నష్టపోయిన రైతన్నలను పర్యవేక్షించి అదెకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో సుమారు వందల ఎకారాలు పంట నేలపాలైందని రోడ్డు పక్కన అరపోసిన ధాన్యం నీటీలో కోట్టుకుపోయిందని రైతన్నలు ఆవేదన వ్యక్తిం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మరైతన్నలను ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని వాపోతున్నారు.

**పంట నష్టాన్ని ప్రభుత్వం భరించాలి**

**భానోత్ వసురాం దామర వంచ (గ్రామం)**

పంట నష్టాన్ని ప్రభుత్వం భరించాలి గూడూరు మండల దామర వంచ గ్రామానికి చెందిన భానోత్ వసురాం నాయక్ అన్నారు.గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం లో వరి పత్తి పంటలు వర్షార్పణం కాగా పంటలో కోల్పయిన రైతులు అందుకోవాలని అన్నారు. భానోత్ వసురాం నాయక్ మాట్లాడుతూ తాను రెండున్నర ఎకరాల పోలం వేయడం జరిగిందని భారీ వర్షానికి వరి పంట మొత్తం నేలకొరిగిందని మిషిన్ కూడా రాని పరిస్థితిలో ఉందని ఆవేదన వ్యక్తిం చేశాడు రాష్ట్ర ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

**పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇస్తా**

**గూడూరు వ్యవసాయ అధికారి అబ్దుల్ మాలిక్**

గత బుధవారం కురిసిన భారీ వర్షానికి మహబూబాబాద్ జిల్లా తో పాటు గూడూరు మండలలో పంట నష్టం జరిగిన ప్రాంతాలను వ్యవసాయ శాఖ అధికారి అబ్దుల్ మాలిక్ పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి నష్టపరిహారం వచ్చినా గూడూరు మండల పత్తి రైతుకు పంట నష్టం పరిహారం వచ్చేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## భారీ వర్షంలో వేగంగా విద్యుత్ పునరుద్ధరణ పనులు

ఎన్‌పిడిసిఎల్ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి



ప్రజాపక్షం/హనుమకొండ : నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలో మొంథా తుఫాను ప్రభావంతో దాదాపు 10 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, ఎక్కడ విద్యుత్ అంతరాయం లేకుండా, ముందస్తు జాగ్రత్త చ ర్యలు తీసుకొని రేయింబవళ్లు భారీ వర్షంలో పని చేసి విద్యుత్ సరఫరా పునరుద్దరించామని సంస్థ సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. ఇప్పటివరకు నీట మునిగిన 249 ట్రాన్స్ ఫార్మర్ లలో 246 సరిచేశామని, నీట మునిగిన సబ్ స్టేషన్‌లు 8 ఉండగా అందులో 6సబ్ స్టేషన్‌లు పునరుద్ధరించామని, మిగత 2 సబ్ స్టేషన్‌లకు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించామని సిఎండి పేర్కొన్నారు. 33 కెవి ఫీడర్లు 44 ప్రభావితం కాగా 44 పునరుద్ధరించామని, అలాగే 11 కెవి ఫీడర్లు 116 కు 116 పునరుద్ధరించామని చెప్పారు. 428 స్తంబాలు దెబ్బతిన్నాయని చెప్పారు. గత రెండు రోజులుగా వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పరిస్థితులను, పునరుద్ధరణ చర్యలను నేరుగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న సిఎండి, ఈ క్రమంలో శుక్రవారం హన్మకొండ డివిజన్ పరిధిలోని నీట మునిగిన గోపాల్ పూర్, యా దవ నగర్ సబ్ స్టేషన్‌లను సందర్శించారు. గోపాల్ పూర్, యాదవ నగర్ సబ్‌స్టేషన్ ప్రాంతాలకుప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా అందించామని తెలిపారు. తరచుగా నీట మునిగే సబ్ స్టే షన్ లను మార్చేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే 100 ఫీట్ రోడ్ లోని ప్రగతి నగర్ కాలనీలో పర్యటించారు. నేరుగా అక్కడ జరుగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులను పర్యవేక్షించారు. అనంతరం మచిలీ బజార్ సెక్షన్ లోని కాపు వాడలో జరుగుతున్న విద్యుత్ పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షించారు. భారీ వర్షంలో సైతం మెరుగైన , నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి ప్రతి ఒక్కరు ఆహర్నిశలు కష్టపడి పనిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించిన అందరికి సిఎండి అభినందనలు తెలిపారు. అలాగే అందరూ అ ప్రమతంగా ఉండాలని ఈ సందర్భాంగా సూచించారు. సిఎండి వెంట డైరెక్టర్ ఆపరేషన్ టి. మధుసూదన్, హన్మకొండ ఎస్ఈపి మధుసూదన్ రా వు, హన్మకొండ డిఈ సాంబరెడ్డి, దర్శన్ కు మార్, ఏడిఈ మల్లికార్జున్, ఏఈలు తదితరులు ఉన్నారు

## వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి

### జిల్లాకలెక్టర్ జితేష్ విపాటిల్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను స్ఫూర్తిగా తీసుకుని దేశ సమగ్రత అభివృద్ధి దిశగా యువత ముందుకు సాగాలని జిల్లాకలెక్టర్ జితేష్ విపాటిల్ పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ సర్దార్ 150 ఐక్యతా పాదయాత్ర కార్యక్రమాలను వివరించారు. పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని కేంద్రయువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో మై భారత్ సంస్థ సమన్వయంతో దేశవ్యాప్తంగా సర్దార్ 150 ఐక్యతా మార్చ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. దేశస మగ్రత, ప్రజా స్వామ్యవిలువలు, దేశ భక్తి భావాన్ని బలోపేతమే లక్ష్యంగా రూపుదిద్దుకున్నాయన్నారు. విద్యార్థుల్లో ఈ స్ఫూర్తిని పెంచేందుకు వ్యాస రచన, వాద వివాదాలు, సృజనాత్మక నిర్వహించనున్నట్లు పే ర్కొన్నారు. పార్లమెంట్ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు.

## రక్తదానం చేయటం.. ప్రాణదానంతో సమానం

### ఖమ్మం సిపి సునీల్ దత్

**ప్రజాపక్షం/నేలకొండపల్లి:** పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం నేలకొండపల్లి లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరం కు విశేష స్పందన లభించింది. ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్ శిబిరం ను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 1500 మంది రక్తదానం చేశారు. కార్యక్రమం ను విజయవంతం చేశారు. అవకాశం దొరికినప్పుడల్లా రక్తదానం చేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.



## నీటిపాలైన రైతు కష్టం

### ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అందించాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** నీటి పాలైన రైతు కష్టం, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్ట పరిహారం అందించాలని వైరా మాజీ శాసన సభ్యురాలు డాక్టర్ బానోత్ చంద్రవతి అన్నారు. శుక్రవారం సింగరేణి మండలంలోని సూర్యతండా గ్రామంలో ఆమె పర్యటించారు. ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా పంటలు పూర్తిగా నేలమట్టం కావడంతో తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆమె పరామర్శించారు. చేతి కొచ్చిన పంట కళ్లెదుటే నీటిపాలవ్వడంతో కన్నీరుమున్నీరవుతున్న రైతుల గోడును ఆమె స్వయంగా అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న వరి, పత్తి ఇతర పంట పొలాలను పరిశీలించి, రైతుల పరిస్థితిని చూసి చలించిపోయారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యం వల్ల రైతులు సర్వం కోల్పోయారని, వేల రూపాయలు పెట్టుబడి పెట్టి, కంటికి రెప్పలా కాపాడుకున్న పంట ఇలా నేలపాటు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు. వారిని చూస్తుంటే గుండె తరుక్కుపోతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో దెబ్బతిన్న పంటలపై సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేవలం ప్రకటనలకు హామీలకు పరిమితం కాకుండా నష్టపోయిన ప్రతి రైతుకు వెంటనే పంట నష్టపరిహారం అందించి, వారిని ఆదుకోవాలని, రైతులు అధైర్యపడొద్దు, మీకు న్యాయం జరిగే వరకు మీ పక్షాన పోరాడతానని రైతులకు భరోసా ఇచ్చారు.

## సిపిఐకి రూ.లక్ష రూపాయలు విరాళం అందించిన క్రైస్తవ సోదరులు



**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శతాబ్ది సంబరాల ముగింపు సందర్భంగా జరిగే భారీ బహిరంగ సభ ప్రదర్శనకు సంబంధించి క్రైస్తవ ప్రముఖులు లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. శుక్రవారం సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావుకు ఈ మొత్తాన్ని అందజేశారు. హేమంతరావు వారికి సిపిఐ ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సిపిఐ సెక్యులరిజం పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం పోరాడుతుందన్నారు. క్రిస్టియన్ ప్రముఖులు మాట్లాడుతూ సిపిఐ ప్రజా ఉద్యమాలను స్వాగతిస్తున్నామని నాయకత్వ స్థాయిలో సిపిఐ చేపట్టిన సామాజిక న్యాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. భవిష్యత్తులో సైతం ఇదే రీతి ఆదరణ కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కార్పొరేటర్ బిజి క్లెమెంట్, క్రిస్టియన్ ప్రముఖులు శేఖర్‌బాబు, విజయ్‌పాల్, కంటెపూడి జాన్సన్, జెట్టి సుధాకర్, జాసన్, సంజీవరావు, మార్టిన్, జొన్నలగడ్డ వెంకటరత్నం పాల్గొన్నారు.

## హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/ఇల్లందు:** హమాలీలకు ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టియు అనుబంధ తెలంగాణ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కొక్కుసారంగపాణి, ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండి రాసుద్దీన్, హమాలీ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శ్రీనివాస్, ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు నరాటి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇల్లందు మండల పరిధిలోని ముకుందాపురం క్యాం సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఏరియా హమాలీల జనరల్ బాడీ లో వారు పాల్గొని మాట్లాడుతూ నిత్యం బరువులు మోసే హమాలీల పట్ల పాలకులు చిన్న చూపు చూస్తున్నారని విమర్శించారు. పెరిగిన నిత్యవసర సరుకుల ధరలకు అనుగణంగా రేట్ల పెంపుదలకు వ్యాపారస్తులు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ హమాలీ, మిల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు తొండల సర్వయ్య అధ్యక్షతన జరిగినఐలు ఉప్పలయ్య, పూణేం లక్ష్మ ణ్, చిత్తారి వెంకన్న, కోరం నాగేష్, జయరాం సురేష్, ఆంగోత్ నరేష్, మూతి కోటేష్, కల్తి రామ్మూర్తి, సనప రవీందర్, వజ్జ శ్రీకాంత్, కల్తి శ్రీకాంత్, మోహన్, గుగులోత్ అజయ్, పాల్గొన్నారు.

## మాజీ ప్రధాని ఇందిరమ్మ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** దివంగత ప్రధాని, అఖిల భారత కాంగ్రెస్ నాయకురాలు ఇందిరా గాంధీ 41వ వర్ధంతి సందర్భంగా అశ్వాపురం మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ కార్యాలయం ఓరుగంటి వీరయ్య భవన్ నందు ఇందిరమ్మ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మండల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు ఓరుగంటి బిక్షమయ్య మాట్లాడుతూ ప్రధానిగా ఇందిరమ్మ సేవలు వెలకట్టలేనివన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన నేత ఇందిరమ్మ అన్నారు. ఉక్కు మహిళగా ప్రపంచ దేశాలలో కీర్తించిన ఘనత తనకే దక్కుతుందని తెలిపారు. భారత జాతి గర్వించదగిన పాలన చేసిందన్నారు. ఈకార్యక్రమంలో సీనియర్ నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, బచ్చు వెంకటరమణ, తోట సత్యనారాయణ, బరాజు సంపత్, గాదె ప్రతాప్‌రెడ్డి, గిద్దే నరసింహారావు, బూతం వెంకన్న, నేలపట్ల వీరారెడ్డి, భూక్యా కాళిదాసు, కోలా శశికాంత్, కుంజా జాను, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడేందుకు

# చేపల పెంపకం దోహదం

### జల వనరులు నిత్యం సజీవంగా ఉండేలా అధికారుల పర్యవేక్షణ అవసరం

### చెరువులో 74,100 చేప పిల్లలు విడుదల చేసిన ఎమ్మెల్యే కూనంనేని

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** గ్రామీణ ప్రజల ఆర్థిక వ్యవస్థ బలపడేందుకు చేపల పెంపకం దోహద పడుతుందని, సొసైటీలుగా ఏర్పడి గ్రామీణ ప్రాంతాల్లో చేపల చెరువులను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదిగేందుకు ముందుకురావాలని కొత్తగూడెం ఎమ్మెల్యేకూనంనేని సాంబశివరావు కోరారు. సుజాతనగర్ మండలంలో సింగభూ పాలెం చెరువులో మత్స్యశాఖ మంజూరు చేసిన 74,100 చేప పిల్లలను శుక్రవా రం ఆయన చెరువులోకి విడుల చేశారు. జీవనాధారంగా నిలుస్తాయని, చేపల పెంపకం ద్వారా రైతులు, మత్స్యకారులు ఆర్థికంగా బలపడతారన్నారు. ప్రతీ చెరువును సజీవంగా ఉండేలా సంబంధిత శాఖలఅధికారు లు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలన్నారు. చేపల పెంపకం ద్వారా ఆర్థిక తోడ్పాటు మా త్రమే కాకుండా వాతావరణ సమతుల్యతకు ప ర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందన్నారు. స్థానికమత్స్యకార సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. చెరువుల సంరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు . గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని విస్తరించాలని, ప్రభుత్వం అధికారులు చేపల ఆహారం విత్తనాల సరఫరాపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతో చెరువులను అభివృద్ధి చేసి స్థిరమైన ప్రగతి సాధించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. మత్స్యశాఖ జిల్లా అధికారి అహ్మద్ ఇంథియాజ్ ఖాన్, కార్పోరేషన్ కమీషనర్ సు జాత, తహశిల్దార్ కృష్ణ ప్రసాద్, ఎంపిడిఓ భా రతి, వ్యవసాయాధికారిని నర్మద, పలుశాఖల అ ధికారులు, కిషన్, శ్రీనివాస్, నాగేశ్వరరావు రమాదేవి కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, మండే హనుమంతరావు, సిపిఐ జిల్లా నాయకులు సలిగంటి శ్రీనివాస్, భూక్యాధస్రు, హనుమంతరావు, రాములు, మత్స్య సొసైటీ నాయకులు బానోత్ సూర్య, శైలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



## పటేల్ చూపిన మార్గంలో ముందుకు సాగాలి

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన మార్గంలో ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అన్నారు. పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు ఆధ్వర్యంలో కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి పోస్టాఫీస్ సెంటర్ వరకు రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో ఎస్పి రోహిత్ రాజ్‌తో పాటు పాల్గొన్నారు. అనంతరం ఎస్పితో కలిసి కలెక్టర్ మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటంలో ఉక్కు మనిషిగా పిలుచుకునే పటేల్ కృషి ప్రతీ ఒక్కరికీ ఆదర్శం అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయంగా భారతదేశంలో జరుగుతున్న కుట్రలను తిప్పి కొట్టడంలో ప్రజలంతా సమైఖ్యంగా పోరాడాలని పిలునిచ్చారు. యువత ఆలోచనలు, దేశానికి ఉపయోగపడేలా మలుచుకుని లక్ష్యాలను నిర్ధేషించుకోవాలని పిలుపునిచ్చారు. భారత దేశంలో సంస్థానాలను విలీనం చేసి దేశంలోని ప్రజలంతా ఐక్యతతో జీవించేలా వల్లభాయ్ చేసిన కృషికిగుర్తుగా ఆయన పుట్టిన రోజును జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. పోలీస్ అధికారులు నరేందర్, కమాండెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, రెహమాన్, మల్లయ్య స్వామి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తుపాను ప్రభావానికి దెబ్బతిన్న వరి పంటలు

### పరిశీలించిన సిపిఐ(ఎం) పార్టీ బృందం



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మొంథా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మిర్చి పత్తి పంటలను సిపిఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు శుక్రవారం పరిశీలించారు. తుపా ను ప్రభావంతో రైతులు పూర్తిగా నష్టపోయారని రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరి, పత్తి, మిరప, వరి పంటలను క్షేత్రస్థాయిలో సిపిఎం పార్టీ బృందం పరిశీలించి రైతులతో మాట్లాడారు. రావుల రాజబాబు, సిపిఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కోలికపోవు సర్వేశ్వరరావు, రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు, భాస్కర్, రాము, వెంకటేష్ రావు, మహేష్ పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం పోరాడే సంఘం ఎఐటియుసి

**ప్రజాపక్షం/వైరా:** భారతదేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వతంత్రం కావాలని మొట్టమొదటిసారిగా నినదించిన సంఘం కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే సంఘం ఏఐటియుసి అని జిల్లా నాయకులు యర్రా బాబు అన్నారు. నేటికి ఏఐటియుసి పుట్టి 106 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా వైరా రింగు రోడ్డు సెంటర్ నందు ఏఐటియుసి పతాకావిష్కరణ ఏఐటియుసి మండల కార్యదర్శి జిల్లా నాయకులు గారపాటి అశోక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా సిపిఐ నాయకులు యర్రా బాబు ఆనాడు గనుల్లో ఖర్జానాల్లో కార్మికులకు 8గంటల పని దినాలు కావాలని పోరాడి సాధజంచుకున్న సంఘం అని అన్నారు. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రభుత్వ సంస్థలను ప్రైవేటుపరం చేస్తూ కార్మికుల హక్కుల కోసం ఉన్న చట్టాలను రద్దు చేస్తూ పాల్పడుతుందని విమర్శించిన భవిష్యత్తులో కార్మికుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా భారత మాజీ పార్లమెంటు సభ్యులు ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గురుదాస్ గుప్తా వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి యామాల గోపాలరావు, ఏఐటియుసి నాయకులు మూట కొండ, తేల్లపుట్ట రాంబాబు, ఏర్పుల ఆంద్రం, ఇనపనూరి ముత్తయ్య, అక్కిశెట్టి రామకృష్ణ, పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.



## కార్మికుల హక్కుల పరిరక్షణ ఎఐటియూసి ధ్యేయం

### బ్రాంచ్ కార్యదర్శి వై. రాంగోపాల్

**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రభుత్వ రంగ సం స్థల రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ ఏఐటియూసి ధ్యేయం అని బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్ అన్నారు. శుక్రవారం మణుగూరు పివి కాలనీ కేవిల్ మహేంద్ర భవన్ వద్ద 106 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు.దేశ స్వాతంత్రం కోసం ఆనాడు కార్మిక వర్గం అంతా ఏకమై 1920 అక్టోబర్ 31న బొంబాయి నగరంలో లాలా లజపతిరాయ్, ఎంఎన్ జోషి నాయకత్వంలో మొదటి ఏఐటీయూసీ మహాసభ జరిగిందని అన్నారు. దేశ స్వాతంత్రం, కార్మికుల హక్కుల కొరకు ఆనాటి నుండి నేటి వరకు అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించి దేశ కార్మిక వర్గానికి పని గంటల విధానం, వేతన ఒప్పందం, రక్షణ, ఇన్సూరెన్స్, ప్రాఫ్, గ్రాడ్యుటి, ప్రమాద బీమా పథకం, పెన్షన్ స్కీం ఇలా అనేక హక్కులు పోరాడి సాధించుకున్న చరిత్ర ఏఐటియుసిది అని అన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర గల ఏఐటీయూసీలో పనిచేయడం గర్వకారణం అని అన్నారు. సింగరేణిలో ఏఐటియుసి ఆధ్వర్యంలో అనేక హక్కులు కార్మిక వర్గం పోరాడి సాధించుకుందన్నారు. సింగరేణిలో ఏఐటీయూసీ సాధించి పెట్టిన బోనస్ చట్టం దేశవ్యాప్తంగా కార్మికులకు అందరికీ వర్తించిందని అన్నారు. లాభాలలో వాటా దేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలో లేని హక్కును ఏఐటీయూసీ సాధించిందని అన్నారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసి నాలుగు చట్టాలుగా చేయాలని చుస్తుందని, దీని రద్దుకై కార్మిక వర్గం అంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సింగరేణి సంస్థ రక్షణకు కార్మికుల హక్కుల ఏఐటీయూసీ ధ్యేయం అని అన్నారు. వైస్ ప్రెసిడెంట్ ఎంవి రాంనర్సయ్య అధ్యక్షతన జరిగిన బ్రాంచ్ ఆఫీస్ బేరర్ లు ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, సెంట్రల్ కౌన్సిల్ నెంబర్ దాట్ల సందీప్, ఫిట్ సెక్రటరీలు శనిగరపు కుమారస్వామి, సాయి ప్రకాష్ చారి, సీనియర్ కార్యకర్తలు మన్నెం యోహాన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## కారేపల్లిలో ఘనంగా 106వ ఆవిర్భావ దినోత్సవం

### ఎఐటియుసి జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు శివరామకృష్ణ



**ప్రజాపక్షం/కారేపల్లి:** 106 సంవత్సరాల సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీ అని ఏఐటియూసి జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షులు రావి శివరామకృష్ణ అన్నారు. శుక్రవారం కారేపల్లి మండల కేంద్రం, క్రాస్ రోడ్, సీతారాంపురం, మాదారం డోలమైడ్ ప్రాంతాల్లో ఏఐటియూసి 106 ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కారేపల్లి క్రాస్ రోడ్‌లో ఆటోయూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ దేశంలో అనాడు వెట్టిచాకిరి కి దోపిడీకి వ్యతిరేకంగా, దేశ స్వాతంత్రం కోసం ఆనాడు ఐక్యంగా బొంబాయి నగరం లో 19 20 అక్టోబర్ 31 న ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూ సీ) లాలా లజపతిరాయి, ఎంఎన్ జోషి నాయకత్వం లో మొదటి మహాసభ జరిగిం ది. అనాటి నుండి నేటి వరకూ ఏఐటీయూసీ నాయకత్వం లో అనేక పోరాటాలు ఉద్యమాలు నిర్వహించుకుని, కార్మికులకు పని గంటలకు, వేతన ఒప్పందం,రక్షణ,ఇన్స్యూరెన్స్, పీఎఫ్ గ్రాడ్యుయేట్, ప్రమాద బీమా పథకం, పెన్షన్ స్కీమ్ ఇలా అనేక కార్మిక చట్టాలను సాధించుకున్న చరిత్ర ఏఐటీయూసీ ది అన్నారు. సుదీర్ఘ పోరాటాల చరిత్ర కలిగిన సంఘం ఏఐటీయూసీలో పనిచేయటం గర్వకారణమన్నారు. ఎన్నో పోరాటాలు ఉద్యమాలు చేసి సాధించుకున్న 44 చట్టాలను కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం రద్దు చేసి, 4 చట్టాలను చేయాలని చూస్తుందని, దీనిని కార్మికులు ఐక్యము గా ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.సిపిఐ మండల కార్యదర్శి పాపినేని సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు ఉంగరాల సుధాకర్, సిపిఐ సీనియర్ నాయకు లు తాతా వెంకటేశ్వర్లు, మండల సహాయ కార్యదర్శి చెన్నం శెట్టి భూషయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పుచ్చకాయల శ్రీనివాసరావు, సిపిఐ నాయకులు వడ్డే వెంకటయ్య, బొమ్మల కృష్ణ, అమీర్ జానీ ఆటో యూనియన్ నాయకులు బట్టు శ్రీనివాస్, చిప్పలపల్లి సాగర్, వీరయ్య, జి రవి, కంసాని ఉపేందర్, ఎస్ కృష్ణమూర్తి, వై శ్రీను, రేఖ ప్రసాద్, సందీప్, బాలు, సతీష్, పాల్గొన్నారు.

## సమస్యలకు నిలయంగా ఏకలవ్యలు

### విద్యార్థుల పరిస్థితి అయోమయం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** సమస్యలకు ని యంగా ఏకలవ్యలు ఉన్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వరక అజిత్ అన్నారు. శుక్రవారం స్థానిక ములకలపల్లి మండలం ముఖమామిడి గ్రామంలో గల ఈఎమ్ఆర్ఎస్ ఏకలవ్య మోడల్ పాఠశాలలో విద్యార్థులు సమస్యలతో సతమవమవుతూ గత మూడు రోజుల నుండి మంచినీటి సౌకర్యం లేక అవస్థలు పడుతున్న పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు స్పందించకుండా విద్యార్థుల్ని అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం విద్యార్థులు తమ కాల కృత్యాలను వెళ్ళడానికి కూడా నీటి సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రతిష్టాత్మకంగా కొన్ని కోట్ల రూపాయలను వెచ్చించి విశాలాంతమైన ప్రాంతంలో నూతన బిల్డింగ్ నిర్మించిన కనీస వసతులు లేకుండా ఒక నిర్థిష్టమైన ప్రణాళిక లేకుండా ఏకలవ్య పాఠశాల నిర్మించి, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న పట్టించుకునే నాథుడే లేదని ఆరెపించారు. బాషా రాణి ఉపాధ్యాయులుగా నార్త్ ఇండియా నుండి నియమించి తెలంగాణ రాష్ట్ర బాషా సాంస్కృతి విధానాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిస్థితులు ఇక్కడ ప్రజల జీవన విధానాన్ని ఇక్కడ విద్యార్థుల యొక్క బాషా నైపుణ్యాన్ని తెలుసుకోకుండానే కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని, ఏకలవ్యాల్లో ఒక నిర్థిష్టమైన ప్రణాళికలను దానికి తగిన విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ములకలపల్లి మండలంలో గల ఏకలవ్య పాఠశాల ఉపాధ్యాయుల యొక్క తీరు చాలా ఇబ్బందికరమైన వాతావరణంగా చదువుని చెప్పాల్సినటువంటి గురువులే గిరిజన విద్యార్థులని చిన్న చూపు చూస్తూ వాళ్ల తల్లిదండ్రులను సైతం అవమాన పరుస్తూ వ్యవహరిస్తున్నటువంటి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని, ఏకలవ్యలో ఉన్నతాధికారి ఆర్‌సిఓ అరుణకుమారి స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొని పోయి తెలంగాణ ఉన్నటువంటి 23 ఏకలవ్యాల్లో హిందీ ఇంగ్లీష్ భాషా నైపుణ్యం ఉన్న స్థానిక ఉపాధ్యాయుల్ని నియమించాలని కోరారు. ఈకార్యక్రమంలో నాయకులు మనోజ్, సన్నీ, బన్నీ, వికాస్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులు, ఉద్యోగుల హక్కుల సాధనలో ఎఐటియుసి కృషి మరువలేనిది



**ప్రజాపక్షం/ మధిర :** దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు అనుభవించే ప్రతి హక్కు ఎఐటీయూసి కృషి, పోరాట ఫలితమేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.ఎ.రహీం అన్నారు. శుక్రవారం సిపిఐ అనుబంధ సంఘం ఎఐటియూసి 106వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మధిరలో ఘనంగా జరిగాయి. ఎఐటియూసి దినోత్సవాన్ని పురస్కరించుకుని మధిర పట్టణంలోని ఆర్‌వి కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఎఐటీయూసి జెండాని ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం మధిర డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎంఎ రహీం మాట్లాడుతూ పని భద్రత, కనీస వేతనాలు అమలు చేయడం పాలకులు, యజమానుల బాధ్యత అని, ఈ బాధ్యతను విస్మరించి పాలనా సాగిస్తున్నారని అన్నారు. పారిశ్రామిక వేత్తలకు కేంద్రంలోని మోడీ సర్కార్ ఊడిగం చేయడం మినహా ఈ దేశ ప్రజలకు, కార్మిక వర్గానికి చేసింది శూన్యమని అన్నారు. కార్మికులు సమిష్టి ఉద్యమాలు, పోరాటాలతో తమ హక్కులను కాపాడుకోవాలని, నూతన హక్కులను సాధించుకోవాలని, అందుకు కార్మికులను, ఉద్యోగులను చైతన్యవంతం చేసే బాధ్యత ఎఐటీయూసి నాయకులు, కార్యకర్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పెరుమాళ్ళపల్లి ప్రకాశరావు, ఎఐటీయూసి మండల కార్యదర్శి ఊట్ల రామకృష్ణ నాయకర్, ఎస్కే కొండ, యూనియన్ నేతలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు తక్షణం అమలు చేయండి

### ఎఒకు మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అ మలు చేస్తున్న మధ్యాహ్న భోజనానికి సంబంధించి తక్ష ణం బిల్లులు చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సమర్పించారు. రామాంజనేయులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలోని 11 40 ఏజెన్సీలలో 2090 మంది మధ్యాహ్న భోజన కార్మికులకు ఆరు నెలలుగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన తెలిపారు. గత ప్రభుత్వం అల్పాహారం బిల్లులను సైతం చెల్లించలేదని ఆయన ఆరోపించారు. కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు, మెనూ ఛార్జీలను తక్షణమే చెల్లించాలని లేని పక్షంలో రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని ఆయన తెలిపారు. మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి లక్ష్మి, గుండెపొంగు మల్లేష్, యూనియన్ బాధ్యులు మహదేవ లక్ష్మి, షేక్ రహీమున్నీసా, కృష్ణకుమారి, రామారావు, వెంకటమ్మ, జక్కంపూడి వెంకటలక్ష్మి, ఇజ్జగాని వెంకటమ్మ, బండి నర్సమ్మ, సీత, సిహెచ్ సత్యవతి, రాజ్యలక్ష్మి, శ్రీలక్ష్మి, జరీనా, కృష్ణకుమారి, లక్ష్మి, లక్కీ, సరస్వతి పాల్గొన్నారు.



# క్రీడ

## పొట్టి సిరీస్‌లో ఆస్ట్రేలియా బోణీ!





ఆసియా కప్ ఛాంపియన్‌గా తొలి టీ20 సిరీస్ ఆడుతున్న భారత్‌కు ఆస్ట్రేలియా షాకిచ్చింది. తొలి టీ20 వర్షార్పణం కాగా రెండో టీ20లో విజయంతో బోణీ కొట్టాలనుకున్న టీమిండియాకు చెక్ పెట్టింది. హేజిల్‌వుడ్ (3–13) విజృంభణతో ప్రధాన బ్యాటర్లు చేతులెత్తేయగా.. ఓపెనర్ అభిషేక్ శర్మ (68), హర్షిత్ రానా(37) అర్ధ శతకంతో పోరాడగలిగే స్కోర్ అందించాడు. మిచెల్ మార్ష్(46) మెరుపులతో విజయానికి చేరువైన ఆసీస్‌ను ఆఖర్లో జస్ప్రీత్ బుమ్రా(2–26) వరుస వికెట్లతో భయపెట్టాడు. కానీ, ఆ తర్వాతి ఓవర్లో మార్కస్ స్టోయినిస్(6 నాటౌట్) రెండు పరుగులు తీయగా ఆతిథ్య జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో టీ20 సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. వన్డే సిరీస్ కోల్పోయిన భారత జట్టు పొట్టి సిరీస్‌ను ఓటమితో ఆరంభించింది. తొలి మ్యాచ్ వరుణుడి ఖాతాలో చేరి వన్డే సిరీస్ చేజారినా పొట్టి కప్‌ను పట్టేయాలనే కసితో ఉన్న టీమిండియాను ఆస్ట్రేలియా 130లోపు కట్టడి చేసింది. స్వల్ప లక్ష్యాన్ని ఆడుతూపాడుతూ ఛేదించిన ఆసీస్ టీ20 సిరీస్‌లో ఘనంగా బోణీ కొట్టింది. వన్డేల్లో భారత్‌ను దెబ్బకొట్టిన జోష్ హేజిల్‌వుడ్ (313) సంచలన బౌలింగ్‌తో టాపార్డర్‌ను కూప్పకూల్చాడు. 49 పరుగులకే ఐదు వికెట్లు పడిన వేళ ఓపెనర్ అభిషేక్ శర్మ(68), హర్షిత్ రానా(37)లు జట్టును ఆదుకున్నారు. కానీ, గ్జావియర్ బార్ట్‌లెట్ ఓవర్లో రానా ఔట్ కాగా.. అర్ధ శతకంతో జోరు మీదున్న అభిషేక్‌ను నాథన్ ఎల్లిస్ వెనక్కి పంపాడు. ఆ తర్వాత శివం దూబే(4) నిరాశపరచగా బుమ్రా రనౌట్ కావడంతో టీమిండియా 125 పరుగులకే ఆలౌట య్యింది.

### హాఫ్ సెంచరీ భాగస్వామ్యం

టీమిండియాకు కట్టడి చేసిన ఆస్ట్రేలియా దూకుడుగా ఇన్నింగ్స్ ఆరంభించింది. ఓపెనర్లు ట్రావిస్ హెడ్ (46), మిచెల్ మార్ష్(28)లు ధనాధన్ ఆటతో స్కోర్‌బోర్డును ఉరికించారు. పవర్ ప్లే పూర్తికాకముందే హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి గట్టి పునాది వేశారు. ఎడాపెడా దంచేస్తున్న హెడ్‌ను వరుణ్ చక్రవర్తి ఔట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ.. జోష్ ఇంగ్లిస్ (20) జతగా మార్ష్ చెలరేగిపోయి లక్ష్యాన్ని కరిగించాడు. భారీ సిక్సర్లు బాదుతున్న మార్ష్‌ను కుల్దీప్ యాదవ్ బోల్తా కొట్టించాడు. కాసేపటికే హిట్టర్ టిమ్ డేవిడ్(1)ను వరుణ్ రిటర్న్ క్యాచ్‌తో వెనక్కి పంపాడు. అప్పటికీ విజయానికి 27 రన్స్ కావాలంతే.

మరో వికెట్ పడకుండానే లక్ష్యాన్ని అందుకునేలా కనిపించిన ఆసీస్‌ను కుల్దీప్, బుమ్రా దెబ్బకొట్టారు. ఇంగ్లిస్‌ను కుల్దీప్ ఎల్బీగా ఔట్ చేసినా.. మిచెల్ ఓవెన్(14) క్రీజులో ఉండడంతో అతడే మ్యాచ్‌ను ముగిస్తాడని ఆతిథ్య జట్టు భావించింది .. కానీ, బుమ్రా 13వ ఓవర్లో వరుస బంతుల్లో ఓవెన్, మాథ్యూ షార్ట్(0)లను ఔట్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. కానీ.. బార్ట్‌లెట్ హ్యాట్రిక్‌ను అడ్డుకున్నాడు. ఆ తర్వాత కుల్దీప్ ఓవర్లో రెండు రన్స్ తీసిన స్టోయినిస్(6 నాటౌట్) లాంఛనం పూర్తి చేశాడు. మరో 30–40 రన్స్ చేసి ఉంటే.. లేదా పవర్ ప్లేలో ధారాళంగా పరుగులు ఇవ్వకపోయి ఉంటే కచ్చితంగా టీమిండియాకు అవకాశాలు ఉండేవి ఇరుజట్ల మధ్య మూడో టీ20 నవంబర్ 2 ఆదివారం రోజున జరుగనుంది.

## ఆమె అద్భుతం..

### ఆసీస్ మీడియా మనసు దోచిన జెమీమా



సాధారణంగా ఆస్ట్రేలియా ఓడిపోతే ప్రత్యర్థి జట్టు, ఆటగాళ్లపై ఆ దేశ మీడియా అక్కసు వెళ్లగక్కుతుంది. ఇందుకు ఎన్నో ఉదాహరణలు. భారత పురుషుల జట్టు బోర్డర్ గావస్కర్ ట్రోఫీలో గెలిచినా.. యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్ మంచి ప్రదర్శన చేసినా ఏదొక కారణం చూపుతూ ఆసీస్ ఓటమిని తక్కువ చేసి చూపించేవి. కానీ, ఈసారి మాత్రం అలా కాదు. ఆ దేశ మీడియా పతాక శీర్షికల్లో టీమ్‌ఇండియా మహిళా బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌పై ప్రశంసల వర్షం కురిపించాయి. ఇక తమ జట్టు కెప్టెన్ ఎలీసా హీలీపై విమర్శలు చేశాయి. జెమీమా ఇచ్చిన క్యాచ్‌ను చేజార్చడం వల్లే తమ జట్టు ఓడిపోయిందని అందులో పేర్కొన్నాయి.

### స్టన్నింగ్ ఇన్నింగ్స్..

ఆస్ట్రేలియా నిర్దేశించిన 339 పరుగుల లక్ష్య ఛేదనలో భారత్ మరో 9 బంతులు మిగిలి ఉండగానే విజయం సాధించింది. జెమీమా రోడ్రిగ్స్ 127 పరుగులతో అజేయంగా నిలిచింది. ఆసీస్ మీడియా ఏబీసీ న్యూస్ జెమీమా ప్రదర్శనను అభినందిస్తూ 'స్టన్నింగ్ ఇన్నింగ్స్. అద్భుతమైన లక్ష్య ఛేదన' అంటూ కామెంట్ చేసింది. ఇక ఫాక్స్ క్రికెట్ కూడా జెమీమాను అభినందిస్తూనే ఎలీసా హీలీని విమర్శించింది. 'ఆస్ట్రేలియా వరల్ కప్ నుంచి నిష్క్రమించడానికి ప్రధాన కారణం క్యాచ్‌లు డ్రాప్ చేయడమే. రికార్డు లక్ష్య ఛేదనలో జెమీమా జీవితకాలం గుర్తుండిపోయే ఇన్నింగ్స్ ఆడింది'' అని కథనాల్లో పేర్కొంది. 'గుడ్ మార్నింగ్ ఆస్ట్రేలియా. భారత్ అద్భుతమైన రన్ ఛేజింగ్‌తో వరల్ కప్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ కథ ముగిసింది' అని పోస్టు పెట్టింది.

# ఫోకస్ సైన్స్


## గురుత్వాకర్షణపై కొత్త సిద్ధాంతం!




ఇప్పటి వరకూ అందరూ గుర్తించిన గురుత్వాకర్షణ శక్తికి యూనివర్సిటీ ఆఫ్ పోర్ట్స్‌మౌత్ భౌతికశాస్త్రవేత్త మెల్విన్ వాప్సన్ కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నాడు. ఆయన వాదనను అనుసరించి గురుత్వాకర్షణ అనేది కేవలం వస్తువులను ఆకర్షించే శక్తి మాత్రమేకాదు.. అది విశ్వం సంగ్రహిస్తున్న సమాచారాన్ని నిర్వహించేందుకు ఉపయోగించే ఒక గణనాత్మక (computational) ప్రక్రియ. వాప్సన్ సిద్ధాంతంలో, ప్రతి పరమాణువు ఒక డిజిటల్ బిట్ లాంటి స్పేస్‌టైమ్ పిక్సెల్‌ను నింపే సమాచార అణువుగా పనిచేస్తుంది. ఒకే పిక్సెల్‌లో చాలా పరమాణువులు చేరితే, కంప్యూటర్‌లో ఫైల్‌ను కంప్రెస్ చేసే విధంగానే, గురుత్వం వాటిని ప్రాథమికమైన, సరళమైన నిర్మాణంగా కుదించేస్తుంది. అంటే దత్తాంశ సంరక్షణ కార్యక్రమం సాగుతోంది. ఇక ఆయన ప్రతిపాదించిన రెండో సూత్రం 'ఇన్ఫోడైనమిక్స్'. ఇది వాప్సన్ అభివృద్ధి చేసిన సమాచార వ్యవస్థ పరిణామం గురించి వర్ణించే నూతన మూల సూత్రం. ఇందులో సమాచార ఏకాంత వ్యవస్థల్లో ఏర్పడే స్థూల డేటా తగ్గిపోతూ ఉంటుంది. ఇది స్థిరంగా ఉండదన్నది వాప్సన్ అభిప్రాయం. దీని వల్ల విశ్వం నిర్బంధంగా అనిశ్చితిని పెంచడమేగాక, అపరమిత దత్తాంశాన్ని బహుళంగా క్రమబద్ధీకరించే ప్రక్రియ అని అర్థమవుతుంది. ఈ పద్ధతిలో, గురుత్వం అనేది ఒక వ్యవస్థాపిత హౌస్‌కీపింగ్ విధానంలా పని చేస్తుంది. విశ్వం స్పేస్‌టైమ్‌ను ప్రాప్యత, సామర్థ్యం, సమాచార మార్గీకరణ వంటి గణనాత్మక పనులు చేస్తూ పరిరక్షిస్తోంది. ఈ సిద్ధాంతం ప్రకారం, గురుత్వం అనేది వివిధ అణువులు, వస్తువులు, రంగులో నమోదైన సమాచారాన్ని తగ్గించడానికి జరుగుతున్న కంప్రెషన్ చర్య. ఇది ఉహాజనిత సిద్ధాంతమే అయినప్పటికీ, గురుత్వం, క్వాంటం సమాచారం, బ్లాక్ హోల్ థెర్మోడైనమిక్స్, డార్క్ మ్యాటర్, డార్క్ ఎనర్జీ, వ్యవస్థాపక ప్రాముఖ్యత మధ్య కొత్త సంబంధాలను సూచిస్తుంది. కంప్యూటర్ శాస్త్ర నియమాలతో కూడిన విశ్వ విచిత్ర పనితీరు, కేవలం భావ పరంగా కాదు, వాటిని పరిశీలించేందుకు, గణిత, అనుకరణ, ప్రయోగవిజ్ఞానం ఆధారంగా పరిశోధన కొనసాగడానికి ఉపయోగపడుతుంది. ఈ విధంగా, గురుత్వం ఒక స్వయంకల్పింత సమాచార నియంత్రణ విధానంగా, అసలైన భౌతిక అర్థాన్ని మించిపోయే డిజిటల్ లాజిక్‌లో విశ్వం నడుస్తోంది అని వాప్సన్ సిద్ధాంతం అంటోంది. మనం అధిక సమాచారం, కంప్రెషన్, లాజికల్ నిర్మాణాలు విశ్వం ఎలా నడుస్తుందో తెలుసుకునే కొత్త దశకు ప్రయాణిస్తున్నామని ఈ సూత్రం సూచిస్తున్నది.

## విశ్వ విస్తరణకు కళ్లెం!


'బిగ్ బ్యాంగ్'తో విశ్వ మొదలైందనేది ఇప్పటి వరకూ శాస్త్రవేత్తలు నమ్ముతున్న సిద్ధాంతం. అయితే, ఈ సృష్టికి తెరపడుతుందని, నిరంతరం వ్యాపిస్తున్న విశ్వం ఒక్కసారిగా కుదించుకుపోతుందని 'బిగ్ క్రంచ్' సిద్ధాంతం పేర్కొంటున్నది. దీనిని అనుసరించి, భవిష్యత్తులో విశ్వం అతి విచిత్రమైన కాల గమనంలో కదులుతుంది. ఫలితంగా డార్క్ ఎనర్జీలోకి కుప్పకూలుతుంది. మొత్తం విశ్వం జీవితం సుమారు



33 బిలియన్ సంవత్సరాలు అని ఈ విశ్లేషణ అంచనా వేస్తున్నది. ఇప్పటివరకు ఈ సృష్టి కాలం సుమారు 13.8 బిలియన్ సంవత్సరాలు అనుకుంటే, ఇంకా సుమారు 19 బిలియన్ సంవత్సరాలు మిగిలి ఉంటుంది. అప్పటి వరకూ విశ్వం అనంతంగా విస్తరిస్తునే ఉంటుంది. ఈ విస్తరణకు ఒక దశలో ముగింపు తప్పదు. అప్పుతు వేగవంతమైన సంకోచానికి గురవుతుంది. ఈ స్థితిని 'బిగ్ క్రంచ్'గా పేర్కొంటున్నారు. కాలచక్రంలో ప్రారంభం, ఎదుగుదల, పతనం ఎలా కొనసాగుతాయో, అదే రీతిలో విశ్వం మొదలైంది. కొనసాగుతున్నది. భవిష్యత్తులో పతనమై, ముగుస్తుంది. 'బిగ్ బ్యాంగ్'తో విస్తరణం... 'బిగ్ క్రంచ్'తో కుదింపు.. వెరసి విశ్వం మొదలు... అంతం. ఇదే ఈ సిద్ధాంతాల సారాంశం.

## కేబుల్స్ ద్వారా కాంతి ప్రసారం!

ఆశ్చర్యం గొలిపే ప్రయోగంలో అమెరికన్ శాస్త్రవేత్తలు కేబుల్స్ ద్వారా కాంతిని ప్రసారం చేసి, ఓ అద్భుతాన్ని ఆవిష్కరించారు. ఇంటర్నెట్ కేబుల్స్ ద్వారా 30 కిలోమీటర్ల దూరానికి, క్వాంటం స్టేట్ ఆఫ్ లైట్‌ను పంపించారు. కేబుల్స్ ద్వారా కాంతిని పంపడం ప్రపంచంలో ఇదే మొదటిసారి. ఈ ప్రయోగాన్ని ఆన్‌లైన్ ట్రాఫిక్ సాగే సాధారణ ఇంటర్నెట్ ఫైబర్ కేబుల్స్‌లో, క్వాంటం కంకణాలతో సహజంగా కలిసి, క్వాంటం గుణాలకు భంగం లేకుండా కాంతి ప్రయాణానికి అనువైన పరిస్థితులు సృష్టించారు. దీనినే 'టెలిపోర్టేషన్'గా పిలుస్తారు. ప్రత్యేకమైన కొత్త మౌలిక సదుపాయాలు లేకుండా ప్రస్తుత ఇంటర్నెట్ ఫైబర్ సౌకర్యాలను ఉపయోగించి క్వాంటం సంభాషణ సాధ్యమవుతుందని శాస్త్రవేత్తలు నిరూపించారు. ఈ ఆవిష్కరణ సాధారణంగా కనిపించినప్పటికీ, దీని ప్రభావం చాలా గొప్పగా ఉండబోతుంది. సమాచార రంగంలో విప్లవాత్మక మార్పులకు ఈ ప్రయోగం శ్రీకారం చుట్టింది.



# కార్మికవర్గ పోరాటంలో ఎఐటియుసిది అజరామర చరిత

### ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం


భద్రాద్రి...



నల్లగొండ...


నిజామాబాద్...

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కార్మిక వర్గ పోరాట చరిత్రలో ఎఐటియుసిది అజరామరమైన అధ్యాయం అని, స్వాతంత్ర సమరంలోనూ, ఆ తర్వాత కార్మిక హక్కుల కోసం సాగిన ప్రతీ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిందని సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంఘటిత, అసంఘటిత కార్మిక అడ్డాలు కార్మిక వాడల్లో జరిగిన ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కంచర్ల జమలయ్య, కార్యదర్శి గెద్దాడు నగేష్, నాయకులు దమ్మాలపాటి శేషయ్య, వంగా వెంకట్, జి.వీరస్వామి, వి.మల్లిఖార్జునరావు, జక్కుల గట్టయ్య, కె.రాములు, కిష్టాపర్, సంధ్యబోయిన శ్రీను, యూమాయున్, నాగేశ్వరరావు, కృష్ణయ్య, మాచర్ల శ్రీనివాస్, కె.నవీన్, లక్ష్మి, గుడిపాటి వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

**మందమర్రి :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సిపిఐ కార్యాలయం వద్ద ఎఐటియుసి జెండాను ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కలిందర్ అలీఖాన్, మిట్టపల్లి పౌలు, దొడ్డిపట్ల రవీందర్, కాదండి సాంబయ్య, చాడా మహేందర్ రెడ్డి, కొత్తపల్లి మహేష్, రాయమల్లు, కోడి వెంకటేష్, సర్వ శ్రీనివాస్, రమేష్, నర్సయ్య, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరిరూరల్ :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షుడు బోలగాని సత్యనారాయణ భువనగిరి జిల్లా కార్యాలయం ముందు కార్మిక జెండా ఆవిష్కరించారు. భువనగిరి ప్రభుత్వ జిల్లా హాస్పిటల్, సివిల్ సప్లై హమాలి యూనియన్, కొత్త వ్యవసాయ మార్కెట్ యార్డ్, కొత్త బస్టాండ్ వద్ద భువనగిరి టూ ఉప్పల్ మరియు మోత్కూర్ రూట్ టాటా ఏసీ యూనియన్, ఘట్కేసర్, యాదగిరిగుట్ట మరియు భువనగిరి లోకల్ ఆటో యూనియన్‌ల అడ్డ వద్ద ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి ఎండి ఇమ్రాన్ కార్మిక జెండా ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సామల శోభన్‌బాబు, పుట్ట రమేష్, సామల భాస్కర్, వల్దస్ నరసింహ, ముంతాజ్ బేగం, గుర్రాల శ్రీను, కొత్త కృష్ణ, మరిపల్లి సాయి, బాగుల వసంత, బోయిని బిక్షపతి, భూపాల్ రెడ్డి, గణేష్, పాండు, మైసయ్య, జహంగీర్, విజయలక్ష్మి, నిర్మల, స్వామి, సంధ్య, లక్ష్మి, జగన్, సత్యనారాయణ, అండాలు, బసవయ్య పాల్గొన్నారు.

**మహబూబాబాద్ :** కేంద్రంలో కార్పోరేట్ ప్రధాని మోదీని గద్దె దించేందుకు కార్మికులు ఐక్యంగా ఉండాలని ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అజయ్‌సారథిరెడ్డి, రేషపల్లి నవీన్ అన్నారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో బాణాసంచా కాల్చి కేక్ కట్ చేసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మందశంకర్, వీరవెల్లి రవి, వెలుగు శ్రావణ్, వంకాయలపాటి జకరయ్య, పెరుగు కుమార్, బానోతు లింగ్యానాయక్, జలగం ప్రవీణ్, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, రాము, సోమయ్య, ముత్యాలు రాము లు, కిషన్, నారాయణ, రమణ, మధు, విజయ్, నాగేశ్వరరావు, పాషా, యూసుఫ్, వీరన్న, శేఖర్ పాల్గొన్నారు.



మహబూబాబాద్...

**కోదాడ:** కార్మికుల సమస్యల కోసం వారికి అండగా నిలిచిన జెండా ఎఐటియుసి అని రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. ఎఐటియుసి ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా కోదాడ ఆర్‌టిసి బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ఎఐటియుసి జెండాను ఆయన ఎగురవేసి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె లతీఫ్, నాయకులు నాగరాజున నయీం, మెసిన్, జానీ, రామారావు, వెంకయ్య, గోపి, సుల్తాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** కార్మికుల ఎజెండానే ఎఐటియుసి జెండా అని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఎ గౌస్ పేర్కొన్నారు. శుక్రవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. ఎఐటియుసి ఆర్జీ వన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోసిక మోహన్, తాళ్ళపెల్లి మల్లయ్య, నాయిని శంకర్, లెనిన్, నవీన్, పొన్నం రంజిత్, తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిజామాబాద్ నగరంలో ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, వ్యవసాయ మార్కెట్ యార్డు, కిషన్ గంజ్, గాంధీ గంజ్, మునిసిపల్ కార్యాలయాల వద్ద కార్మిక జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎఐటియుసి నిజామాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.ఓమయ్య, జిల్లా అధ్యక్షులు పి.నర్సింగరావు, ఉపాధ్యక్షులు చక్రపాణి, పిన్నెల హనుమాండ్లు, పరశురాం, దేవేందర్, కండ్లకోయ ప్రసాద్, భాగ్య లక్ష్మి, కవిత, స్వరూప, రాధాకుమార్, చిన్ను భాయ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

**నల్లగొండ:** దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఎఐటియుసి అని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. ఎఐటియుసి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నల్లగొండలో కార్మిక జెండాను పల్లా దేవేందర్ రెడ్డి డిఇఒ ఆఫీస్ వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కెవిస్ రెడ్డి, జిల్లా కోశాధికారి దొనకొండ వెంకన్న,డివిజన్ కార్యదర్శి విశ్వనాధుల లెనిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుండె రవి, కార్యదర్శి రేవల్లి యాదయ్య, నరసింహ, మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండిజానీ, కృష్ణ,, పోతు రాజు నాగరాజు, కంభంపాటి జానయ్యా, లక్ష్మయ్య, గిరి, వీరయ్య, వెంకన్న పాల్గొన్నారు.

**ములుగు :** కార్మిక చట్టాలను రక్షించుకోవడం కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య శాల వద్ద ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక జెండాను జంపాల రవీందర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ముత్యాల రాజు, ఇంజం కొమురయ్య, పెద్దకాసు వినోద్, కొత్తూరు శ్రీనివాస్, సమత, కళావతి, రాజయ్య, బాలు, బాల్ సింగ్, సమత, కళావతి పాల్గొన్నారు.

**సంగారెడ్డి :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జరిగిన పతాకావిష్కరణలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎ రహమాన్, వెంకటరాజ్యం పాల్గొన్నారు. స్థానిక కొత్త బస్టాండ్, సంగారెడ్డి జిల్లా కేంద్రప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, కలెక్టరేట్ కార్యాలయం వద్ద, తల్లి తెలంగాణ విగ్రహం వద్ద ఎఐటియుసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు ఆనంద్ సలీం, సుంకన్న శివశంకర్, లక్ష్మి దుర్గయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**ఖమ్మం :** కార్మికులు అనుభవిస్తున్న హక్కులు, సంక్షేమ పథకాలు ఎఐటియుసి పోరాట ఫలితమేనని ఎఐటియుసి జాతీయ సమితి సభ్యులు బిజి క్లెమెంట్ తెలిపారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని పర్ణశాల వద్ద గల ఎఐటియుసి పైలాన్ వద్ద కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాదె లక్ష్మి నారాయణ, తోట రామాంజనేయులు, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి, జిల్లా నాయకులు పేరబోయిన మోహన్‌రావు, పిట్టల మల్లయ్య, ఎండి.జాకీరుద్దీన్, గుండెపొంగు మల్లేష్, తాటి నిర్మల, జి.నర్సయ్య, కోటేశ్వరరావు, రావుల శ్రీను, గురవయ్య, మంగీలాల్ పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని హనుమకొండలో ఘనంగా నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్ జెండా ఆవిష్కరించారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, నద్దూనురి వెంకట్రాజం , ఎన్ఎ.స్టాలిన్, కొట్టేపాక రవి, రామ రాజేష్ ఖన్నా, ధర్మల రాంమూర్తి, మాలోత్ శంకర్ నాయక్, మద్దెల శ్రీనివాస్, లలిత తదితరులు పాల్గొన్నారు.


ఖమ్మం...


కోదాడ...


మంచిర్యాల...


ములుగు...


పెద్దపల్లి...


సంగారెడ్డి...


యాదాద్రిభువనగిరి...


హన్మకొండ...



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కరీంనగర్‌లో '5కె రన్ ఫర్ యూనిటీ'

ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: భారతదేశ ఉక్కుమనిషి, తొలి హోంమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రీయ ఏక్తా దివస్ సందర్భంగా కరీంనగర్ పోలీసు కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5 కిలోమీటర్ల రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం విజయవంతమైందని సిపి గౌష్ ఆలం తెలిపారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత నలిమెల భాస్కర్, దాశరథి అవార్డు గ్రహీత అన్నవరం దేవేందర్ పాల్గొన్నారు. అడిషనల్ డీసీపీ భీం రావు, కమిషనరేట్‌లోని పోలీసు అధికారులు, వివిధ కళాశాల విద్యార్థులు, క్రీడాకారులు ఉన్నారు.



## కార్మికులకు ఎల్లవేళలా అండ



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: ఏఐటీయుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కార్యాలయం బద్దం ఎల్లారెడ్డి భవన్ వద్ద ఏర్పాటు చేసిన పతాకాన్ని ఏఐటీయుసి జిల్లా అధ్యక్షుడు కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ ఆవిష్కరించారు. కటికరెడ్డి బుచ్చన్న యాదవ్ మాట్లాడుతూ కార్మికులకు ఏఐటీయుసి అండగా నిలుస్తూ కార్మిక వ్యతిరేక విధానాలపై నిత్యం పోరాడుతుందన్నారు. పాత చట్టాలను పునరుద్ధరించాలని, దేశంలో నూతన పరిశ్రమలు వెంటనే నెలకొల్పాలన్నారు. బిజెపి ఎన్డీయే కార్మికులను బానిసలను చేసేందుకు ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలన్నారు. కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని బుచ్చన్న యాదవ్ పిలుపునిచ్చారు. ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు జంగా తిరుపతి, కార్యదర్శి కడారి బీరయ్య, పిట్టల సమ్మయ్య, కార్యవర్గ సభ్యులు కెంసారం శ్రీనివాస్, గుర్తురి శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, నాయకులు నన్నవేని కొమురయ్య, రేగుల కుమార్, పైడిపల్లి రాజు, అల్లెపు బాలయ్య, జక్కుల ఆగయ్య, నడిగడ్డ సంపత్,బి.యుగేందర్, రాజేందర్, బుచ్చయ్య, భాగ్య, ఆంజనేయులు, సాంబయ్య, తదితరులున్నారు.

# కార్మికుల కోసం నిరంతర పోరాటం

**ఏఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు**



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : కార్మికుల కోసం పోరాటాలు చేస్తూ సమ్మె హక్కు, సంఘం పెట్టుకొనే హక్కు, కనీస వేతనాల హక్కు లాంటి అనేక హక్కులు దేశంలో ఏఐటీయూసీ మూలంగానే వచ్చాయని రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐటీయుసి జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు అజ్జ వేణు, కడారి రాములు, సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ లు అన్నారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏఐటీయూసీ కార్మిక భవన్, శభాష్ నగర్ లో 106వ ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఏఐటీయుసి జిల్లా అధ్యక్షులు అజ్జ వేణు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31న ఆవిర్భావం జరిగిన నాటి నుండి నేటి వరకు 106 సంవత్సరాలుగా , దేశంలో కార్మిక రంగ పోరాటాలు చేయడంలో ఏఐటీయూసీ ముందుందన్నారు. బ్రిటిష్ వారితో సైతం కొట్లాడి కార్మిక హక్కులను సాధించుకుంటే, కేంద్రంలో అధికారంలో వున్న బీజేపీ ప్రభుత్వం 44కార్మిక చట్టాలను మార్చి 29కార్మిక చట్టాలను 4కోడ్ లుగా మార్చి దేశీయ కార్మికులను ఎఫ్ డి ఐ,కార్పొరేట్ శక్తులకు ఊడిగం, భానిసలను చేసే విదంగా చట్టాలను మార్చారని మండి పడ్డారు. తక్షణమే 44చట్టాలను యధాతంతంగా ఉంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రములో సైతం ఇటీవలనే 10 గంటల పని విధానం జీవో తెచ్చిందని, వందల సంవత్సరాలుగా 8గంటల పని విధానం కోసం కార్మిక వర్గం పోరాటాలు చేస్తే ఇప్పటికి 10గంటల పని విధానం తీసుకురావడం విచారకరం అన్నారు. జిల్లాలోఏఐటీయుసి ఆధ్వర్యంలో భవన నిర్మాణం, అంగన్వాడీ,సెంటర్ ఏఎన్ఎం,ఎన్‌హెచ్ ఎం, కాం ట్రాక్టు, ఔట్ సోర్సింగ్, బీడీ, హమాలీ, సివిల్ సప్లై, మధ్యాహ్న భోజనం, పంచాయతీ, దేవస్థానం, మిషన్ భగీరథ, టెండర్, మున్సిపల్, గ్రామపంచాయతీ, ఆటో, ఉపాధి హామీ, రైతులు, రైతు కూలీలు లాంటి అనేక రంగాల వారి కోసం, హక్కులు, వేతనాల కోసం పోరాటాలు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమం లో సిపిఐ సీనియర్ నాయకులు నల్ల చంద్రమౌళి, మ్యాన సిద్ధమ్మ, బీడీ సంఘం నాయకులు కె.వి అనసూర్య, సుంకణపెల్లి శాంతా, కొండ ఈశ్వరి, దుంద్రపెల్లి రవీందర్, తాళ్లపెల్లి రామయ్య, భోదాసు ఎల్లయ్య, మేరుగు దుర్గయ్య, పండుగ చంద్రయ్య, రాజేష్, దేవయ్య, మల్లయ్య, లింగయ్య, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వర్గానికి ఏఐటియుసి ఒక దిక్సూచి : కె.లక్ష్మణ్



ప్రజాపక్షం/ సిద్దిపేట : ఏఐటియుసి పోరాటాల తోనే కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఏఐటియుసి సిద్దిపేట జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ అన్నారు. ఏఐటియుసి 106 ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో ఏఐటియుసి కార్మిక సంఘం జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. 1920 అక్టోబర్ 31 భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని దేశంలో ఉన్న కార్మిక వర్గానికి గగనంలో పనిదినం అమలుకావాలని.పని భద్రత ఉండాలని, కార్మికులకు హక్కు లు చట్టాలు ఉండాలని బొంబాయి కేంద్రంగా ఏఐటియుసి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆనాటి నుండి దేశంలో ఉన్న కార్మికులను ఐక్యం చేసి పోరా టం చేసిన ఫలితంగా చట్టాలు హక్కులు సాధించుకోవటం జరిగిందన్నారు. ఈ దేశ కార్మిక వర్గానికి ఏఐటియుసి ఒక దిక్సూచీగా నిలబడిందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, ఏఐటియుసి జిల్లా నాయకులు పిట్ల మల్లేశం. కర్నాల చంద్రం. బెక్కంటి సంపత్. తోసుపల్లి బిక్షపతి. చెక్క ఐలయ్య, గోవిందారం నర్సింహులు, చింతమడక రాజు,ఇ గంగి రాజు శ్రీనివాస్, పెయింటర్ యూనియన్ అధ్యక్షులు కనకయ్య. కార్యదర్శి రవి, పర్శరాములు తదితరులు పాల్గొన్నారు.

## వెల్లివిరిసిన జాతీయ సమైక్యత




ప్రజాపక్షం/ మల్యాల : సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి,జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం జగిత్యాల జిల్లా మల్యాల మండల పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు.మల్యాల ఎస్సై నరేష్ కుమార్ ఆధ్వర్యంలో మల్యాల అంగడి బజార్ నుండి బ్లాక్ చౌరస్తా వరకు కొనసాగిన ఈ రన్ లో సుమారు 100 మంది యువకులు,మాజీ ప్రజా ప్రతినిధులు,వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై నరేష్ కుమార్ మాట్లాడుతూ 2 కే రన్ జాతీయ సమైక్యతకు నిదర్శనం అన్నారు. ప్రతి రోజు యువకులు రన్నింగ్ చేయాలని సూచించారు. బత్తిని శ్రీనివాస్ గౌడ్,గాజుల మల్లేశం,వెంకట స్వామి, బండారి రాజు,యువకులు తదితరులు పాల్గొన్నారు.




ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో కేశనపల్లి గ్రామంలోని వైయస్సార్ విగ్రహం నుండి హరిపురం వరకు కొనసాగిన 2కే రన్ లో సుమారు 100 మంది యువకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై రవికుమార్ మాట్లాడుతూ సర్దార్ వల్లభ్బయ్ పటేల్ చేసిన కృషి ఫలితంగా జాగిర్దారు వ్యవస్థలో ఉన్న రాజ్యాలన్నీ భారతదేశంలో అంతర్భాగమయ్యాయని తెలిపారు.



వీర్నపల్లి: సర్థార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్బంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ 2025ను పురష్కరించుకొని మండల కేంద్రంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఐ రాహుల్ రెడ్డి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల, మండలంలోని ఉత్సహవంతులైన యువకులతో కలిసి స్టేసన్ నుండి అమరవీరుల స్థూపం వరకు 2కె రన్ నిర్వహించారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం భిక్షాటన

**ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం**



ప్రజాపక్షం/పెద్దపల్లి : తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయి విడుదలలో నిర్లక్ష్యం వల్ల, ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు కళాశాలలు బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకాలు కలుగుతున్నాయని ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం అన్నారు. శుక్రవారం ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో భిక్షాటన చేశారు. ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదని,సీఎం రేవంత్ రెడ్డి వద్ద విద్యా శాఖ ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడం సీఎం నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు సైతం నవంబర్ 3 నుండి ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు కళాశాలలు బంద్ చేస్తామని ప్రకటించాయన్నారు. ఇప్పుడిప్పుడే తరగతులు ప్రారంభం అయ్యాయని, బంద్ చేయడం వల్ల విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం వారు అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెండింగ్ లో ఉన్న, టోకెన్లు మంజూరు అయిన ఫీజు బకాయిను విడుదల చేయాలన్నారు. లేనిపక్షంలో ఎఐఎస్ఎఫ్ విద్యార్థులను ఏకం చేసి ప్రభుత్వంపై మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి ఆజాద్, జిల్లా కోశాధికారి ఎల్కపల్లి సురేష్, గుండేటి తరుణ్, లచ్చేటి అభి, నస్పూరి వర్షిత్, ధరణి అరుణ్ ,వేముర్ల వివేక్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడుగా కార్తీక్

ప్రజాపక్షం/ వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలోని ట్రాక్టర్ల సంఘం అధ్యక్షుని నియామకంపై శుక్రవారం ఎన్నికలు జరిగాయి. మొత్తం ఓటర్ల సంఖ్య 218 ఉండగా.. పోలైన ఓట్లు 203. అనుముల బాలయ్యకి 66 ఓట్లు రాగా, సరిపెల్లి కార్తీక్ 137 ఓట్లు సాధించి 71 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. సరిపెల్లి కార్తీక్ మాట్లాడుతూ వేములవాడ పట్టణ ట్రాక్టర్ అసోసియేషన్ ఎన్నికల్లో తనని అత్యధిక మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలుతెలిపారు.యూనియన్‌ని బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు.

# ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



ప్రజాపక్షం/గంగాధర: ఆడపిల్లలను వేధిస్తే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హెచ్చరించారు. మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో విధ్యార్థులను వేధించిన ఘటనలో శుక్రవారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో ఉన్న సమస్యల గురించి తనకు సమాచారం ఇవ్వాలని, పెద్దన్నలా అండగా ఉండి సమస్యలను పరిష్కరిస్తానని భరోసా కల్పించారు. పాఠశాలలో విద్యార్థులను వేధించిన ఘటనలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్,హైదరాబాద్, జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి నిమిషాల్లోనే నిందితుడైన అటెండర్‌ను, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన హెచ్ఎంను సస్పెండ్ చేయించినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు నిత్యం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. విద్యార్థులపై ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెలిచాల తిరుమల్ రావు, మార్కెట్ సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, ఎంఆర్‌వో అంబటి రజిత, ఎంపిడివో దమ్మని రాము, ఎంఈవో ప్రభాకర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, పడాల రాజన్న, సాగి అజయ్‌రావు, బూరుగు గంగన్న, దోర్నాల శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్, రోమాల రమేష్, పడితపల్లి కిషన్, రాచమల్ల భాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి, కర్ర బాపురెడ్డి, నగేష్, మహేష్, ఆనంద్, ముచ్చ శంకరయ్య, మంత్రి మహేందర్, గంగాధర ప్రవీణ్, మ్యాక వినోద్, వంగల శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# దేశ సమగ్రత, ఐక్యతకు పాటుపడాలి

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్ : దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించుటకు ప్రతి ఒక్కరు పాటుపడాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్లు డి.వేణు, జె అరుణశ్రీలతో సర్దార్ వల్లభాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని భారత ప్రథమ హోమ్ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన అక్టోబర్ 31న ప్రతి ఏటా నిర్వహించు కుంటున్నామని తెలిపారు. దేశ ప్రజలలో మనమంతా భారతీయుల మనే భావనను సుస్థిరం చేసిన మహనీయుడు అని, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్పాన్ని భావి తరాలు ఆదర్శంగా తీసుకొని వారి ఆశయ సాధన దిశగా కృషి చేసి దేశ సమగ్రత, ఐక్యతను పెంపొందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.అనంతరం దేశ ఐకమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని,దేశ అంతర్గత భద్రతను పటిష్ట పరచటానికి స్వీయ తోడ్పాటు నందిస్తానని ఉద్యోగులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.అంతకుముందు జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా ఐటి ప్రాంగణం నుంచి చౌరస్తా వరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2 కిలో మీటర్ల యూనిటీ ఫర్ రన్ ర్యాలీ ను జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య , వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల ప్రసన్నం కోసం పోటాపోటీ ప్రచారం




ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ అర్బన్ బ్యాం కు ఎన్నికలు సాధారణ ఎలక్షన్లను తలపిస్తున్నా యి. గత ఎనిమిది సంవత్సరాల తర్వాత జరుగుతున్న కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఈ సారి మూడు ప్యానెల్లు బరిలో నిలిచాయి. ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వివిధ మార్గాల ద్వారా గత వారం రోజులుగా పోటా పోటీగా ప్రచారం కొనసాగించారు. శనివారం జరగనున్న పోలింగ్‌కు అన్ని ప్యానెళ్లకు సంబంధించిన అభ్యర్థులు సిద్ధమయ్యారు. కరీంనగర్‌లో కాశ్మీర్‌గడ్డలోని మహిళా డిగ్రీ కళాశాలలో పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరగనుండగా సాయంత్రం ఫలితాలు వెల్లడికానున్నాయి. ప్యానెళ్లను ఏర్పాటు చేసుకుని గత కొన్ని రోజులుగా ప్రచారాన్ని ముమ్మరం చేసి విమర్శలు, ప్రతి విమర్శలతో రాజకీయ వాతావారణాన్ని వేడెక్కించారు. అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో ఎన్నడూ లేని విధంగా ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఓ ప్యానెల్‌కు చెందిన అభ్యర్థులు చేస్తున్న ప్రచారం జనరల్ ఎన్నికలు తలపించే విధంగా ఉండడం ఆసక్తిరేపుతోంది. నగరంలో ప్రతి వాడకూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు వివిధ సంఘాల మద్దతు కూడగడుతున్నారు. ఉదయమే వాకర్స్ మొదలు కొని బ్యాంకు పరిధిలోని ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. సామాజికవర్గాల వారీగా సమీకరణలతో ముందుకెళ్లడం జనరల్ ఎన్నికలను తలపించే విధంగా ఉందని పలువురు చర్చించుకుంటున్నారు. కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికల్లో కేవలం 9 వేల ఓటర్లుండగా 2 వేల పైచిలుకు జగిత్యాల పరిధిలో ఉన్నాయి. మిగిలిన ఓటర్లు కరీంనగర్ పరిధిలో ఉంటాయి. కాగా కరీంనగర్ అర్బన్ బ్యాంకు ఎన్నికలకు ఈ తరహా హడావుడి ఎన్నడూ చూడలేదని సభ్యులు చర్చించుకోవడం విశేషం.

# ఒక మంచి పాలకవర్గాన్ని ఎన్నుకోవాలి

**'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి**



ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ: సహకార రంగంలో కరీంనగర్ జిల్లాకు ఒక చరిత్ర ఉందని, సహకార అర్బన్ బ్యాంకును సైతం ఆ దిశగా నడిపించడానికి ఒక మంచి పాలకవర్గాన్ని ఎన్నుకోవాలని, దానికి ప్రభుత్వపరంగా పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆర్అండ్‌బి గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.92 కోట్ల పైచిలుకు డిపాజిట్లతో దాదాపు రూ.50 కోట్ల లోన్లతో నడుస్తున్న అర్బన్ బ్యాంకుకు గత ఎనిమిది సంవత్సరాలుగా పాలకవర్గం లేకపోవడానికి ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వమే కారణమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎన్నికలు జరిపి బ్యాంకు అభివృద్ధికి కృషి చేయాలని అడ్డంకులన్నీ తొలగించి ఎన్నికలకు పోవడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఎక్కువ మంది అనుభవమున్న కాంగ్రెస్ నాయకులు పోటీ చేస్తున్నందున ప్యానెల్ ప్రకటించలేదని, సభ్యులు ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకుని మంచి పాలకవర్గాన్ని ఎన్నుకోవాలని కోరారు. రాబోయే రోజుల్లో ఇంకా డిపాజిట్లు పెరిగే విధంగా ఖాతాదారుల్లో విశ్వాసం నింపే విధంగా పనిచేసే పాలకవర్గాన్ని ఎన్నుకోవాలన్నారు. అనుభవమున్న కాంగ్రెస్ నాయకులు పోటీలో ఉన్నారని, గెలిచిన పాలకవర్గాన్ని ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు ఉంటాయని పేర్కొన్నారు. అర్బన్ బ్యాంకు ఎంతోమంది ఖాతాదారులకు సేవలు అందించడమే కాకుండా లోన్ల ద్వారా మధ్యతరగతి కుటుంబాలను ఆదుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. ఇప్పుడున్న 9 వేల మంది సభ్యులు పది కిలోమీటర్ల పరిధిలో గుర్తింపు కార్డు సమరిత్పంచిన వారేనని, వారందరూ ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకోవాలని నరేందర్‌రెడ్డి కోరారు. సమావేశంలో చర్ల పద్మ, దండి రవీందర్, బొబ్బిలి విక్టర్, ఎండి చాంద్, షబానా మహమ్మద్, జ్యోతిరెడ్డి, హసీనా, అస్థాపురం రమేష్, శిల్ప, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి బస్సు కింద పడి ఒకరు ఆత్మహత్య

ప్రజాపక్షం/ సిద్దిపేట : ఆర్టీసి బస్సు టైరు కింద పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పొన్నాల ఫ్లై ఓవర్ వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ ఎస్ఐ చంద్రయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా వున్నాయి. మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామానికి చెందిన నారదాసు బాలరాజు (47) తన బంధువుల వద్దకు హైద్రాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తూ దుద్దేడ చౌరస్తాలో దిగాల్సి ఉండగా అక్కడ దిగకుండ పొన్నాల ఫ్లై ఓవర్ వద్ద దిగారు. ఆనంతరం జనగామ బస్సు ఎక్కడానికి హైద్రాబాద్ రోడ్డు మధ్యలో నుండి నడుచుకుంటు వెళ్తూ అదే సమయంలో సిద్దిపేట నుండి హైద్రాబాద్ వెళ్లే కాంట్రాక్టు ఆర్టీసి బస్సు రావటంతో ఆబస్సు టైరు కింద ఒక్కసారిగా పడుకున్నారు. దీంతో తీవ్రగాయాలకు గురికావటంతో గమనించిన స్థానికులు సిద్దిపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లుగా వైద్యులు తెలిపారు. మృతుని ఆత్మహత్యకు కారణాలు తెలియలేదన్నారు. కుమారుడు నారదాసు రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పడకేసిన పారిశుద్ధ్యం



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామం 12వ వార్డులో గత కొన్ని రోజులుగా పారిశుధ్య లోపంతో జనం అవస్థలు పడుతున్నారు. మిషన్ భగిరథ నీటి లీకేజితో బురద మయంగా మారి నీటి నిలువతో దోమలు, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు తలెత్తున్నాయని స్థానికులుఆరోపిస్తున్నారు. కార్యదర్శికి పలుమార్లు చెప్పిన పట్టించుకోవడం లేదని గ్రామస్తులు అన్నారు. దీనిపై ప్రజాపక్షం ప్రతినిధి కార్యదర్శి హరిందర్‌ను వివరణ కోరగా త్వరితగతిన చర్యలు చేపడతామని బదులిచ్చారు.

# 9 నెలలుగా నిలిచిన వంట బిల్లులు.. కార్మికుల ఆకలి మంటలు

**మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్, జగిత్యాల జిల్లా ఇన్‌చార్జి వెన్న మహేష్**




ప్రజాపక్షం/జగిత్యాలరూరల్: ఎఐటియుసి అనుబంధ, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం జగిత్యాల జిల్లాలో మధ్యాహ్న భోజన వంట కార్మికులు అందరు కలిసి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయాన్ని ముట్టడించారు. ధర్నా చేశారు. ఇన్‌చార్జి జగిత్యాల జిల్లా విద్యాధికారికి వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్, జగిత్యాల జిల్లా ఇంచార్జ్ వెన్న మహేష్ మాట్లాడారు. 24 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో వంట కార్మికులుగా పనిచేస్తూ, విద్యార్థులకు నాణ్యమైన భోజనాలు అందిస్తూ ఆ వంట బిల్లులు వేతనాలు 9 నెలలు పెండింగులో ఉండగా కార్మికులు ఎలా పనిచేస్తారో అధికారులే చెప్పాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒక్క నెల వేతనం కొంచెం అలస్యం అయితే ఎన్నో ఇబ్బందులు పడే పరిస్థితులలో వంట కార్మికులు ఎలా వంటలు చేస్తారు అని అన్నారు. ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఈ విషయాన్ని చాలా ఈజీగా తీసుకోవడం ఎంతవరకు సమంజసం కాదని అన్నారు. దాని తోపాటు ఒకటే కూరకు డబ్బులు చెల్లిస్తూ, రెండు కూరలు తయారు చేయాలని పాఠశాల విద్యాశాఖ అధికారులు ఒత్తిడి చేయడం సరికాదన్నారు. గత ప్రభుత్వం చివరలో ప్రవేశపెట్టిన అల్పాహారం బిల్లులు పది నెలలుగా చెల్లించకపోతే కార్మికులు ఎలా తట్టుకుంటారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో అధికారంలోకి రాగానే రూ, 10,000 ఇస్తామని ప్రకటించి, నేటికీ అమలు చేయడం లేదు అన్నారు. మెనూ చార్జీలు ప్రభుత్వం ఇస్తున్న వాటికి మార్కెట్లో లభిస్తున్న ధరలకు ఏమాత్రం సరిపోయే పరిస్థితులు లేనప్పుడు కార్మికులు అప్పుల పాలు కావలసి వస్తుందని కార్మికులను కొంత మంది ప్రధానోపాధ్యాయులు, చోటా మోటా నాయకులు మెనూ ప్రకారం వంటలు చేస్తేనే ఉండండి లేకుంటే ఊరుకోండి మరొకరితో వండిస్తామని బెదిరింపులు గురి చేస్తున్నారు. కనుక ప్రభుత్వం మెనూ చార్జీలు ప్రతి విద్యార్థికి 25 రూపాయలైనా చెల్లించాలి, లేదంటే సరుకులు మొత్తం ప్రభుత్వమే సరఫరా చేయాలిని డిమాండ్ చేశారు, ఇన్ని ఇబ్బందులలో మరొక కొత్త పథకం రాగి జావ తయారు చేయడానికి ఒక పిల్లవాడికి రెండు రూపాయలు ఇవ్వవలసింది పోయి, కేవలం 25 పైసలు చెల్లిస్తే ఎలా తయా రు చేస్తారు అన్నారు. సమస్యలన్నీ ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఈ నెల 12న చలో హైదరాబాద్ కమిషనర్ కార్యాలయం ముట్టడి నిర్వహించడం జరుగుతుంది అని జగిత్యాల జిల్లా మధ్యాహ్న భోజనం ఇంచార్జ్ వెన్న మహేష్ అన్నారు. ఎఐటియుసి జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, కార్యదర్శి ఎండి ముఖరం, మాడిశెట్టి కిరణ్, హనుమంతు, గుగ్గిళ్ళ శారద, సరస్వతి, ఎండి షంషేర్, అంకుష్, రాధా, పద్మ తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## కార్మికులకు అండగా ఎఐటియుసి



**ప్రజాపక్షం/ముథోల్:** మండల కేంద్రమైన ముథోల్ లో శుక్రవారం సిపిఐ కార్మిక అనుబంధ సంస్థ అయిన ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా ఏఐటియుసి సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది.రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ ఆదేశాల మేరకు ముథోల్ ఎఐటియుసి హమాలీల కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు అండగా ఎఐటియుసి బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్మికుల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న వైఖరి కట్టడి చేయడానికి ముందుకు కదిలేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్మికులకు న్యాయం ఎఐటియుసి తోనే సాధ్యమని నినాదాన్ని ప్రతి ఒక్కరికి తెలియజేసేలా ఐక్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హమాలీలు బదర్, శివాజీ, గౌతం, కోడి బాబు మండల నాయకులు పాల్గొన్నారు.

## సేంద్రియ సాగుతోనే భవిష్యత్తుకు భద్రత: కలెక్టర్ పి.ప్రావీణ్య



**ప్రజాపక్షం/సంగారెడ్డి :** సేంద్రీయ పద్ధతిలో పంటల సాగుతోనే భవిష్యత్తుకు భద్రత ఉంటుందని ప్రాచీన పంటల సాగు ప్రాముఖ్యతను వివరిస్తూ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ఝరాసంగం మండలంలోని బిడెకన్న గ్రామంలో అర్థ్యా అగ్రికల్చరల్ అండ్ టివి లీడ్ నేచురల్ పార్మింగ్ ఇన్స్టిట్యూట్ ల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కృషి సఖి శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలంగా ఆరోగ్యానికి మేలు చేసే పంటల కోసం సేంద్రీయ సాగు అత్యంత అవసరమన్నారు. మన తాతలు సాగు చేసిన సాంప్రదాయ పంటలను తిరిగి అభివృద్ధి చేసేందుకు కృషి సఖి మహిళలు ముందుండాలని పేర్కొన్నారు. ఈ నెల 27 నుండి 31 వరకు ఐదు రోజుల పాటు జరిగిన ఈ శిక్షణలో నారాయణ ఖేడ్, రాయికోడ్, జహీరాబాద్, డివిజన్ కు చెందిన మొత్తం 15 మండలాల కృషి సఖి మహిళలు శిక్షణలో పాల్గొన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ,విత్తన పరిరక్షణ, స్థానిక జీవావరణానికి అనుగుణమైన పంటల సాగు వంటి అంశాలపై నిపుణులు కృషి సఖి మహిళలకు అవగాహన కల్పించారు. చివరి రోజున శిక్షణ పూర్తి చేసుకున్న కృషి సఖి మహిళలకు కలెక్టర్ ప్రావీణ్య సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి శివప్రసాద్, సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీదేవి, వ్యవసాయ అధికారి ప్రేమలత, జహీరాబాద్, ఆర్డీఓ దేవుజా సహాయ వ్యవసాయ సంచాలకులు బిక్షపతి స్థానిక తహసీల్దార్ తిరుమల రావు ,ఎంపిడిఓ మంజుల ,మండల వ్యవసాయ అధికారి వెంకటేష్, అర్థ్యా సిఈఓ పద్మ ఎల్విన్ ఎవి,ఐ నోడల్ ఆఫీసర్ స్నేహ వివిధ అధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** భూభారతి పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం ఇందల్వాయి తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తహసీల్దార్, ఇతర సిబ్బందితో భూభారతి, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్వ ప్రక్రియ అమలుపై సమీక్ష జరిపారు. భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యూల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు. ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోపు అన్ని దరఖాస్తులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆదేశించారు. దరఖాస్తులు తిరస్కరణ అయితే, అందుకు గల కారణాలు స్పష్టంపేర్కొనాలని సూచించారు. సాదా బైనామా, పీటీలకు సంబంధించిన అప్లికేషన్ల క్షుణ్ణంగా పరిశీలన జరపాలని, వెంటవెంటనే నోటీసులు జారీ చేస్తూ, క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ నిర్వహించాలన్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంతప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరగకుండా రోజువారీగాదరఖాస్తులు పరిశీలనను పర్యవేక్షిస్తూ వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అనుసరిస్తూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్వ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. కేటగిరీల వారిగా మ్యాపింగ్ నిర్వహిస్తున్న విధానాన్ని పరిశీలించి బిఎల్ఓ సూపర్వైజర్లు, సూచనలు చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ వెంకట్‌రావు ఉన్నారు.

## మొంథా తుఫాన్ తాకిడికి తీవ్ర పంట నష్టం

**ప్రజాపక్షం/కమ్మర్‌పల్లి :** మండలంలోని కోనాపూర్, కోనసముందర్, బషీరాబాద్, ఉప్లూర్, చౌట్‌పల్లిలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వరి పంట నీటమునగడమే కాకుండా ఎండబెట్టిన వరి ధాన్యం తడిసి పంట నష్టం సంభవించింది. కోనసముందర్, కోనాపూర్‌లో ఆరబోసిన వరి ధాన్యం తడవగా, బషీరాబాద్, ఉప్లూర్ గ్రామాల్లో పంట నీటమునిగి నష్టం చేకూర్చింది. కమ్మర్‌పల్లిలో 70 ఎకరాలు, చౌట్‌పల్లిలో 60 ఎకరాలు, ఉప్లూర్ క్లస్టర్‌లో 65 ఎకరాలు, బషీరాబాద్‌లో 50 ఎకరాలు, కోనసముదర్ క్లస్టర్‌లో 120 ఎకరాల పంట వర్షానికి దెబ్బ తిన్నట్లు మండల వ్యవసాయాధికారిణి రమ్యశ్రీ తెలిపారు. రైతన్నలు కష్టపడి పండించిన పంట రాత్రి కురిసిన వర్షానికి తడిసి ముద్దవ్వడం చేతికొచ్చిన పంట వర్షంలో మునిగిపోవడం రైతన్నలను కన్నీటిని మిగిల్చింది. ప్రభుత్వం ఏ విధంగా నైనా సాయం చేయాలని రైతులు కోరుకుంటున్నారు.

## ఆర్‌టిసి బస్సు ఢీకొని ఒకరు మృతి



**ప్రజాపక్షం/నందిపేట్:** నందిపేట్ మండల కేంద్రంలోని జోర్పూర్ సమీపంలో శుక్రవారం ఖుద్వాన్‌పూర్ గ్రామానికి చెందిన బ్యాగరి పోశెట్టి నిజామాబాద్ వెళుతుండగా బంగారు మైసమ్మ ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసి బస్సు ఢీకొని బలమైన గాయంతో అక్కడికక్కడే మరణించాడని నందిపేట్ ఎస్ఐ శ్యామ్‌రాజు తెలిపారు. ఇదే బైక్ అత్యున్న గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు. మృతుని భార్య రూప ఇచ్చిన దరఖాస్తు ఆధారంగా కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

## ఎల్‌ఓసి అందజేత

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** మండలంలోని బాబాపూర్‌కు చెందిన సయ్యద్ హయత్ ఇటీవల యాక్సిడెంట్‌కు గురై నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేరటంతో ఈ విషయం స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకరాగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి మెరుగైన చికిత్స కోసం లక్ష రూపాయల ఎల్‌ఓసీ కాపీని వారి కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌లోని నివాసంలో అందజేశారు. నిరుపేదలైన మాకు మెరుగైన వైద్య చికిత్స కోసంలక్ష రూపాయల ఎల్‌ఓసీ మంజూరు చేసిన ప్రశాంత్‌రెడ్డి మేలుమరిచిపోలేమని కృతజ్ఞతలు తెలిపారు.

# పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

### మంత్రి దామోదర్ రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డి:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండల మేల సంఘం లోని కాలన్ మిల్‌లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆద్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ పత్తి రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సిసిఐ ఆద్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించామన్నారు. రైతులకు కనీస మద్దతు ధర ను కల్పించాలని సిసిఐ అధికారులను కోరారు. దళారులను నమ్మవద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కొనుగోలు కేంద్రం ద్వారా సదాశివపేట, రాయికోడ్, నారాయణఖేడ్, జోగిపేట, వాట్పల్లి, మండలాల పత్తి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పత్తి రైతులు కనీస మద్దతు ధర కోసం కపాస్ కిసాన్ మొబైల్ యాప్ ను డౌన్ లోన్ చేసుకోవాలని సిసిఐ అధికారులు కోరారు. గత వర్షాకాలం (2024–25)లో 3లక్షల 80 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి రైతులకు 200 కోట్లు రూపాయలను చెల్లించామని సిసిఐ అధికారులు మంత్రి దామోదర్ రాజనర్సింహ వివరించారు. పత్తిరైతుల ప్రయోజనాలను కాపాడాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులకు జొన్న విత్తనాలను ఉచితంగా పంఫిణి చేశారు. ఈ కార్యక్రమంలో సిసిఐ సీనియర్ కమర్షియల్ ఆపీసర్ వరుణ్ జిల్లా వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

## నిజాంసాగర్‌లోకి 27.352 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

**ప్రజాపక్షం/నిజాంసాగర్:** నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఈ వర్షాకాలం ప్రారంభం నుండే పెద్ద మొత్తంలో వర్షాల కారణంగా ఇన్‌ఫ్లో కొనసాగుతూనే ఉంది. ఇందులో భాగంగా శుక్రవారం ప్రాజెక్టు ఎగువ ప్రాంతం నుండి 27,352 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వరదనీరు వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఏఈ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ నీటిని ప్రాజెక్టు రెండు వరద గేట్లు ఎత్తివేసి 27,352 క్యూసెక్కుల నీరు మాంజీరాకు వదిలిపెడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, 17.802 టీఎంసీలకు గాను పూర్తిస్థాయి నీటిని నిల్వ ఉంచుతూ ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరదనీటిని అదే మోతాదులో మాంజీరాలోకి వదులుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.



## ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** ఎఐటియుసి జిల్లా శాఖ, మున్సిపల్, భవన నిర్మాణ కార్మిక సంఘం, బిల్డింగ్ పెయింటర్స్ వర్కర్స్ యూనియన్, ట్రాక్టర్ డ్రైవర్స్, ఆటో డ్రైవర్స్, వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏఐటీయూసి ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కార్యాలయంలో, గుడిహత్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ, బేల, జైనథ్ ప్రాంతాలలో కార్మికులు ఏఐటీయూసి జెండాలు ఎగురవేసి సంబురాలను జరుపుకున్నారు. జిల్లా కార్యాయలంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ కేక్ కట్ చేసి కార్మికులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి కార్మికుల పక్షంలో నిరంతరం పోరాటాలు చేస్తుందని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్రా దేవేందర్, డిప్యూటి ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, పెయింటర్ యూనియన్ అధ్యక్షులు టి మహేందర్, నేరడిగోండ అధ్యక్షులు పి నరసయ్య, పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తున్నాం

### కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్యే, కలెక్టర్



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** అకాల వర్షంతో తడిసిన ధాన్యాన్నిమద్దతు ధర చెల్లిస్తూ ప్రభుత్వపరంగా కొనుగోలు చేస్తున్నామని రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి సేకరిస్తున్న తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందల్వాయి మండలం గన్నారం గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే కలెక్టర్ పరిశీలించారు. తుఫాను ప్రభావంతో కురిసిన వర్షానికి తడిసిన ధాన్యం నిల్వలను పరిశీలించారు. తడిసిన ధాన్యం తరలింపులో ఏమైనా ఇబ్బందులున్నాయా ? అని ఆరా తీశారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వలు, వాటి తరలింపు, రైతులకు బిల్లుల చెల్లింపులు తదితర వివరాలపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులను కలిసి కొనుగోలు కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితి, సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించే వివరాలతో కూడిన ట్రక్ షీట్ రిపోర్టును పరిశీలించారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా కాపాడుకునేందుకు రైతులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేశామన్నారు. వీరి వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీఎస్ఓ అరవింద్‌రెడ్డి, డీసీఓ శ్రీనివాస్, సివిల్ సప్లయి జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ గోపి, తహసీల్దార్ వెంకట్‌రావు, ఎంపీడీఓ అనంతరావు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సముదాయాలను పరిశీలన**

గన్నారం శివారులో నిర్మాణ దశలో నిలిచిపోయిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ సముదాయాలను ఎమ్మెల్యే కలెక్టర్ పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు వీటిని యథాస్థితిలో కేటాయిస్తూ, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరయ్యే నిధులతో నిర్మాణాలు పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు.

## కార్మికుల పక్షాన నిలిచేది ఎఐటియుసినే

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** కార్మికుల అనేక కష్టాలను, పేదరిక నిర్మూలనకు అండగా నిలబడేందుకు ఎఐటియుసి యూనియన్‌ను స్థాపించడం జరిగిందని యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య అన్నారు. సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్, గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో ఎఐటియుసి 106వ వార్షికోత్సవాలను శుక్రవారం యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముష్కె సమ్మయ్య మాట్లాడుతూ ఎఐటియుసి స్థాపన ఆనాటి నుంచి నేటి వరకు కార్మికుల పక్షాన ఉంటూ అనేక హక్కులు సాధించిపెట్టిందన్నారు. కార్మికులు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం 4 లేబర్ కోడ్ లుగా మార్చి బడా పెట్టుబడిదారీ వ్యవస్థకు లాభాలు చేకూర్చేందుకు ప్రయత్నాలు చేస్తుందని ఆయన ఆరోపించారు. సింగరేణిలో లాభాల వాటా, దీపావళి బోనస్ తదితర హక్కులు సాధించి పెట్టడంలో ఎఐటియుసి కృషి చేసిందన్నారు. భవిష్యత్తులో కూడా కార్మికుల పక్షాన ఉండి పోరాడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి ఎం. కొమురయ్య జెండా ఆవిష్కరించారు. బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ కార్యదర్శిలు మురళి చౌదరి, దాడి రాజయ్య, మోతే లచ్చన్న, గునిగంటి నర్సింగరావు, ఆడేపు మల్లికార్జున్, నాగేశ్వరరావు, నాయకులు సంతోష్, జిపి రావు, పరుశురాం, విక్కీ, రాకేష్ పాల్గొన్నారు.

# వరిధాన్యాన్ని త్వరగా తరలించాలి



### కలెక్టర్ రాహుల్‌రాజ్

**ప్రజాపక్షం/శివ్వంపేట :** కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు తెచ్చిన వరి ధాన్యాన్ని త్వరగా తరలించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. మండల పర్యటకు వచ్చిన కలెక్టర్ రాహుల్‌రాజ్ పలు కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రాలలో వడ్లను త్వరగా తూకం వేసి రైస్ మిల్లులలకు తరలించాలని ఆయన ఆదేశించారు. రైతులు నష్టపోకుండా రైతులకు ఇబ్బందులు లేకుండా వడ్లు కొనుగోలు చేయాలని ఆయన సూచించారు. హమాలీల కొరత లేకుండా చూడాలని, లారీలు అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. వడ్లను తూకం వేయడంలో రైతులకు నష్టం కలిగించొద్దన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి, తహశీల్దార్ కమలాద్రి, రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు మైసయ్యయాదవ్, పీఏసీఎస్ సీఈఓ మధు తదితరులు పాల్గొన్నారు.

**దేశ ఐక్యత కోసం అఖండ కృషి చేసిన గొప్ప వ్యక్తి వల్లభాయ్ పటేల్**




సర్దార్ వల్లభాయ్ పటేల్ స్ఫూర్తితో దేశ సమగ్రతను కాపాడుతూ, భిన్నత్వంలో ఐక్యతకు ప్రతీకగా నిలవడానికి ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ రాజ్ ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఊపి ప్రారంభించారు. ధ్యాన్ చంద్ చౌరస్తా నుండి స్థానిక కలెక్టర్ కార్యాలయం వరకు రన్‌ను నిర్వహించారు. మన దేశంలో భిన్న మతాలు, జాతులు, భాషలు ఉన్నప్పటికీ పరస్పరం గౌరవం, సహకారంతో అన్ని వర్గాలు ఐక్యంగా జీవిస్తున్నాయని తెలిపారు. భారత యూనియన్‌లో ఉన్న అనేక సంస్థానాలు దేశంలో కలిసేందుకు సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన పాత్ర ఎంతో గొప్పదని గుర్తుచేశారు. నేటి యువత, విద్యార్థులు భారత గౌరవం, సమగ్రత, ఐక్యత గురించి తెలుసుకొని తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యత, సామాజిక స్పృహ పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్ కళాశాలకు 'స్వచ్ఛ విద్యాలయ పురస్కార్'




**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:** నిర్మల్ జిల్లాలోని ఆల్ఫోర్స్ కళాశాల విద్యారంగంలో తన ప్రతిభను చాటుకోవడమే కాక,పరిశుభ్రత,మౌలిక వసతుల నిర్వహణలో దేశంలోనే అత్యున్నత ప్రమాణాలను సాధించింది.కేంద్ర ప్రభుత్వం అందించే అత్యంత ప్రతిష్టాత్మకమైన ''స్వచ్ఛ విద్యాలయ పురస్కార్''లో ఈ కాళాశాల 5స్టార్ (గ్రీన్)రేటింగ్‌ను దక్కించుకోవడం ద్వారా జిల్లాకే గర్వకారణంగా నిలిచింది. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జె.పరశురామ్ కళాశాల యాజమాన్యాన్ని సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. స్వచ్ఛ విద్యాలయ పురస్కార్‌లో 5స్టార్ రేటింగ్ సాధించడం అనేది కేవలం పరిశుభ్రతకు దక్కిన గౌరవం మాత్రమే కాదని,విద్యార్థులకు ఆరోగ్యకరమైన,ఉత్తేజభరితమైన విద్యా వాతావరణాన్ని అందించాలనే అల్ఫోర్స్ నిబద్ధతకు ఇది నిదర్శనమని జె.పరుశురామ్ కొనియాడారు. ఈ విజయం రాష్ట్రంలోని ఇతర విద్యా సంస్థలకు ఆదర్శం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ అసాధారణ విజయం వెనుక ఉన్న కళాశాల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డికి డి.ఐ.ఇ.ఓ ప్రత్యేక ప్రశంసలు అందించారు. డా.రెడ్డి దూరదృష్టి నాయకత్వం, అపార శ్రమ, పరిశుభ్ర విద్యా వాతావరణం పట్ల నిబద్ధత అ అరుదైన ఘనత సాధించడానికి ముఖ్య కారణాలుగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. సుమారు 34 సంవత్సరాలుగా విద్యా సేవలో ఉన్న డా.నరేందర్ రెడ్డి, 54 విద్యా సంస్థలు 40,000 మందికి పైగా విద్యార్థులు ఉన్న అల్ఫోర్స్ సంస్థలను ఉత్తర తెలంగాణలో ఒక ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దుతున్నారని తెలిపారు.ఈ విజయం అల్ఫోర్స్ సంస్థలను విద్యా రంగంలోనే కాక పరిశుభ్రత, శ్రేష్ఠత లోనూ జాతీయ స్థాయిలో ముందంజలో నిలిపింది.


## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసి రాష్ట్ర కమిటి సభ్యులు కుంటాల రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం పెండింగ్‌లో ఉన్న కోడి గుడ్లు, 9,10వ తరగతుల రూ.2000 తేతనాన్ని అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన ప్రకారం రూ. 10000 వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సంఘం ఆధ్వర్యంలో ఆంధోనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు శశికల, సుజాత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ ఉత్సవాలకు అధికారులు సన్నద్ధం కావాలి

### కలెక్టర్ అభిలాష అభినవ్



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** నిర్మల్ ఉత్సవాల నిర్వహణకు సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్‌లో నిర్మల్ ఉత్సవాల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నడూ లేని విధంగా గత సంవత్సరం నిర్మల్ ఉత్సవాల పేరిట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందామని అన్నారు. నిర్మల్ జిల్లా చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని నిర్మల్ ఉత్సవాల వేదిక ద్వారా ఆవిష్కరించామని, ఈ సంవత్సరం కూడా రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి నిర్మల్ ఉత్సవాలను విజయవంతం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు సంబంధించి ఎన్టీఆర్ మినీ స్టేడియాన్ని సిద్ధం చేయాలన్నారు. సుందరీకరణ పనులు చేపట్టి, మరుగుదొడ్లు, పెయింటింగ్స్, లైటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ కొరకు ప్రత్యేక స్థలాన్ని కేటాయించాలని సూచించారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ సామాజిక మాధ్యమాలలో గుర్తింపు పొందిన జిల్లాకు చెందిన ప్రముఖులతో నిర్మల్ ఉత్సవాల కార్యక్రమ ప్రచారానికి సంబంధించి వీడియోలను రూపొందంచాలని వివరించారు. జిల్లా ప్రజల నుంచి నిర్మల్ ఉత్సవాల కార్యక్రమం నిర్వహణ గురించి ఆలోచనలు, అభిప్రాయాలు ఆహ్వానించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్,ఆర్డిఓ రత్నకళ్యాణి, డిఈఓ భోజన్న, డివైస్ఓ శ్రీకాంత్ రెడ్డి, తహసిల్దార్ రాజు, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఐక్యతకు నిదర్శనం 2కె రన్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా జరపుకురే ''ఏక్తా దివస్''(నేషనల్ యూనిటీ డే) సందర్భంగా నిర్మల్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 2కె రన్ ను ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా 2కె రన ను జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల,జెండా ఊపి ప్రారంభించారు.ఈ 2కె రన్ నిర్మల్ రూరల్ పోలీస్ స్టేషన్ నుండి ప్రరంభమై జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు కొనసాగింది.అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశ సమైక్యత,ఐక్యత,సోదర భావం పట్ల ప్రతి భారతీయుడు కట్టుబడి ఉండాలని,సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు,త్యాగాలు మన అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు.ఆయన కృషి వల్లనే భారతదేశం ఒక ఏకైక దేశంగా ఆవిర్భవించిందని,ఆయన చూపిన మార్గంలో నడిస్తేనే నిజమైన జాతీయ ఐక్యత సాధ్యమవుతుందని సూచించారు.ఏక్తా దివస్ కార్యక్రమం ద్వారా ప్రజల్లో జాతీయ ఐక్యత,సామరస్యం,పరస్పర గౌరవభావం పెంపొందించడం నిర్మల జిల్లా పోలీస్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిలతో పాటు నిర్మల్ ఏఎస్పీ రాజేష్ మీన,ఎస్పీ,ఇన్స్పెక్టర్లు,ఆర్ఐలు,ఎస్ఐలు,ఆర్ఎస్ఐలు,కానిస్టేబుళ్లు,మహిళా సిబ్బంది,పెద్ద ఎత్తున యువత,విద్యార్థులు,క్రీడాభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# రీల్

## 'కురిసే వాన' పాట ఆవిష్కరణ



నేషనల్ క్రష్ రశ్మిక మందన్న, టాలెంటెడ్ హీరో దీక్షిత్ శెట్టి జంటగా నటిస్తున్న సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమాను ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్ టైన్ మెంట్ బ్యానర్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఎమోషనల్ లవ్ స్టోరీతో దర్శకుడు రాహుల్ రవీంద్రన్ రూపొందిస్తున్నారు. ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మాతలుగా వ్యవహిస్తున్నారు. సరికొత్త ప్రేమ కథగా తెరకెక్కుతున్న ఈ సినిమా నవంబర్ 7న హిందీతో పాటు తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. ఈ సినిమా నుంచి 'కురిసే వాన..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. ఈ పాటకు రాకేందు మౌళి సాహిత్యాన్ని అందించగా కపిల్ కపిలన్ పాడారు. హేషమ్ అబ్దుల్ వాహబ్ ఛాట్ బస్టర్ ట్యూన్ కంపోజ్ చేశారు. 'కురిసే వాన తడిపేయాలన్న భూమే ఏదో, సరదా పడుతూ పురి విప్పేస్తున్న నెమలే ఏదో, ఓ నీలి మేఘం, పెంచింది వేగం, ఆ జాబిలమ్మ చెంత చేరి వంతపాడి, కమ్మితే మైకం, లాయి లాయి లాయిలే..' అంటూ వినగానే ఆకట్టుకునేలా సాగుతుందీ పాట. మెమొరబుల్ లవ్ సాంగ్‌గా 'కురిసే వాన..' లవర్స్‌తో పాటు మ్యూజిక్ లవర్స్‌కు గుర్తుండిపోనుంది. ఈ సినిమాకు సినిమాటోగ్రఫీ కృష్ణన్ వసంత్, సంగీతం హేషమ్ అబ్దుల్ వాహబ్, కాస్ట్యూమ్స్ శ్రావ్య వర్మ, సమర్పణ అల్లు అరవింద్, నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి, రచన దర్శకత్వం రాహుల్ రవీంద్రన్.

## రేజ్ ఆఫ్ కాంత రిలీజ్



వెర్సటైల్ స్టార్ దుల్కర్ సల్మాన్ బైలింగ్వల్ పీరియాడికల్ డ్రామా 'కాంత' నవంబర్ 14న రిలీజ్ కానుంది. 1950 మద్రాస్ బ్యాక్ డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రానికి సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుండగా సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారు. చిత్రాన్ని దుల్కర్ సల్మాన్ వేఫేరర్ ఫిలమ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ తో కలిసి సంయుక్తగా నిర్మిస్తున్నారు. టీజర్, సాంగ్స్‌తో ఇంపాక్ట్ క్రియేట్ చేసిన తర్వాత, మేకర్స్ ఇప్పుడు రాప్ ఆంథమ్ రేజ్ ఆఫ్ కాంత రిలీజ్ చేశారు. ఝాను చాంతర్ స్వరపరిచిన ఈ సాంగ్ అదిరిపోయింది. వింటేజ్ ఎలిమెంట్స్‌ను ఆధునిక రాప్ బీట్స్, పవర్ఫుల్ గిటార్ సౌండ్స్‌తో మేళవిస్తూ రూపొందించిన ఈ ట్రాక్ కాంత సినిమా నుండి ఎలాంటి ఎనర్జీ, ఇంటెన్సిటీని ఆశించవచ్చో చెప్పేస్తోంది.ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ డానీ సాంచెజ్ లోపెజ్, ఆర్ట్ డైరెక్షన్‌ను థా.రామలింగం. అదనపు స్క్రీన్‌ప్లేను తమిళ్ ప్రభ ఇచ్చారు. లెవెలిన్ ఆంథోనీ గోన్సాల్వేస్ ఎడిటర్.



## 'మహాకాళి' ఫస్ట్ లుక్

హనుమాన్ సినిమాప్రశాంత్ వర్మ ఆర్‌కెడి స్టూడియోస్‌తో కలిసి కొత్త చిత్రం మహాకాళి రూపొందిస్తున్నారు. ఈ సినిమా నుంచి భూమి శెట్టి ఫస్ట్ లోక్‌ను విడుదల చేశారు. ఈ సినిమా ఇప్పటికే సగం పైగా షూట్ పూర్తిచేసుకుంది. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్స్‌పై ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. నటీమణులు సూపర్ హీరో పాత్రను పోషించడానికి ఆసక్తిని వ్యక్తం చేసినప్పటికీ, కథ సారాన్ని నిజంగా ప్రతిబింబించగల కొత్త ముఖం కావాలనే నిశ్చయంతో ఆ పాత్రకు సరిపడే డార్క్ స్కిన్ టోన్ అన్నిరకాలుగా పర్ఫెక్ట్‌గా సూట్ అయ్యే భూమి శెట్టిని ఎంపిక చేశారు. మహాకాళి ఇంటెన్స్, డివైన్ ఫస్ట్ ఫస్ట్ లుక్ ఇన్‌స్టంట్‌గా హిట్ అయ్యింది. ఫస్ట్ లుక్‌లో భూమి శెట్టి ఎరుపు, బంగారు వర్ణంలో ఆగ్రహం, కరుణ రెండింటినీ ప్రతిబింబించే దివ్యమైన ఆరాతో మెరిసింది. సాంప్రదాయ ఆభరణాలు, పవిత్ర చిహ్నాలతో అలంకరించబడిన ఆమె చూపు, సృష్టిప్రళయం, విధ్వంసంపునర్జన్మ శక్తిని సూచిస్తోంది.ఈ పోస్టర్తో మహాకాళి చిత్రం ప్రశాంత్ వర్మ సినీమాటిక్ యూనివర్స్లోని అద్భుత అధ్యాయమని స్పష్టమవుతోంది. ఈ కథ హనుమాన్తో అనుసంధానమై ఉన్నదనే సంకేతాన్ని ఇస్తోంది. భారతీయ పౌరాణిక సూపర్ హీరో యూనివర్స్కి ఇది మరో మెట్టు అవుతుందనే ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది.ఆర్‌కెడి దుగ్గల్, రివాజ్ రమేష్ దుగ్గల్ నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రశాంత్ వర్మ కాన్సెప్ట్, పూజ కొల్లూరు దర్శకత్వం కలసి గ్రేట్ విజువల్ వండర్ను అందించబోతున్నాయి.

## 'పీటర్' టీజర్ విడుదల




వృద్ధి స్టూడియోస్ పతాకంపై రవి హిరేమత్, రాకేష్ హెగ్డే నిర్మాతలుగా సుకేష్ శెట్టి రచించి దర్శకత్వం వహించిన చిత్రం 'పీటర్'. రాజేష్ ధ్రువ ప్రధాన పాత్రలో నటించగా, జాన్వి రాయల, రవిక్ష శెట్టి ముఖ్యమైన పాత్రల్లో నటించారు. ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు. జెస్సీ మళ్లీ వచ్చింది.. డెవిడ్‌ను ఇక్కడకు తీసుకురా.. చెండే వాయిద్యం అంటే మాకు దైవంతో సమానం.. ఎవరైనా అవమానిస్తే ఊరుకోను' అంటూ సాగిన టీజర్ ఉత్కంఠను రేకెత్తించేలా సాగింది. 'పీటర్' టీజర్ను గమనిస్తే కేరళ సంప్రదాయం, కేరళ అందాల్ని అద్భుతంగా చూపించినట్టు కనిపిస్తోంది. టీజర్ కట్ చేసిన విధానం చూస్తుంటే.. సస్పెన్స్, థ్రిల్లర్ జానర్లో మరో అద్భుతమైన చిత్రం రానున్నట్టుగా అనిపిస్తోంది. ఈ టీజర్లో చూపించిన విజువల్స్, భయపెట్టేలా చూపించిన కెమెరా యాంగిల్స్, వెంటాడే నేపథ్య సంగీతం అన్నీ కూడా హైలెట్ అయ్యేలా కనిపిస్తోంది. పీటర్ కథ ఏంటి? జెస్సీ ఎవరు? అనే ఆసక్తికరమైన అంశాలకు త్వరలోనే సమాధానం రానుంది.రాజేష్ ధ్రువ సినిమాలో ఇంటెన్స్ పర్ఫామెన్స్‌తో, అన్ని రకాల ఎమోషన్స్ను పలికించబోతోన్నాడని అర్థం అవుతోంది. సినిమాటోగ్రాఫర్ గురుప్రసాద్ నార్నాడ్ విజువల్స్ ఎంతో సహజంగా కనిపిస్తుండగా.. రిత్విక్ మురళీధర్ సంగీతం భయాన్ని, భావోద్వేగాన్ని పెంచేలా ఉంది. ఎడిటర్ నవీన్ శెట్టి కట్స్ మరింత ఇంట్రెస్టింగ్గా అనిపిస్తోంది.'పీటర్' త్వరలోనే రిలీజ్ కానుంది. రాజేష్ ధృవ, జాన్వీ రాయల, రవిక్షా శెట్టి, రామ్ నాదగౌడ్, వరుణ్ పటేల్, ప్రతిమా నాయక్, రఘు పాండేశ్వర్, రాధాకృష్ణ కుంబ్లే, దీనా పూజారి, సిద్దు, భరత్, మను కాసర్గోడ్, రక్షిత్ దొడ్డెర తదితరులు నటించారు.

## అఖండ 2: కోసం ఓకల్స్ అందిస్తున్న సర్వేపల్లి సిస్టర్స్



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో వస్తున్న 'అఖండ 2: తాండవం'. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన అఖండ సీక్వెల్ గా వస్తున్న సినిమా ఇది. రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఎం తేజస్విని నందమూరి సగర్వంగా చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇప్పటికే విడుదలై 'అఖండ 2: తాండవం' ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. లేటెస్ట్ గా వచ్చిన బ్లాస్టింగ్ రోర్ గ్లింప్స్ పాన్ ఇండియా వైడ్ గా సెన్సేషన్ క్రియేట్ చేసింది.ఈ సినిమా బ్యాగ్రౌండ్ స్కోర్ ని నెక్స్ట్ లెవల్ లో సెన్సేషనల్ కంపోజర్ తమన్. సంస్కృత శ్లోకాలను అద్భుతంగా పఠించే నైపుణ్యం వున్న పండిట్ శ్రవణ్ మిశ్రా, పండిట్ అతుల్ మిశ్రా సోదరులతో ఇప్పటికే గూస్బంప్స్ స్కోర్ ని రికార్డ్ చేశారు.ఇప్పుడు సర్వేపల్లి సిస్టర్స్ ని పరిచయం చేస్తున్నారు. సర్వేపల్లి సిస్టర్స్ 'అఖండ 2: తాండవం' కోసం తమ డివైన్ వోకల్స్ అందించారు. థమన్ అందిస్తున్న బ్యాక్గ్రౌండ్పవర్ ఫుల్ స్కోర్లో సర్వేపల్లి సిస్టర్స్ ఎనర్జిటిక్ వోకల్స్ తో నెక్స్ట్ లెవల్ స్కోర్ లోడ్ అవుతోంది. ఈ చిత్రంలో సంయుక్త ముఖ్యపాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి ఓ పవర్ ఫుల్ పాత్రలో నటిస్తున్నారు. హర్షాలి మల్హోత్రా కీలక పాత్రలో కనిపించనున్నారు.ఈ చిత్రానికి సి.రాంప్రసాద్, సంతోష్ సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, తమ్మిరాజు ఎడిటర్. ఎఎస్ ప్రకాష్ ఆర్ట్ డైరెక్టర్.అఖండ 2: తాండవం డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## 'బైకర్' ఫస్ట్ గ్లింప్స్



శర్వానంద్ హీరోగా నటించిన తాజా సినిమా మూవీ 'బైకర్'. మోట్సాకిల్ రేసర్‌గా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో యువి క్రియేషన్స్ బ్యానర్‌పై ఈ చిత్రం నిర్మిస్తున్నారు. షూటింగ్ పూర్తయ్యే దశకు చేరుకుంది. ఫస్ట్ లుక్, టైటిల్‌తో ఇప్పటికే మంచి బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్ థియేటర్లలో ప్రత్యేకంగా ప్రదర్శించబడనుంది. బాహుబలి: ది ఎపిక్, మాస్ జాతర సినిమాలకు అటాచ్‌గా ఈ గ్లింప్స్ చూపించబోతున్నారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో రెడ్ అండ్ వైట్ కలర్ కాంబినేషన్ దుస్తుల్లో శర్వా కనిపించడం స్టైలిష్గా, కాన్ఫిడెంట్గా ఉంది. అతని పొడవాటి కర్లీ హెయిర్, సన్గ్లాసెస్ రెబెల్లియస్ టచ్ ఇచ్చాయి.ఇటీవల వైరల్ అయిన షర్ట్లెస్ ఫోటోలతో శర్వా చేసిన అద్భుతమైన ఫిజికల్ ట్రాన్స్ఫర్మేషన్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. 1990 నుంచి 2000 మధ్య బ్యాక్ డ్రాప్‌లో సాగే బైకర్ రేసింగ్ యాక్షన్ తో పాటు ఎమోషనల్, మల్టీ జనరేషనల్ ఫ్యామిలీ డ్రామా. స్పీడ్, అంబిషన్, హార్ట్ఫెల్ట్ రిలేషన్షిప్స్‌తో మూడు జనరేషన్స్ ఒకే రేసింగ్ కలతో, కుటుంబ బంధాలతో సాగే అద్భుతమైన కథ. ఈ చిత్రంలో మాళవిక నాయర్ హీరోయిన్గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకి సినిమాటోగ్రఫీ జె.యువరాజ్, మ్యూజిక్ జిబ్రాన్, అనిల్ కుమార్ పి ఎడిటర్. రాజీవన్ ప్రొడక్షన్ డిజైనర్. ఎ పన్నీర్ సెల్వం ఆర్ట్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు, ఎన్ సందీప్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

# ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎఐటియుసి సారధ్యంలో దేశ స్వాతంత్ర్యానికి ముందు ఆ తర్వాత కార్మికుల అవిశ్రాంత పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం కాలరాస్తూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తోందని ఎటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజు అన్నారు. ఎఐటియుసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం వద్ద బాల్‌రాజ్ ఎఐటియుసి జెండాను ఎగురవేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అనుబంధ కార్మిక సంఘాలు, కార్యకర్తలకు, నాయకులకు ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి తరపున శుభాకాంక్షలు తెలిపారు. 1920 అక్టోబర్ 31న బొంబాయిలో ఆవిర్భవించిన ఎఐటియుసి అనేక పోరాటాలు, ఉద్యమాలు, దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని పోరాడుతునే 1923లో ప్రమాద నష్టపరిహార చట్టం బ్రిటీష్ ప్రభుత్వ మెడలు వంచి సాధించుకోవటం జరిగిందన్నారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి గత 11ఏళ్ల కాలంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు, బడావ్యాపారస్తులకు, ధనవంతులకు మేలు చేసే ఉద్దేశంతో అనేక త్యాగాల ఫలితంగా సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను సంపూర్ణంగా రద్దు చేసి, 4 కోడ్‌లు తీసుకొచ్చి కార్మికవర్గానికి ఎనలేని అన్యాయం చేస్తున్నరన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు మరింత సమరశీల ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని ఆయన కార్మికులను కోరారు.

ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి యం.నర్సింహ్మా, రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం, భవన నిర్మాణ కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు మారగోని ప్రవీణ్‌కుమార్, ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి, బొడ్డుపలి కిషన్, పి.వెంకటయ్య, చెట్టుకింది శ్రీనివాస్, క్రిష్ణమూర్తి, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## డీప్ ఫేక్‌పై అసెంబ్లీలో చట్టం : చిరంజీవి



**హైదరాబాద్, అక్టోబర్ 31 :** పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సెలబ్రిటీలను డీప్ పేక్‌తో ఇబ్బందులకు గురి చేస్తున్న వారిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో ఒక చట్టం తీసుకురావలసిన అవసరం ఉందని కేంద్ర మాజీ మంత్రి, సిని నటుడు చిరంజీవి అభిప్రాయపడ్డారు. డీప్ పేక్ నివారణకోసం కొత్త చట్టాన్ని తీసుకురావడానికి పోలీసులు బలంగా కృషి చేస్తున్నారని చిరంజీవి చెప్పారు. తెలంగాణ పోలీసు శాఖా ఆధ్వర్యంలో జరిగిన రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్న చిరంజీవి డీప్ ఫేక్‌పై స్పదించారు. ఈ విషయాన్నీ డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ సీరియస్‌గా తీసుకున్నారు. ఇది మనకు ఒక గొడ్డలి పెట్టు ఒక చట్టం తీసుకొచ్చే దిశగా పోలీస్ వ్యవస్థ ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళు అనుకున్నది నెరవేరుతుంది. సామాన్యులకు సైతం ఇలాంటి అవాంతరాల నుంచి రక్షణ లభిస్తుంది. మంచి జరుగుతున్నప్పుడు చేదు కూడా పుట్టుకొస్తుంది. సాంకేతిక రంగాన్ని స్వాగతించాలి కానీ ఈ క్రమంలోనే కొంత చెడు కూడా వస్తుంది. దీన్ని ఎలా ప్రక్షాళన చెయ్యాలనేది పోలీసులు కసరత్తు చేస్తున్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకరిస్తుంది. అసెంబ్లీలో చట్టాలు తీసుకొస్తారు. ఇలాంటి ఆటలు కొనసాగనివ్వకుండా చేస్తారు. నేను బలంగా నమ్ముతున్నాను అని చిరంజీవి చెప్పారు.

## 'బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్'లో చేర్చాలి

### కేంద్ర ప్రభుత్వానికి టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసి రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని టిజెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'బిసి రిజర్వేషన్లను 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ హైదరాబాద్, బషీర్‌బాగ్‌లని దేశోద్ధారక భవన్‌లో శుక్రవారం సదస్సును నిర్వహించనున్నట్టు తెలిపారు. టిజెఎస్ కార్యాలయంలో శుక్రవారం టిజెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి రమేష్, బిసి జన సమితి రాష్ట్ర కన్వీనర్ జశ్వంత్ కుమార్,నాయకులు హనుమంత్ రెడ్డి, రాంచందర్, దిలీప్ కుమార్‌తో కలిసి వినయ్ కుమార్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన విషయంలో కేంద్రం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. బిసి రిజర్వేషన్ల సదస్సను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కార్మిక వర్గంపై మోదీ సర్కార్ కక్ష

### ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వ కార్మిక వర్గంపై కక్ష కట్టిందని ఎఐటియూసి తెలంగాణ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ అన్నారు. ఎఐటియూసి 106వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌గోల్నాక లేబర్ అడ్డా వద్ద నరసింహ ఎఐటియూసి పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎఐటియూసి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి అధ్యక్షత జరిగిన సభను ఉద్దేశించి నరసింహ మాట్లాడుతూ ప్రధాని మోదీ కార్మిక వ్యతరేక విధానాల వల్ల అభద్రతా ఉద్యోగాలు, సామాజిక భద్రత లేకపోవడం, దోపిడీ పని పరిస్థితులు, తక్కువ వేతనాలు, యూనియన్ల విధ్వంసంతో కార్మికుల బతుకులు ప్రమాదకరంగా మారుతున్నాయని చెప్పారు. కార్మిక వ్యతరేక బిజెపి నయా ఫాసిస్ట్ ధోరణులకు వ్యతరేకంగా కార్మిక వర్గం తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. ఇందుకు కార్మికులు సంఘటితంగా కార్యచరణ రూపొందించుకొని పోరాటాలకు సిద్ధం కావాలని నరసింహ పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశం మాట్లాడుతూ పోరాటాలు, త్యాగాలతో 105 సంవత్సరాలు పూర్తి చేసుకున్న దేశంలో మొట్టమొదటి జాతీయ ట్రేడ్ యూనియన్ ఏఐటీయూసీ అని గుర్తు చేశారు. కమతం యాదగిరి మాట్లాడుతూ శతాబ్దానికి పైగా కార్మిక వర్గానికి అనుకూలంగా మార్పులు తీసుకురావడానికి జరిగిన అన్ని పోరాటాలలో ఎఐటియూసి ముందంజలో ఉందన్నారు. కార్మికుల హక్కుల సాధనలో ఎఐటియూసి పోరాట చరిత్ర స్ఫూర్తిదాయకమైందని, కార్మికుల ఐక్యతే నిజమైన బలం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐటియూసి హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. వెంకటయ్య, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్‌ఈ, హైదరాబాద్ జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు చెట్టుకింద శ్రీనివాస్, గోల్నాక అడ్డా నాయకులు కాశయ్య, గాజుల శ్రీనివాస్, లింగస్వామి. ఎస్.నాగరాజ్, రాము, వి.రవి, భూషయ్య, శీను, శైలేష్, గణేష్, కె.రవి నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరించిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ నూతన పాలకమండలి

### ప్రెస్‌క్లబ్ ఫ్యామిలీ క్లబ్‌గా మార్చి తీరుతాం: కొత్త కార్యవర్గం హామీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ 2025–2027 నూతన కార్యవర్గం నిరాడంబరంగా బాధ్యతలు చేపట్టింది. గత ఆదివారం జరిగిన ఎన్నికలలో ఫ్రెండ్స్ ప్యానల్ ఘన విజయం సాధించింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ ఆవరణలో నూతనంగా ఎన్నికైన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.విజయ్ కుమార్ రెడ్డి, రమేష్ వరికుప్పల, ఉపాధ్యక్షులుగా అరుణ అత్తలూరి, ఎ.రాజేష్, సంయుక్త కార్యదర్శులుగా చిలుకూరి హరి ప్రసాద్, బాపు రావు, కోశాధికారిగా రమేష్ వైట్ల బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులు ఎన్.ఉమాదేవి, మర్యాద రమాదేవి, కళ్యాణం రాజేశ్వరి, శిగ శంకర్, కస్తూరి శ్రీనివాస్, వనం నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, రచన, అశోక్ దయ్యాల, సత్యనారాయణ(సత్తిబాబు), అమిత్ భట్టు బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్‌అకాడమీ మాజీ చైర్మన్ సీనియర్ పాత్రికేయులు దేవులపల్లి అమర్ సమక్షంలో పాత పాలకమండలి మినిట్స్ బుక్‌ను నూతన కార్యవర్గానికి అందజేసింది. ఎన్నికలకు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి సహాయ కార్యదర్శి కొండ శ్రీనివాసులు నూతనంగా ఎన్నికైన పాలకమండలి సభ్యులకు ధృవీకరణ పత్రాలను ప్రధానం చేశారు. తెలుగు రాష్ట్రాలలో ప్రతిష్టాత్మక క్లబ్‌గా పేరున్న హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌ను మరింత అభివృద్ధి చేయడంతో పాటు క్లబ్ సభ్యుల సంక్షేమం కోసం పని చేయాలని నూతన పాలకమండలికి సీనియర్ పాత్రికేయులు సూచించారు. తమపై ఎంత విశ్వాసంతో ఓటు వేసి గెలిపించిన సభ్యుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని నూతన పాలకమండలి ప్రకటించింది. ఎన్నికల వరకే వేర్వేరు ప్యానల్స్ అని ఎన్నికలు ఎన్నికలు ముగిశాక పోటీ చేసిన వారందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని నూతన పాలకమండలి స్పష్టం చేసింది. ప్రెస్ క్లబ్ పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వేణుగోపాల్ నాయుడు ఆర్.రవికాంత్ రెడ్డిలు తమ బాధ్యతలను కొత్త కమిటీకి అప్పగించారు. ఆరు దశాబ్దాల చరిత్ర గల ప్రెస్ క్లబ్‌ను ఫ్యామిలీ క్లబ్‌గా మార్చడంతో పాటు సభ్యులకు ఇచ్చిన హామీలన్నింటిని నిలుపుకుంటామని నూతన పాలకమండలి ఈ సందర్భంగా హామీ ఇచ్చింది. నవంబర్‌లో ఫ్యామిలీ గెట్ టుగెదర్ నిర్వహించడంతో పాటు వివిధ నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని పాలకమండలి ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో టియుడబ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షుడు కె.విరహత్ అలీ, కార్యవర్గ సభ్యులు బొమ్మగాని కిరణ్‌కుమార్, రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు సురేందర్, సీనియర్ జర్నలిస్టులు రెహమాన్, , సిజి కె మూర్తి సహా పలువురు హాజరయ్యారు.

## ఐఎఎస్ అధికారుల బదిలీ

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో ఎనిమిది మంది ఐఎఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాల స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సవ్యసాచి ఘోష్ నియమితులయ్యారు. ఘోష్ సంక్షేమ శాఖ ప్రత్యేక సిఎస్‌గానూ కొనసాగనున్నారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఇలంబర్తి బదిలీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ కార్యదర్శి కమిషనర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కమిషనర్గా ఇలంబర్తి బదిలీ కాగా, పశుసంవర్ధక శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సిఎస్ రామకృష్ణారావు వద్దే మెట్రో పొలిటన్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శి బాధ్యతలు ఉంచుకున్నారు. జిఎడి కార్యదర్శిగా ఇ.శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. టిజి ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా యాస్మిన్ భాషాకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎస్‌సి అభివృద్ధి కమిషనర్‌గా జి.జితేందర్ రెడ్డి బదిలీ కాగా ఎస్‌సి సహకార సంస్థ ఎండిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు ప్రత్యేక కార్యదర్శిగా బి.సైదులుకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

## రూ. 5,265 కోట్ల ఆస్తి నష్టం

(మొదటి పేజీ తరువాయి)

సహాయక, పునరుద్ధరణ పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తున్నామని, అదే సమయంలో వేగంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టామని అన్నారు. తుఫాన్ కారణంగా భారీ నష్టం జరిగిందని, సుమారు 1,500 మంది సిబ్బంది పరిస్థితిని చక్కదిద్దే పనిలో నిమగ్నమయ్యారని వివరించారు. చాలా ప్రాంతాల్లో 24 గంటల్లోగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్టు రవి కుమార్ పేర్కొన్నారు. వ్యవసాయ, అక్వాకల్చర్ విద్యుత్ సరఫరాను 48 గంటల్లోగా పునరుద్ధరిస్తామని అన్నారు. గతంలో ఇలాంటి విపత్తులు జరిగినప్పుడు ఏమాత్రం స్పందించని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్‌సిపి చీఫ్ జగన్మోహన్ రెడ్డికి ఇప్పుడు తుఫాన్ పనులపై వ్యాఖ్యానించే నైతిక హక్కు లేదని అన్నారు. ముందు జాగ్రత్తలు తీసుకున్నందు వల్లే ఈ తుఫాన్ వల్ల భారీ ప్రాణ నష్టం జరగలేదని పేర్కొంటూ, బహుశా జగన్మోహన్ రెడ్డి ఇందుకు నిరాశ చెంది ఉంటారని ఎద్దేవా చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com